RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers



హైదరాబాద్ 12 మే 2026 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:289

## రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ను కలిసిన రేవంత్ రెడ్డి



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిజూన్ 12 న పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులతో నిర్వహించే సభకు గవర్నర్ ను ఆహ్వానించిన ముఖ్యమంత్రి.

విద్యార్థులు పొగాకు, మద్యం ,మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, బాధ్యతగల పౌరులుగా ప్రవర్తించాలని సభ లో సామూహిక ప్రతిజ్ఞ చేయించనున్న ప్రభుత్వం.మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి గతంలో సూచించిన గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా. గవర్నర్ సూచన ను గౌరవిస్తు విద్యార్థులతో భారీ సభ ఏర్పాటు చేసి యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించనున్న ప్రభుత్వం..

## బండి భగీరథ్ కేసుపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్.. డీజీపీకి తక్షణ విచారణ ఆదేశం



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిహైదరాబాద్, మే 11: పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై నమోదైన కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితీవ్రంగా స్పందించారు. కేసు దర్యాప్తును వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర డీజీపీ సివి అనంద్ కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.మే 8న ఫిర్యాదు అందినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి డీజీపీని ప్రశ్నించినట్లు సమాచారం. కేసు పురోగతిపై పూర్తి వివరాలను డీజీపీ సీఎంకు నివేదించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటన కారణంగా పోలీసు సిబ్బంది మొత్తం భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారని డీజీపీ వివరించారు. దీంతో కేసు విచారణలో కొంత ఆలస్యం జరిగిందని ఆయన తెలిపారు.అయితే ఈ వివరణతో సంతృప్తి చెందని సీఎం, కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.కేసు సమగ్ర విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాలను (రామి తరహాలో) ఏర్పాటు చేయాలని సీఎం డీజీపీకి సూచించారు. విచారణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.బండి భగీరథ్ కేసుపై సీఎం నేరుగా జోక్యం చేసుకోవడం రాజకీయ, పరిపాలనా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. త్వరలోనే ఈ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## పూర్తి స్థాయి వైద్య సేవలు అందించేలా సనత్‌నగర్ టిమ్స్‌ను తీర్చిదిద్దాలి మంత్రి దామోదర్ రాజనర్సింహ



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి పేషెంట్లకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేలా సనత్‌నగర్ టిమ్స్‌ను తీర్చిదిద్దాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌పై మంత్రి సోమవారం రివ్యూ చేశారు. సెక్రటేరియట్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, జాయింట్ సెక్రటరీ అయేషా, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రయల్ రన్‌లో భాగంగా అందిస్తున్న వైద్య సేవల వివరాలను, ఎదురవుతున్న ఇబ్బందులు, లోపాలను అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా.. ఓపీ రిజిస్ట్రేషన్, కన్సల్టేషన్ రూమ్‌లు, వెయిటింగ్ ఏరియా, డయాగ్నస్టిక్స్, రేడియాలజీ డిపార్ట్‌మెంట్, ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్లు, వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. ట్రయల్ రన్‌లో భాగంగా 22 డిపార్ట్‌మెంట్లలో ఓపీ సేవలు అందిస్తున్నామని అధికారులు తెలిపారు. ఆపరేషన్ థియేటర్లు (రూం) శస్త్రచికిత్సలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రోగ నిర్ధారణ కోసం అత్యాధునిక సీటీ స్కాన్ (CT Scan), ఎంఆర్ఐ (MRI), డిజిటల్ ఎక్స్-రే మిషన్ల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. డయాగ్నస్టిక్స్ యంత్రాలు ఇన్‌స్టాలేషన్ పూర్తి అయిందని తెలిపారు. ట్రయల్ రన్‌లో భాగంగా టెస్టులు నిర్వహిస్తున్నామని చెప్పారు. సనత్‌నగర్ టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కార్డియాక్ కేర్, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌గా తీర్చిదిద్దాలని గతంలోనే అధికారులకు మంత్రి సూచించారు. ఇందుకు అనుగుణంగా అన్నిరకాల గుండె సంబంధిత ఆపరేషన్లు చేసేలా, అవయవమార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించేలా క్యాథల్యాబ్స్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ థియేటర్ల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. క్యాథల్యాబ్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయని, ట్రయల్ రన్‌కు సిద్ధంగా ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. మెడికల్ సర్వీసెస్‌తో పాటు సానిటేషన్, సెక్యూరిటీ వంటి నాన్ మెడికల్ సర్వీసెస్ విభాగాలు కూడా పటిష్టంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. పేషెంట్లు, వారి అటెండెంట్లకు భోజన సదుపాయం కల్పించాలని, అటెండెంట్ల కోసం ధర్మశాలను సైతం సిద్ధం చేయాలని మంత్రి సూచించారు.

## బండి సంజయ్ కుమారుడిపై తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి కక్షపూరితంగా వ్యవహరించడం లేదు మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి గా మీరే స్వయంగా మీ కుమారుడి పై వచ్చిన ఆరోపణలను విచారణ చేయాలని కోరాల్సిందిమీ మీద కుట్ర చేస్తున్నారని , సానుభూతి పొందే ప్రయత్నం ఆపాలి.అమ్మాయి మిమ్మల్ని కలిసిన మాట వాస్తవమా కాదా, అమ్మాయితో బాబు తిరిగిన మాట వాస్తవమా కాదా వాటిని నిరూపించుకునే ప్రయత్నం చేయాలి.ముందు మీ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలిపొరపాటు జరిగినా మీరు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉండి చట్టం తన పని తాను చేసుకునే విధంగా ఉండాలని కోరుకుంటున్నాఎవరి పట్ల తెలంగాణ ప్రభుత్వానికి వివక్ష లేదు,తెలంగాణ బిడ్డలను కాపాడుకునే బాధ్యత ప్రభుత్వానికి ఉందితప్పకుండా తెలంగాణ ఆడబిడ్డలకు విశ్వాసం కలిగిస్తున్న..ఇలాంటి చర్యల్లో బాధితులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందిమున్నూరు కాపు సంఘ నాయకులు వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. ఆ అమ్మాయి కూడా మున్నూరు కాపు చెందిన అమ్మాయి అని తెల్సింది.ఇందులో ఎవరు ఎవరిని బ్లేమ్ చేయడానికి వాడడం లేదుముఖ్యమంత్రి డిజిపితో మాట్లాడి విచారణకు ఆదేశించారుమహిళా డీసీపీ అధికారి తో విచారణ జరుగుతుంది.దోషులు ఎంతటి వారైనా చట్టం ముందు తప్పించుకోలేరునిష్పక్షపాతంగా విచారణ జరపాలని స్వయంగా ముఖ్యమంత్రి డీజీపీ ని ఆదేశించారు.రాజకీయ ఒత్తిడి జరిగి విచారణలో ఎలాంటి మార్పులు ఉండవుఅటువంటి సంఘటనలు జరిగి ఉంటే దోషి మీద కఠిన చర్యలు తీసుకోవడం లో వెనకడుగు వేసే ప్రసక్తి లేదుఈ అంశంలో బీసీ ల అంశం తెరమీదకు తేవడం సరికాదు.అధికారాన్ని అడ్డం పెట్టుకొని విచారణకు అడ్డుకుంటే ప్రజాస్వామ్యం గౌరవించదుఇలాంటి సంఘటనలు జరిగినపుడు మన వ్యక్తిత్వానికి ఇబ్బంది అయినప్పుడు ఒక అడుగు ముందుకు వేసి మనమే విచారణకు ఆదేశించాలిముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పోలీసులు పూర్తిస్థాయి విచారణ జరిగి దోషులు కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నా.

## ఎరువుల కంపెనీల ప్రతినిధులతో



మంత్రి తుమ్మల సమీక్ష

వార్త 2 లో

## చెన్నైలో స్టాలిన్ నివాసానికి వెళ్లిన సీఎం విజయ్

### తమిళనాడు సీఎం విజయ్, మాజీ సీఎం స్టాలిన్‌తో భేటీ
### ఎమ్మెల్యేగా ప్రమాణం చేశాక స్టాలిన్ నివాసానికి వెళ్లిన సీఎం విజయ్‌ను ఆలింగనం చేసుకుని శాలువాతో సత్కరించిన స్టాలిన్
### ఈ సమావేశంలో ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నవైనం





తమిళనాడు నూతన ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్.. డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నాడు అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, ఆయన నేరుగా చెన్నైలోని స్టాలిన్ నివాసానికి వెళ్లారు. తన నివాసానికి వచ్చిన ముఖ్యమంత్రి విజయ్‌ను స్టాలిన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయ్‌ను ఆత్మీయ ఆలింగనం చేసుకుని, శాలువాతో సత్కరించారు. ఈ భేటీలో స్టాలిన్ కుమారుడు, మాజీ మంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు.

డీఎంకే మిత్రపక్షాలైన కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎంల మద్దతుతోనే విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. టీవీకే పార్టీకి మద్దతు ఇచ్చే విషయంలో తమ మిత్రపక్షాలకు స్టాలిన్ పూర్తి స్వేచ్ఛ కల్పించారు. ఈ నేపథ్యంలోనే, ముఖ్యమంత్రి పీఠం ఎక్కేందుకు పరోక్షంగా సహకరించిన స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకే విజయ్ ఆయనను కలిసినట్లు తెలుస్తోంది. సీఎం బాధ్యతలు చేపట్టాక విజయ్, స్టాలిన్‌ను కలవడం ఇదే తొలిసారి. ఈ భేటీ తమిళ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తించింది.

## నిమ్స్ లో మాస్టర్ హెల్త్ చెక్ అప్ క్యాంపు నిర్వహించాలని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి విజ్ఞప్తి .

### సానుకూలంగా స్పందించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ .
### మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి కృతజ్ఞతలు తెలిపిన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు.



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి హైదరాబాద్ ,మే 12: తెలంగాణ రాష్ట్ర అవతరణ వారోత్సవాన్ని (జూన్ – 2) పురస్కరించుకొని నిమ్స్ ఆసుపత్రిలో సోమాజిగూడ లోని ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ ఉచితంగా మాస్టర్ హెల్త్ చెకప్ క్యాంప్ ను నిర్వహించాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షురాలు అరుణ అత్తలూరి లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారికి రాష్ట్ర సచివాలయంలో కలసి వినతి పత్రం సమర్పించారు.

హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సభ్యులకు ప్రత్యేకంగా నిమ్స్ ఆసుపత్రిలో మాస్టర్ హెల్త్ చెకప్ నిర్వహించాలని క్లబ్ పాలకమండలి మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి చేసిన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులు రెగ్యులర్ గా తమ హెల్త్ ను చెకప్ చేసుకోవాలని మంత్రి సూచించారు. నిమ్స్ లో హెల్త్ చెకప్ కు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టినాను మంత్రి ఆదేశించారు. ప్రెస్ క్లబ్ సభ్యులకు మాస్టర్ చెకప్ క్యాంపు ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి, ప్రభుత్వానికి ప్రెస్ క్లబ్ పాలకమండలి కృతజ్ఞతలు తెలిపారు

# మహిళా రిజర్వేషన్ బిల్లు' పై కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ ఆర్ పి ఐ(ఏ) ధర్నా

## మహిళలకు 33% వాటా అనేది దేశాభివృద్ధిలో కీలకమైన మైలురాయి

## రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి శివ నాగేశ్వరరావు

హైద్రాబాద్ మే 11: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకువచ్చిన 'మహిళా రిజర్వేషన్ బిల్లు'కు మద్దతుగా రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే)'సోమవారం ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ

గౌరవనీయులైన అమ్మా,

భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా,

గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకువచ్చిన చారిత్రాత్మక 'నారీ శక్తి వందన్ అధినియం' (మహిళా రిజర్వేషన్ బిల్లు) పట్ల మా 'రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే)' సంపూర్ణ మద్దతును ప్రకటిస్తోందన్నారు చట్టసభల్లో మహిళలకు 33% వాటా కల్పించడం అనేది దేశాభివృద్ధిలో ఒక కీలక మైలురాయి.

భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలుకన్న మహిళా సాధికారతను నిజం చేస్తూ, గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయే (చీణూ) ప్రభుత్వం చారిత్రాత్మకమైన 'మహిళా రిజర్వేషన్ బిల్లు'ను తీసుకురావడం జరిగింది.



చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పిస్తూ మోడీ గారు తీసుకున్న ఈ నిర్ణయం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ పరిణామమన్నారు. ఇది మహిళా లోకానికి దక్కిన గొప్ప అదృష్టంగా మా పార్టీ భావిస్తోంది.

అయితే, మహిళలకు ఇంతటి గొప్ప మేలు జరుగుతుంటే, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ , మల్లికార్జున ఖర్గే మరియు వారి మిత్రపక్షాలు ఈ బిల్లు పట్ల వ్యవహరించిన తీరు, వారి వ్యతిరేక వైఖరి అత్యంత విచారకరం. ఇది ఆ పార్టీకి మహిళల పట్ల ఉన్న చిత్తశుద్ధి లేమిని తెలియజేస్తోంది.

ఈ నేపథ్యంలో, ఎన్డీయే భాగస్వామ్య పక్షమైన మా 'రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే)' జాతీయ అధ్యక్షులు మరియు కేంద్ర మంత్రివర్యులు అయిన రాందాస్ అథవాలే ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో ఈ బిల్లుకు అనుకూలంగా నిర్వహించిన ఈ ధర్నాకు రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ నాయకులు డాక్టర్ సంఘం శ్రీధర్, రాష్ట్ర నాయకులు దాచారపు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డి రవికుమార్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఆర్పీ నీల, పొలిటికల్ ఉమెన్స్ అధ్యక్షులు గంగాపురం పద్మ, జగన్నాథం రాజిరెడ్డి, అసేంట్ ఓనర్ సెక్రెటరీ ఎన్ ఆర్ సి రాజు, ఏఐఆర్ఆర్టీ సెక్రెటరీ నర్సింగ్ రావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సాంబ తదితరులు పాల్గొన్నారు

# ప్రతిభావంతులైన మాతృమూర్తులకు పురస్కారాలు




హైద్రాబాద్ మే 11 :సృష్టిలో మనకు జన్మ ఇచ్చి తన రక్తాన్ని పాలుగా మార్చి మనల్ని పెంచిన అమ్మకు మించిన దైవం లేదని

వేదాలు కూడా మొదట అమ్మనే దైవంగా పేర్కొన్నాయని అయోధ్య నుంచి వచ్చిన రామ భక్తి ప్రచార వేత్త మోహిత్ శరన్ జి మహారాజ్ ,సుప్రసిద్ధ ఆధ్యాత్మిక వేత్త చండీ పీఠం అధిపతి అవసరాల ప్రసాద శర్మ పేర్కొన్నారు

మాతృదేవోభవ సత్సంగ్ పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ కాన్ఫరెన్స్ హాల్ సూర్యలోక్ కాంప్లెక్ అబిడ్స్ లో నిర్వహించిన మాతృ దినోత్సవ వేడుకలలో వివిధ రంగాలకు చెందిన 20 మంది పైగామాతృమూర్తులకు మాజీ మంత్రి ,కాంగ్రెస్ ఎఛఛ సభ్యురాలు శ్రీమతి లక్ష్మీ దేవి స్మారక అవార్డులను ప్రదానం చేశారు మొదట అవార్డును అమ్మలు లేని ఆడపిల్లలకోసం ఒక అనాధాశ్రమాన్ని 20ఏళ్ళుగా నిర్వహిస్తున్న తెన్నేటి నరసింహమూర్తి కి ఇవ్వటం విశేషం మాతృదేవోభ జాతీయ అధ్యక్షురాలు శివలెంక ఉదయలక్ష్మి, వ్యవస్థాపక అధ్యక్షులు కేబి శ్రీధర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు

సీనియర్ పాత్రికేయులు ఎస్ వి సూర్యప్రకాశరావు అధ్యక్షణ జరిగిన ఈ సభలో శ్రీ నూకల సూర్యనారాయణ దైవజ్ఞ శర్మ పీపుల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధినేత బాలకృష్ణ,

రాజకీయవేత్త దయానంద్, మూర్తి ప్రముఖ రచయిత్రి శశి బాల సామాజికవేత్తలు సుధాకర్ గుప్తా వేల్పూరి శ్రీనివాస్ సాంబశివరావు ప్రకృతి ఉమామహేష్ కుదుష్ భాష నాగభూషణం ప్రసంగించారు నాదెండ్ల సుధాకర్ డాక్టర్ పద్మిని చిత్ర రూప దేవి తదితరులు పాల్గొన్నారు

గిటారారావు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు

కుమారి భావిక వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థికి వెస్సో సాయం



హైద్రాబాద్ మే 11;నూజివీడు మండలం ముక్కెళ్ళపాడు నివాసి సాతవల్లి మోహన్ కృష్ణ (22) విజయవాడ వికాస్ కాలేజీలో బి.టెక్ 3వ సంవత్సరం చదువుతున్నాడు.

బైక్ పై వెళ్తున్న సమయం లో ట్రాక్టర్ ఢీ కొట్టిన ప్రమాదంలో మోహన్ కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో మోహన్ కృష్ణ ముక్కు, పెదాలు మరియు నాలుక తీవ్రంగా దెబ్బతిన్నాయి; 10 పళ్ళు కూడా కోల్పోయాడు. విజయవాడ లోని క్యాపిటల్ ఆసుపత్రి లో నాలుక మరియు ముక్కుకు సంబంధించి రెండు శస్త్రచికిత్సలు ఇప్పటికే జరిగాయి. ఇప్పటివరకు చికిత్స కోసం సుమారు రూ.3 లక్షలు ఖర్చు చేసారు. ఇంకా రెండు ముఖ్యమైన చికిత్సలు, అనగా పళ్ల కోసం రూట్ కెనాల్ ట్రీట్మెంట్ మరియు ముక్కుకు మరో శస్త్రచికిత్స చేయవలసిన అవసరం ఉంది!

మోహన్ తండ్రి శేషాచారి కార్పెంటర్ గా స్వల్ప ఆదాయంతో జీవిస్తున్నారు. కుమారుని చికిత్స కోసం, ఇంటిలోని బంగారు ఆభరణాలను విక్రయించారు, అప్పులు కూడా చేసారు. ఈ పరిస్థితుల్లో వెస్సో గురించి తెలుసుకొని, తన కుమారుని చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించ వలసినదిగా శేషాచారి వెస్సో ట్రస్ట్ ను అభ్యర్థించారు. వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో శేషాచారికి 45,000 అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ అనుకోని ఆపద తో, విద్యకు దూరమై, మాట్లాడ లేని స్థితిలో, మంచానికే పరిమితమై, కేవలం ద్రవాహారంతో జీవనం సాగిస్తున్న మోహన్ కృష్ణ కు ఆర్థిక సహాయం చేసి ఆదుకొన్న గౌరవ దాతలకు పేరుపేరునా హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు.

# ఓటరు జాబితా సవరణలో వేగం పెంచండి

## సీఈఓ సుదర్శన్ రెడ్డి




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం మే 11:**ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 2002 నుండి ఉన్న ఓటరు జాబితాను 2025 ఓటరు జాబితాకు అనుగుణంగా సవరించే మ్యాపింగ్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా 90 శాతం పూర్తి చేయాలని ఎఆర్ఓ, ఈఆర్ఒలకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు.

సోమవారం జిల్లా కలెక్టర్లతో సచివాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ 2002 నుండి ఉన్న ఓటరు జాబితాను 2025 ఓటరు జాబితాకు అనుగుణంగా సవరించే మ్యాపింగ్ ప్రక్రియలో ఎక్కడైతే బి ఎల్ ఓ లు 100% పని పూర్తి చేశారో, వారి సేవలను పని నెమ్మదిగా సాగుతున్న ఇతర ప్రాంతాల బి ఎల్ ఓ లకు సహాయం చేయడానికి ఉపయోగించుకోవాలన్నారు. ఇప్పటికీ కొన్ని పట్టణ ప్రాంతాల్లో ఒకటి లేదా రెండు యూనిట్లు కూడా పూర్తి చేయని వారు, అంటే 0% ప్రగతి ఉన్న దీూాలు ఉన్నారని, అటువంటి వారిని గుర్తించి 10% లేదా 25% కంటే తక్కువ ప్రగతి ఉన్న వారిని గుర్తించి, వారికి తగిన సహాయం అందించి పని త్వరగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. అర్బన్ పాకెట్స్‌లో సాయంత్రం వేళల్లో లేదా వీకెండ్స్ (వారాంతాల్లో) విజిట్ చేస్తే మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. సమయాన్ని సద్వినియోగం చేసుకొని లక్ష్యాలను పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చనిపోయిన వారు మరియు శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్ళిన ఓటర్ల వివరాలపై చర్యలు తీసుకోవాలని, కొంతమంది ఇ ఆర్ ఓ లతో మాట్లాడినప్పుడు వారు 80-90% పని పూర్తి చేశామని, కేవలం ఈ చనిపోయిన మరియు వలస వెళ్ళిన వారి వివరాలు మాత్రమే మిగిలి ఉన్నాయని చెప్పారు. సరైన నిబంధనలు పాటించి, వారికి నోటీసులు ఇచ్చి, ఓటర్ల జాబితా నుండి అటువంటి పేర్లను తొలగించడం వల్ల ప్రగతి కనిపిస్తుందని సూచించారు. బిఎల్ఓలతో ఇంటింటికి వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలన చేయాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ మ్యాపింగ్ ప్రక్రియలో క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని అదేవిధంగా ఈ ప్రక్రియను పకడ్బందిగా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన చోట రాజకీయ పార్టీ నుండి అదనపు సిబ్బందిని, కంప్యూటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో చూస్తే గత మీటింగ్‌కు ఇప్పటికీ 5.2% పురోగతి కనిపిస్తోందని తెలిపారు. ముఖ్యంగా 10% నుండి 15% కంటే తక్కువ ప్రగతి ఉన్న వారిని వ్యక్తిగతంగా మీటింగ్స్‌కు పిలిచి వారికి మార్గనిర్దేశాలు ఇస్తున్నామన్నారు. నిర్దేశిత గడువులోగా మ్యాపింగ్ లో మంచి పురోగతి చూపిస్తామని తెలిపారు. క్రమం తప్పకుండా బిఎల్ ఓల పని విధానాన్ని పర్యవేక్షిస్తున్నామన్నారు.అలాగే రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల (=ఔూ) విషయానికి వస్తే, జోనల్ కమిషనర్లందరూ తమ సిబ్బందిని పంపి అవగాహన కార్యక్రమాలు మరియు మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారని, రాజకీయ పార్టీల నుండి కూడా బి.ఎల్.ఏ (దీూా)లను ఇన్వాల్వ్ చేస్తున్నామన్నారు. ఇప్పటికే బి.ఎల్.ఓ (దీూా)లతో వారిని ట్యాగ్ చేశామని తెలిపారు. అదనంగా కొంతమంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించుకొని, అవసరానికి అనుగుణంగా ఐదు నియోజకవర్గాల్లో వారిని కేటాయించి మ్యాపింగ్ చేయిస్తున్నామన్నారు.

# కేంద్ర మంత్రికి సహకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్ కేంద్ర మంత్రి బండిసంజయ్ కుమారుడిని పోక్సో కేసు నమోదు అయిన ఇప్పటి వరకు పోలీసులు అరెస్టు చేయకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఆయన మాజీ కార్పొరేటర్ గీత తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఏ రూల్స్ ప్రకారం తెలంగాణ పోలీసులు బాలికపై హనీట్రాప్, వసూళ్ల కేసు నమోదు చేశారని నిలదీశారు. "ప్రధాని మోదీ 'బేటీ బచావో' కేవలం నినాదానికే పరిమితమా? అని ప్రశ్నించారు. బండి కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# ఇంటర్ విద్యా విధానం ప్రభుత్వ నిర్ణయం పై లెక్చరర్ల సంఘాలు హర్షం

హైదరాబాద్ ఇంటర్ విద్యా విధానాన్ని యధావిధిగా కొనసాగించాలని... రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడంపై... ప్రభుత్వ ఇంటర్ జూనియర్ లెక్చరర్ల సంఘం, ఇంటర్ విద్యా ఐకాస హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా... సంఘం అధ్యక్షుడు మధుసుధన్ రెడ్డి ఆధ్వర్యంలో... అధ్యాపకులు నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఉన్న ఆచార్య జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి... టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ ఇంటర్ బోర్డును 1969లో పీవీ నరసింహారావు ప్రవేశ పెట్టారని మధుసూధన్ రెడ్డి గుర్తు చేశారు. ప్రభుత్వ నిర్ణయం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని... దేశంలోనే తలమానికంగా ఉన్న ఈ విద్యా విధానాన్ని రద్దు చేయడం సరికాదన్నారు. ఈ విషయం లో విద్యార్థుల, అధ్యాపకుల భవిష్యత్తు దృష్ట్యా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సముచిత నిర్ణయం తీసుకునందుకు... కృతజ్ఞతలు తెలిపారు.

## నార్సింగి ఔటర్ రింగ్ సబ్ వే రోడ్డుపై కారు ప్రమాదం

హైదరాబాద్ నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు సబ్ వే మీద కారు ప్రమాదం జరిగింది. కోకాపేట్ నుంచి వట్టినాగులపల్లి వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకొన్న నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఏపీని ప్రపంచస్థాయి "మైస్" కేంద్రంగా మార్చడమే లక్ష్యం

## అంతర్జాతీయ ఈవెంట్ల అనుమతులకు ప్రత్యేక బ్యూరోల ఏర్పాటు

## అమరావతిలో నాలుగు కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటుకు అనుమతి

## సింగపూర్ సన్ టెక్ సిటీని సందర్శించిన మంత్రి నారా లోకేష్

సింగపూర్: రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సింగపూర్ లోని సన్ టెక్ సిటీని సందర్శించారు. అక్కడ డీపీ అర్బన్ ఆర్కిటెక్ట్ సంస్థ డైరెక్టర్ ఆనందన్ కరుణాకరన్ తో లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ప్రపంచస్థాయి మైస్ (ఓఎఅఇ - ఓవవబితినిణబ, ఎనిఇవనిబితిలవబ, అనీనిటవతీవనిఇవబ, జీనిట ఇలీప్త్రతిఎతిబితినీనిబ) ఈవెంట్లకు కేంద్రంగా మారడమే ఆంధ్రప్రదేశ్ లక్ష్యమని రాష్ట్ర మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఇందుకోసం తాము కొత్త మైస్ విధానాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ ఈవెంట్ నిర్వాహకులకు సింగిల్ విండో అనుమతులను వేగవంతం చేయడానికి విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలలో ప్రత్యేక బ్యూరోలను ఏర్పాటు చేస్తున్నామని లోకేష్ చెప్పారు.. రాబోయే 5 సంవత్సరాలలో రాష్ట్రంలోని హోటల్ గదుల సంఖ్య 4 రెట్లు పెరిగి 20,000కు చేరుకుంటుందని మంత్రి లోకేష్ అన్నారు. ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ హాస్పిటాలిటీ సంస్థలు అమరావతికి వస్తున్నాయి. మైస్ పరిశ్రమను ప్రోత్సహించడానికి అమరావతిలో 4 కన్వెన్షన్ సెంటర్లకు రాష్ట్రం ఆమోదం తెలిపింది. విశాఖపట్నంలో ఒక ప్రపంచ స్థాయి ఓఎఅఇ కేంద్రాన్ని నిర్మించబోతున్నాం. భారత ప్రభుత్వ ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్‌తో భాగస్వామ్యంతో వైజాగ్‌లో ఆంధ్ర మండపాన్ని ఏపీ ఇప్పటికే ప్రకటించింది. విశాఖ తీరప్రాంతం గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ గ్లోబల్ టెక్ కంపెనీలకు ఆతిథ్యం ఇస్తోందని లోకేష్ తెలిపారు. డీపీ అర్బన్ ఆర్కిటెక్ట్ డైరెక్టర్ ఆనందన్ కరుణాకరన్ మాట్లాడుతూ... సింగపూర్ డౌన్ టౌన్ వ్యాపార కేంద్రానికి నడిబొడ్డున ఉన్న సన్ టెక్ సిటీ ని తమ సంస్థ డిజైన్ చేసిందని, ఇది 42వేల మీటర్ల విస్తీర్ణంలో అధునాతన సాంకేతికతతో నిర్మించిన ఈవెంట్ ప్లేస్ అని తెలిపారు. సింగపూర్ ను అగ్రశ్రేణి, సురక్షితమైన, విశ్వసనీయమైన గమ్యస్థానంగా నిలబెట్టడానికి సింగపూర్ టూరిజం బోర్డ్ (ూుః) విస్తృత ప్రచారం కల్పిస్తోంది. 2040 నాటికి మైస్ సందర్శకుల వ్యయాన్ని పెంచడం, తద్వారా టూరిజం ఆదాయాన్ని మూడు రెట్లు పెంచడం సింగపూర్ టూరిజం బోర్డు లక్ష్యం. ఈ పరిశ్రమ సుస్థిరత ధృవీకరణపై ఎక్కువగా దృష్టి సారిస్తుంది. సన్‌టెక్ సిటీ, మెరీనా బే సాండ్స్ వంటి ఇప్పటికే ఉన్న వేదికలపై కొత్త ఓఎఅఇ హబ్‌ను నిర్మించడానికి సింగపూర్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆనందన్ కరుణాకరన్ చెప్పారు.

# 258 గ్రామాల్లో బోర్ల తవ్వకాలు నిషేధం

కడప, మే 11, ఏపీ ప్రభుత్వం కొత్తగా బోర్లు తవ్వకుండా నిషేధం విధించింది. మొత్తం 7 జిల్లాల్లోని 258 గ్రామాల్లో బోర్ల తవ్వకాలను నిషేధించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాకపోతే జనాల కోసం తాగునీటి అవసరాలకోసం మాత్రం బోర్లు వేసుకోవచ్చు. ఈ జిల్లాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతుండటంతో ఏపీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. బోర్ల తవ్వకాలపై నిషేధం విధించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7 జిల్లాల్లోలోని 258 గ్రామాల్లో కొత్తగా బోర్ల తవ్వకాలను నిషేధించారు. ఈ 258 గ్రామాల్లో ప్రజల తాగునీటి అవసరాల కోసం చేతిబోర్లకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. మిగిలిన కొత్త బోర్లు తవ్వేందుకు, ఇసుక తవ్వకాలకూ అనుమతి లేదని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో భూగర్భ జలాలు అడుగంటటడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. బోర్లపై నిషేధం విధిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళంలో 76, ప్రకాశంలో 91, పల్నాడులో 20, చిత్తూరులో 8, అనంతపురం జిల్లాలో 14, శ్రీసత్యసాయి జిల్లాలో 39, కడపజిల్లాలో 10 గ్రామాలు కలిపి మొత్తం 258 గ్రామాల్లో నీటి వినియోగం మోతాదుకు మించి ఉన్నట్లు అధికారులు గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నారు.మరోవైపు ఏపీ రైతులకు వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది ముందస్తుగా నీటి విడుదల కారణంగా ముందుగానే, ఇప్పటి నుంచే ఖరీఫ్ సన్నద్ధతపై దృష్టి సారించాలన్నారు. ఈ మేరకు అన్ని జిల్లాల్లో వ్యవసాయ అధికారుల్ని ఆదేశించారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ జిల్లా వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కంటింజెన్సీ ప్లాన్‌తో ఎల్‌నినో ప్రభావం చూపే మెట్ట ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా సిద్ధంగా ఉండాలని సూచించారు.ఈసారి రైతులకు ముందస్తు నీటి విడుదలపై అవగాహన కల్పించాలని సూచించారు. అన్నదాతలు ముందుగానే పంట సాగు చేపడితే.. పంట కోత సమయంలో ప్రకృతి వైపరీత్యాల నుంచి తప్పించుకోవచ్చన్నారు. ప్రతి రైతు ఫార్మర్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా చూడాలని.. ఏపీ ఎయిమ్స్ యాప్‌ను రోజూ గమనించాలని సూచించారు. రైతు రిజిస్ట్రీలో రైతులు అందరిని నమోదు చేయించాలి అన్నారు. నెల్లూరు, తిరుపతి జిల్లా అధికారులతో సోమశిల, కండలేరు ప్రాజెక్టుల నీటి విడుదలపై మాట్లాడారు. గతేడాది కన్నా ముందుగానే ఈసారి నీటిని విడుదల చేశారని.. వరి నాట్లు ఈనెల 25లోపు పూర్తవుతాయన్నారు.

# సిద్ధమైన కృష్ణాజలాల ప్రాజెక్టు

విజయవాడ, మే 11, ఎన్టీఆర్ జిల్లా ఎ కొండూరు మండలంలోని కిడ్నీ బాధిత గ్రామాలకు స్వచ్ఛమైన కృష్ణా జలాలను అందించే ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. సుమారు 15 తండాల్లోని 57 వేల మంది జనాభాకు ప్రతిరోజూ 22 లక్షల లీటర్ల నీటిని అందించేలా కుదప సంపు నుంచి పైప్‌లైన్ నిర్మించారు. గత పదేళ్లుగా కిడ్నీ వ్యాధులతో వందలాది మంది మరణించిన ఈ ప్రాంతంలో.. సురక్షిత నీటి సరఫరా ద్వారా వ్యాధులను అరికట్టడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా.. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని అధికారికంగా ప్రారంభించనున్నారు.ఎన్టీఆర్ జిల్లాలోని ఎ కొండూరు మండలం అంటేనే కిడ్నీ వ్యాధులకు నిలయంగా మారిపోయిన దుస్థితి. ఇక్కడి భూగర్భ జలాల్లో ఉన్న ఫ్లోరైడ్, ఇతర రసాయనాల కారణంగా వందలాది మంది గిరిజనులు కిడ్నీ వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ కిడ్నీ మరణాల పరంపరకు అడ్డుకట్ట వేయాలంటే సురక్షితమైన మంచినీటి సరఫరా ఒక్కటే మార్గమని దశాబ్ద కాలంగా బాధితులు మొరపెట్టుకుంటున్నారు. ఎట్టకేలకు ఈ ప్రాంత వాసుల కల నెరవేరుస్తూ.. కృష్ణా నది జలాలను తరలించే ప్రాజెక్టు నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం రికార్డు సమయంలో పూర్తి చేసింది, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలోనే ఈ మండలంలో సుమారు 250 మందికి పైగా కిడ్నీ వ్యాధులతో మరణించారని గణాంకాలు చెబుతున్నాయి. ప్రాజెక్టు పనులు అప్పట్లో మందకొడిగా సాగడంతో కిడ్నీ బాధితుల వెతలు తీరలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా గుర్తించి ఆఖరి దశలో ఎదురైన సాంకేతిక సమస్యలను పరిష్కరించింది. కుదప సంపు నుంచి పది కిలోమీటర్ల పొడవైన భారీ పైప్‌లైన్ ద్వారా కృష్ణా జలాలను ఎ.కొండూరు మండలానికి తరలిస్తున్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని నిల్వ చేసేందుకు తండాల్లో ఉన్న 44 పాత ట్యాంకులను పునరుద్ధరించడంతో పాటు కొత్తగా మరో 12 ట్యాంకులను నిర్మించారు. మొత్తం 56 ట్యాంకుల ద్వారా గిరిజన తండాల్లోని ఇంటింటికీ నీటిని పంపిణీ చేయనున్నారు. ప్రారంభంలో కొత్తగా నిర్మించిన నాలుగు ట్యాంకులకు నీరు ఎక్కకపోవడంతో కొంత ఆందోళన నెలకొన్నప్పటికీ అధికారులు శక్తివంతమైన మోటార్లను ఏర్పాటు చేసి ఆ సమస్యను అధిగమించారు. ప్రస్తుతం ట్రయల్ రన్‌లో భాగంగా గ్రామాలకు నీటిని విడుదల చేస్తున్నారు.అయితే ప్రస్తుత ప్రాజెక్టు సామర్థ్యంపై ప్రజల నుంచి కొన్ని విన్నపాలు అందుతున్నాయి. రోజుకు 57 వేల మందికి తలసరి 50 లీటర్ల చొప్పున 22 లక్షల లీటర్లను పంపింగ్ చేసేలా ఈ లైన్‌ను రూపొందించారు. కానీ ప్రజల అవసరాలు వంద లీటర్లకు పైగా ఉండటంతో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉంది. దీనివల్ల కొందరు మళ్లీ పాత బోర్ల నీటినే వాడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం 22 లక్షల లీటర్ల పరిమితిని దాటి అదనపు నీటిని అందించేందుకు ఎ.కొండూరుకు మరో ప్రత్యేక పైప్‌లైన్ వేసేలా కొత్త ప్రతిపాదనలను సిద్ధం చేస్తోంది. ఈ ప్రాజెక్టును శనివారమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ.. ఆయన టూర్ రద్దవటంతో మరో ముహూర్తానికి వాయిదా పడింది. త్వరలోనే ఈ ప్రాజెక్టును ప్రజలకు పూర్తిస్థాయిలో అంకితం చేయనున్నారు.

# నేతలపై అపనమ్మకమే...

## క్లైమాక్స్‌లో బిగ్ ట్విస్ట్..

## మహానాడు వేదిక చేంజ్.

నెల్లూరు, మే 11, తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ మహానాడు జరిపినా తమ సొంత ఇంటి కార్యక్రమంగానే భావిస్తుంటారు టీడీపీ క్యాడర్. అలాంటి పసుపు పండుగ జరిపే అవకాశం ఈ సారి మొదట సిక్కోలు గడప తొక్కింది. రాక రాక జిల్లాకు ఛాన్స్ ఇచ్చినట్లే ఇచ్చి..మహానాడును నెల్లూరుకు ఎందుకు తరలించారంటూ కార్యకర్తలు పెదవి విరుస్తున్నారట. అయితే పసుపు పండుగ నెల్లూరుకు షిఫ్ట్ కావడం వెనుక సిక్కోలు టీడీపీలో ఇంటర్నల్‌గా పెద్ద కథే నడిచిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.ఏపీ పాలిటిక్స్‌లో ఎప్పుడూ హాట్ టాపిక్‌గా ఉండే జిల్లా శ్రీకాకుళం. ఏ పార్టీ అధికారంలో ఉన్నా జిల్లా నేతలకు పెద్దపీట వేస్తుంటారు ఆ పార్టీ అధినేతలు. ఇక టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి కంచుకోటగా నిలిచిన జిల్లా ఇది. స్వయంగా ఎన్టీఆరే శ్రీకాకుళం జిల్లా నుంచి బరిలోకి దిగి గెలిచారంటూ తెలుగు తమ్ముళ్లు గుర్తు చేస్తున్నారు. 2024లో కూడా సిక్కోలు వాసులు టీడీపీకి బ్రహ్మరథం పట్టడంతో క్లీన్ స్వీప్ చేశారు. దీంతో టీడీపీ అధినేత కూడా కింజరాపు అచ్చెన్నాయుడుకు రాష్ట్ర మంత్రి వర్గంలో..రామ్మోహన్ నాయుడుకు కేంద్ర మంత్రివర్గంలో అవకాశం ఇచ్చారు. ఇక క్యాడర్‌తో సమావేశంలో భాగంగా జిల్లాలో ఈ సంవత్సరం టీడీపీ పసుపు పండగ మహానాడు సిక్కోలులోనే నిర్వహిస్తామని హామీ ఇచ్చారు టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్.ఇచ్చిన మాట ప్రకారం ఈ సంవత్సరం శ్రీకాకుళం జిల్లాలోనే టీడీపీ మహానాడుకు ఏర్పాట్లు చేయాలంటూ లోకేశ్ ఆదేశాలు జారీ చేశారు. పార్టీ పెద్దలు, జిల్లా ఇంచార్జ్ మంత్రితో సహా టీడీపీ కీలక నేతలంతా రంగంలోకి దిగారు. మహానాడుకు అనువైన స్థలాల కోసం జల్లెడ పట్టారు.

శ్రీకాకుళం జిల్లాలోని పైడి భీమవరంతో పాటు శ్రీకాకుళం పట్టణంలోని చాపురం, పాత్రునివలస వంటి ప్రాంతాల్లో పర్యటించి అనువైన స్థలాలు ఎంపిక చేశారు. వాస్తు సిద్దాంతులు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇక పనులు షూరూ చేయండని అధిష్టానం నుంచి ఆదేశాలు కూడా వచ్చాయి. జిల్లాలో మహానాడు జరుగుతుందంటూ తెలుగు తమ్ముళ్లు సైతం ఖుస్ అయ్యారు. సీన్ కట్ చేస్తే క్లైమాక్స్‌లో బిగ్ ట్విస్ట్ ఇచ్చారు. మహానాడు వేదిక శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరుకు మారిపోయింది. దీంతో సిక్కోలు టీడీపీ క్యాడర్ అంతా షాక్ అయిపోయిన పరిస్థితి.తెలుగు వార్తలుమహానాడు వేదిక మార్పునకు సిక్కోలు టీడీపీ నేతల తీరే కారణమన్న చర్చ జరుగుతోంది. ఉత్తరాంధ్రలో ప్రధానమంత్రి మోదీ పర్యటన ఉందని..ఆ కార్యక్రమాన్ని కూడా పెద్దఎత్తున నిర్వహించే ప్లాన్ ఉండటంతోనే మహానాడు వేదికను మార్చినట్లు పైకి చెబుతూ వస్తున్నారు నేతలు. కానీ అసలు కారణం వేరే ఉందంటూ గుసగుసలు మొదలయ్యాయి. మహానాడు నిర్వహణ, ఏర్పాట్లు కోసం ఇనీషియేషన్ తీసుకోవాల్సిన సిక్కోలు టీడీపీ ముఖ్యనేతలు అధిష్టానం ఆశించినంత ఉత్సాహం చూపించలేదట. పసుపు పండుగ అంటే దాదాపు 20 రోజులు అక్కడే మకాం వేయాలి. అతిథులకు వసతి ఏర్పాట్లు, పసందైన వంటకాలు వడ్డించడం వంటివి చాలా రిస్క్. ఈ స్థాయిలో ఎఫర్ట్స్ పెట్టి మహానాడు నిర్వహణకు అరేంజ్‌మెంట్స్ చేసేందుకు కీలక నేతలెవరూ ముందుకు రాలేదన్నది ఇన్‌సైడ్ టాక్.ఏదో లోకేశ్ నుంచి ఆదేశాలు వచ్చాయి కాబట్టి ..స్థల పరిశీలన అంటూ హడావుడి చేశారే తప్ప..లీడర్లలో సీరియస్‌నెస్ కనిపించలేదట. దీంతో శ్రీకాకుళం నేతలను నమ్ముకుంటే..సీన్ సితారైపోతుందని భావించిన పార్టీ పెద్దలు..వెంటనే మహానాడు వేదికను మార్చేశారట. పసుపు పండుగ నిర్వహణకు ఆసక్తిగా ఉన్న సింహపురి నేతలు మహానాడు బాధ్యతలను భుజాన వేసుకున్నారట. ఇప్పటికే ఏర్పాట్లకు శంకుస్థాపన చేసి..పనులను స్పీడప్ చేశారు. అయితే రాకరాక అవకాశం దక్కితే మహానాడు వేదిక మరో చోటుకు తరలిపోయేలా చేశారంటూ శ్రీకాకుళం టీడీపీ క్యాడర్ తమ నేతలపై తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

సొంత జిల్లాలో మహానాడు వేడుక జరుగుతుందని సంబరపడితే..ఆ ఆనందం ఎంతసేపు మిగలలేదంటూ నిరుత్సాహ పడిపోయారట. మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ పదవులు వెలగబెట్టిన అనుభవమున్న నేతలు..మహానాడును నిర్వహించలేకపోయారా.? అంటూ పెదవి విరుస్తున్నారు

# ఏపీలోకి టీవీకేపార్టీ.. కాంగ్రెస్ తో పొత్తు

తిరుపతి, మే 11, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ టీవీకే పార్టీ ప్రభంజనం సృష్టించింది.. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచింది. టీవీకేతో కలిసొచ్చే పార్టీలతో కలిసి విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. సినిమాలతో అభిమానులతో మొదలైన విజయ్ ప్రస్థానం.. ఎన్నికల గెలుపు వరకు సాగింది. తమిళనాడులో పార్టీ ప్రారంభించిన రెండేళ్లలోనే తిరుగులేని విజయం సాధించడంతో టీవీకేలో కొత్త జోష్ నింపింది. విజయ్ ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో ఓ ట్రెండ్ సెట్టర్‌గా మారారనే చెప్పాలి.. టీవీకే విజయం దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారి తీసింది.తమిళనాడులో టీవీకే విజయం తర్వాత.. విజయ్ నెక్ట్స్ ప్లాన్ ఏంటి.. దళపతి తమిళనాడుతో ఆగుతారా పొరుగున ఉన్న రాష్ట్రాల్లోకి ఎంట్రీ ఇస్తారా అనే చర్చ మొదలైంది. ముఖ్యంగా విజయ్ కన్ను ఆంధ్రప్రదేశ్‌పై పడిందనే ఊహాగానాలు మొదలయ్యాయి.. టీవీకే అధినేత తమిళనాడు సరిహద్దులో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని విస్తరించే అవకాశం ఉందంటున్నారు. తమిళనాడు ఎన్నికలకు ముందు నుంచే ఆంధ్రప్రదేశ్ టీవీకే పార్టీ పేరుతో కొందరు సోషల్ మీడియాలో పేజీలు కూడా నడపుతుండటంతో టాక్ మొదలైంది. విజయ్ ముందు తమిళనాడులో స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని.. ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకు టీవీకే పార్టీని విస్తరిస్తారనే ఊహాగానాలు మొదలయ్యాయి.విజయ్ ఆంధ్రప్రదేశ్‌వైపు రావడానికి కారణాలు చాలానే ఉన్నాయి. తమిళనాడులో విజయ్‌కు యువత నుంచి మంచి ఆదరణ వచ్చింది.. దళితులు, క్రిస్టియన్లు మద్దతు తెలిపారు. ఇక్కడ కూడా అడుగుపెట్టి ఆయా సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే అవకాశం ఉందంటున్నారు. ఏపీలో ముఖ్యంగా తీరప్రాంత జిల్లాలతో పాటుగా యువత, క్రిస్టియన్లు, దళిత ఓటర్లను ఆకట్టుకుంటే బలమైన రాజకీయశక్తిగా ఎదగొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే తమిళనాడుతో పోలిస్తే ఏపీలో క్రిస్టియన్ల సంఖ్య ఎక్కువగా ఉండటం కూడా కలిసొస్తుందంటున్నారు. తమిళనాడు ఫార్ములాను ఫాలో అవుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రస్తుతం ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎంట్రీ ఇచ్చే అవకాశాలు లేకపోలేదంటున్నారు. టీవీకే పార్టీని విస్తరించేందుకు ఆంధ్రప్రదేశ్ మంచి ఆప్షన్ అనే వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే తెలుగు ఇండస్ట్రీ నుంచి, ఇతర రాజకీయ పార్టీల నుంచి వచ్చేవారిని ఏకం చేస్తే ఇంకా ప్లస్ అవుతుందంటున్నారు.అంతేకాదు విజయ్ టీవీకే పార్టీ ఏపీలో కాంగ్రెస్‌తో జతకట్టి ఎన్నికలకు వెళ్లే అవకాశాలు లేకపోలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ తమిళనాడు సరిహద్దుతో పాటుగా మరికొన్ని చోట్ల టీవీకే అభ్యర్థులకు అవకాశం ఇచ్చి కూటమిగా బరిలోకి దిగే అవకాశాలు కొట్టిపారేయలేం అంటున్నారు. ఏపీ సరిహద్దులోని కొన్ని జిల్లాలపై తమిళనాడు ప్రభావం ఉంటుంది..

మిగిలిన చోట్ల బలపడాలంటే కష్టంగా ఉంటుంది.

అందుకే ఏపీలో కాంగ్రెస్‌తో కలిసి ముందుకు సాగితే సక్సెస్ కావొచ్చు అంటున్నారు.

యానాంలో ఘోర ఓటమి

యానాంలో విజయ్ టీవీకే అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. యానాం నియోజకవర్గం కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల మధ్యలో ఉంది. ఈ నియోజకవర్గంలో తెలుగు ప్రజలు ఎక్కువ. రాజకీయంగా వారి ప్రభావం కూడా ఎక్కువే. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉన్న యానాం నియోజకవర్గంలోని ఓటర్లు విజయ్ టీవీకేకు ఘోర పరాభవాన్ని రుచి చూపించారు. టీవీకే అభ్యర్థి తోట రాజు కేవలం 167 ఓట్లు మాత్రమే సాధించి డిపాజిట్ కూడా పోగొట్టుకున్నారు. టీవీకే అభ్యర్థి కంటే.. నోటాకు 193 ఓట్లు పడటం విశేషం. దీంతో తెలుగు ప్రజలు విజయ్‌కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.మరోవైపు యానాం అసెంబ్లీ నియోజకవర్గంలో 37,972 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 35,445 మంది అంటే 93.35 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఎన్నార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మల్లాడి కృష్ణారావు విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌పై మల్లాడి కృష్ణారావు 4,568 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎమ్మెల్యేగా మల్లాడి కృష్ణారావు ఆరోసారి విజయం సాధించారు.

మరోవైపు పుదుచ్చేరిలో ఎన్డీఏ కూటమి విజయానికి హామీలు కూడా ప్రధాన కారణమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మంచినీటి ఏటీఎంలు, అటల్ క్యాంటీన్లు, బాలికలకు ఈ-స్కూటర్లు, స్థానికులకే ఉద్యోగ రిజర్వేషన్లు వంటి హామీలు ఓటర్లను ఆకర్షించాయి. మత్స్యకారులను వెనుకబడిన జాబితాలో చేరుస్తామని ప్రకటించడం కూడా కలిసి వచ్చింది. విజయ్ టీవీకే పార్టీ కూడా ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చటం ఎన్డీఏ కూటమికి కలిసి వచ్చింది.

# విశాఖకు ఇన్నర్ రింగ్ రోడ్...

విశాఖపట్టణం, మే 11 విశాఖ నగరాన్ని రాబోయే 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి చేసేందుకు ఏపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కిలోమీటర్ల మేర సెమీ రింగురోడ్డు నిర్మించనున్నారు. భోగాపురం విమానాశ్రయానికి ఏడు కనెక్టింగ్ రోడ్లు, బీచ్ కారిడార్‌తో పాటు రూ.14 వేల కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఉత్తరాంధ్రను ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మారుస్తూ ఆర్థిక కారిడార్‌ను బలోపేతం చేయడమే ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చెబుతోంది.విశాఖ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, పారిశ్రామిక ప్రాంతాలను అనుసంధానించడానికి రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కిలోమీటర్ల పొడవైన సెమీ రింగురోడ్డును ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ఈ నెలాఖరు నాటికి సిద్ధం కానుంది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే.. నగరం మధ్యలోకి భారీ వాహనాలు రాకుండా నేరుగా హైవేలకు అనుసంధానం అయ్యే అవకాశం ఉంటుంది. దీనివల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా నగర శివారు ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి.నిర్మాణంలో ఉన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రాధాన్యతనిస్తూ.. దానికి ఏడు కనెక్టింగ్ రోడ్లను వీఎంఆర్డీఏ నిర్మిస్తోంది. ఇప్పటికే మూడు రోడ్ల నిర్మాణం పూర్తి కాగా.. మిగిలినవి తుది దశలో ఉన్నాయి. విశాఖ నగరం నుంచి భోగాపురం వరకు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేలా ప్రత్యేక బీచ్ కారిడార్‌ను కూడా ప్రతిపాదించారు. ఇది పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించడమే కాకుండా సముద్ర తీర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దోహదపడుతుంది.నగరవాసుల ప్రాథమిక అవసరాలను తీర్చేందుకు రూ.14 వేల కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే విశాఖలోని 95 శాతం ఇళ్లకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని మంత్రి నారాయణ వివరించారు. అలాగే మాస్టర్ ప్లాన్ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన 90 శాతం వినతులను అధికారులు పరిష్కరించారు. ఉత్తరాంధ్రను ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మార్చడమే లక్ష్యంగా.. విశాఖ ఎకనామిక్ కారిడార్‌ను బలోపేతం చేస్తూ ఐటీ, ఫార్మా, లాజిస్టిక్స్ రంగాలకు పెద్దపీట వేస్తున్నారు. ఈ సమీక్షలో తీసుకున్న నిర్ణయాలు విశాఖను గ్లోబల్ సిటీగా మార్చడంలో కీలక పాత్ర పోషించనున్నాయని అధికారులు వెల్లడించారు.

# దువ్వాడకు జగన్ షాక్

శ్రీకాకుళం, మే 11,తెలుగు రాష్ట్రాల్లో పొలిటికల్ సెలబ్రిటీ అంటే.. ముందుగా గుర్తొచ్చే పేరు దువ్వాడ శ్రీనివాస్. వైసీపీ ఎమ్మెల్సీగా ఉండి ఒక మహిళ కోసం జరిగిన కుటుంబ వివాదంతో పార్టీకి చెడ్డ పేరు వస్తుందని చెప్పి ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. అయితే ఇది తాత్కాలికమేనని.. తిరిగి తాను వైసీపీలో యాక్టివ్ అవుతానని దువ్వాడ శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఆయన మాటల్లో జగన్మోహన్ రెడ్డి పట్ల ఫ్లేవరు, ఫేవర్ కనిపిస్తూ వచ్చింది. జగన్మోహన్ రెడ్డి సైతం మొన్న ఆ మధ్యన ఏంటి శ్రీనివాస్ అని పలకరించే సరికి పులకించుకుపోయారు దువ్వాడ. ఇక తాను అడిగిందే తరువాయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి జగన్ మోహన్ రెడ్డి తిరిగి ఆహ్వానిస్తారు అని భావించారు. కానీ ఇటీవల జగన్ వద్దకు వెళ్లిన దువ్వాడకు షాక్ కొట్టే విషయాన్ని చెప్పారు అధినేత. పార్టీలో చేరిక విషయంలో తానేం చేయలేనంటూ జగన్మోహన్ రెడ్డి తేల్చి చెప్పినట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది.శ్రీకాకుళం జిల్లాలో దూకుడు కలిగిన నేతగా దువ్వాడ శ్రీనివాస్ కు పేరు ఉంది. దశాబ్దాల కిందట నుంచి కాంగ్రెస్లో రాజకీయాలు నడుపుతూ వచ్చారు. కానీ ఎందుకో చట్టసభలకు మాత్రం వెళ్లలేకపోయారు. కానీ ఆ ముచ్చట తీర్చారు జగన్మోహన్ రెడ్డి. ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టడంతో శాసనమండలిలో అడుగుపెట్టారు. అయితే ప్రత్యక్ష ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ఎంపీగా, ఎమ్మెల్యేగా మూడుసార్లు ఛాన్స్ ఇచ్చారు. ఒక్కసారి కూడా నెగ్గుకు రాలేకపోయారు దువ్వాడ శ్రీనివాస్. కానీ కింజరాపు ఫ్యామిలీ పై దూకుడుగా అడుగులు వేయాలంటే దువ్వాడ ఉండాల్సిందేనని చెప్పి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి ప్రోత్సహించారు.

# బాలినేనికి కీలక బాధ్యతలు

ఒంగోలు, మే 11, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, డీ లిమిటేషన్ ప్రక్రియపై ఉమ్మడి జిల్లాల వారీగా కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలలో వైసీపీ నుంచి వచ్చిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభానులకు స్థానం కల్పించారు. బాలినేని శ్రీనివాసరెడ్డికి ఉమ్మడి రాయలసీమ జిల్లాలతో పాటుగా ప్రకాశం, నెల్లూరు జిల్లాలను అప్పగించారు. ఇక సామినేని ఉదయభానుకు, నాదెండ్ల మనోహర్‌కు కలిపి కృష్ణా, గుంటూరు జిల్లాల బాధ్యతలు అప్పగించారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేనలో చేరిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కీలక బాధ్యతలు అప్పగించారు. డీ లిమిటేషన్ ప్రక్రియతో పాటుగా ఏపీలో త్వరలోనే జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ కమిటీలను ఏర్పాటు చేసింది. మొత్తం 11 మంది సభ్యులతో మూడు కమిటీలను ఏర్పాటు చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. సభ్యులకు తాజాగా జిల్లాల బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలోనే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి రాయలసీమ జిల్లాలైన ఉమ్మడి అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలతో పాటుగా.. ప్రకాశం, నెల్లూరు జిల్లాల బాధ్యతలు అప్పగించింది.పవన్ కళ్యాణ్ ఆదేశాలత బాలినేని శ్రీనివాసరెడ్డి రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో పర్యటించనున్నారు. ఆయా జిల్లాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు. డీలిమిటేషన్ అంశాలపై చర్చిస్తారు. అనంతరం ఈ పర్యటన వివరాలతో సమగ్ర నివేదికను పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు సమర్పించనున్నారు.అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల కోసం ఏర్పాటు చేసిన కమిటీలో బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటుగా ఆరణి శ్రీనివాసులు, టీసీ వరుణ్‌కు స్థానం కల్పించారు. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల కోసం కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, సీహెచ్ వంశీకృష్ణలతో కమిటీ ఏర్పాటైంది. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల కోసం పంతం నానాజీ, బొలిశెట్టి శ్రీనివాస్, కొటికలపూడి గోవిందరావులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఇక కృష్ణా, గుంటూరు జిల్లాల బాధ్యతలను నాదెండ్ల మనోహర్, సామినేని ఉదయభానులకు అప్పగించారు.మరోవైపు జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. వచ్చే వారం కమిటీలను ప్రకటించనున్నట్లు జనసేన పార్టీ తెలిపింది. జనసేన పార్టీ సంస్థాగత విస్తృత నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన ప్రక్రియలో పవన కళ్యాణ్ నిమగ్నమై ఉన్నారన్న జనసేన.. పార్టీ నిర్మాణంలో భాగమైన కమిటీల ఏర్పాటు కోసం గత కొన్ని నెలలుగా పవన్ కళ్యాణ్ ముఖ్య నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. శస్త్రచికిత్స నుంచి పూర్తిస్థాయిలో ఇంకా కోలుకోకపోయినప్పటికీ.. ఆరోగ్యపరమైన ఇబ్బందులున్నా కూడా కమిటీల ప్రకటనపై దృష్టిపెట్టారని తెలిపింది.

### గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ

హైదరాబాద్ గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ జరిగింది. దొంగలు ఇంటికి తాళం వేసి పెళ్లికి వెళ్లిన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి భారీగా బంగారం, వెండి, నగదును అపహరించారు. జైన్ స్కూల్ సమీపంలోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తన బంధువుల పెళ్లికి ఆదివారం ఉదయం వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టబడినట్లు గుర్తించాడు. ఇంట్లో తనిఖీ చేయగా సుమారు 30 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.5 లక్షల నగదు దొంగిలించినట్లు తెలిసింది. వెంటనే గోషామహల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసారు.

## ఐదుగురి ప్రాణాలు బలిగొన్న యువకుల బైక్ రేసింగ్ సరదా మహబూబ్నగర్లో ఘోర రోడ్డు ప్రమాదం

మహబూబ్ నగర్ యువకుల బైక్ రేసింగ్ సరదా ఐదుగురి మృతికి దారి తీసింది. 140 స్పీడులో వెళుతున్న స్పోర్ట్స్ బైక్ కారును గుద్దింది. బైపాస్ రోడ్డులో జరిగిన ఘటనలొఓ ఐదుగురు మృతి చెందారు. బైక్ రేసింగ్లకు బైపాస్ రోడ్డు అడ్డాగా మారిందని, పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికుల ఆరోపణ. ప్రమాదంలో కారులో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన అర్షియ బేగం(30), ఉజేప(7), అమర్(2)లు మరియు బైక్పై ఉన్న హైదరాబాద్కు చెందిన బైకర్ యాకుబ్ అఫ్జల్(25)తో పాటు మరో వ్యక్తి మృతి చెందారు.

## పీఎంజే జ్యువెల్లరీ కేసులో పురోగతి పోలీసుల అదుపులో ఇద్దరు దుండగులు

కరీంగనర్ పీఎంజే జ్యువెల్లరీ కేసులోపోలీసులు పురోగతి సాధించారు. పోలీసుల అదుపులో ఇద్దరు దుండగులు వున్నట్లు సమాచారం. పోలీసులు బెంగాల్ లో నిందితుడిని పట్టుకుని కరీంనగర్ కు నిన్న అర్ధరాత్రి తీసుకువచ్చారు. నిందితుడి ద్వారా మిగతా వారి అచూకీ కోసం కూపీ లాగుతున్నారు. కరీంనగర్ నుంచి ధర్మపురి మీదుగా పారిపోతుండగా దుండగులు వాడిన సెల్ ఫోన్ ను మద్దునూర్ వద్ద పగులగొట్టారు. తరువాత ఆ మొబైల్ ఫోన్ యువకులకు లభించింది. వారు మొబైల్ ఫోన్ ను పోలీసులకు అప్పగించారు. ఫోన్ లో కీలక ఆధారాలు దొరికినట్లుగా సమాచారం.
వారం రోజులుగా నిందితుల కోసం పశ్చిమ బెంగాల్, బీహార్, ఛత్తీస్గఢ్, మహారాష్ట్ర, రాజస్థాన్ ఐదు రాష్ట్రాల్లో కొనసాగుతున్న పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఇద్దరూ నిందితులతో పాటు, పీఎంజే నగల దుకాణంలో దోపిడీ చేసిన బంగారం కొనుగోలు చేసిన వ్యాపారినీ పట్టుకున్నట్లు సమాచారం.

## మోడీ మీటింగ్ కమలంలో జోష్...

హైదరాబాద్, మే11, దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కాషాయం జెండాను రెపరెపలాడించాలనేది బీజేపీ ప్రధాన లక్ష్యం.. అదే వ్యూహంతోని ప్రధాని మోదీ ముందుకు సాగుతున్నారు. పొత్తులతోనైనా లేదా ఒంటరిగానైనా ఒక్కో రాష్ట్రంలో బీజేపీ జెండాను పాతుకుంటూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంది వస్తోంది. ఈ సూత్రంలోనే చరిత్రను తిరగరాస్తూ బెంగాల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది బీజేపీ. ఇప్పుడు ఫోకస్ తెలంగాణపై పెట్టింది. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని ప్రధాని మోదీ పరేడ్ గ్రౌండ్ సభలో మాట్లాడడం తెలంగాణ నేతల్లో జోష్ను పెంచేసింది.అందుకు తగ్గట్టుగానే సభలో తెలంగాణ బీజేపీ నేతలు కూడా మాట కలిపారు. తొలత ఎంపీ డీకే ఆరుణ మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉందన్నారు. మళ్లీ మళ్లీ ప్రజలు సుపరిపాలన అందించడం వల్లే బీజేపీ అధికారంలోకి వస్తోందన్నారు. బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణే అనీ.. అందుకు తగ్గట్టుగా కార్యకర్తలు పని చేయాలనీ మోదీ పిలుపునిచ్చినట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేననటి స్పష్టం చేశారు.దేశ వ్యతిరేక శక్తులతో బీజేపీ పోరాడుతోందన్నారు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్రావు. దేశాన్ని ఉత్తరాది, దక్షిణాదిలుగా విభజించే వారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఎంతో ముఖ్యమన్నారు. ఇక అధికారంలోకి వచ్చేముందు కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు కేంద్రమంత్రి బండి సంజయ్. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని విమర్శించారు. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు పోరాడాలన్నారు.ఇక తెలంగాణలో బీజేపీ 8 ఎంపీ సీట్లు గెలిచిందన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. ఒక కుటుంబం చేతిలో పదేళ్లు తెలంగాణ నలిగిపోయిందన్నారు. తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలంగాణలో ప్రధాని మోదీ సభ విజయవంతం కావడంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. మోదీ ఇచ్చిన స్ఫూర్తితో ముందుకు సాగాలంటూ నేతలు కార్యకర్తలకు సూచించారు. బెంగాల్ తరహాలోనే తెలంగాణలోనూ అధికారం సాధించాలని సూచించారు.

## ప్రోటోకాల్ పక్కన పెట్టి ఫ్రెండ్ షిప్... భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై సంకేతాలు

హైదరాబాద్, మే11, హైదరాబాద్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన రాజకీయంగా విస్తృత చర్చకు దారి తీసింది. సాధారణంగా ప్రధాని ఏ రాష్ట్రానికి వెళ్లినా అధికారిక కార్యక్రమాలకే పరిమితం కావడం ఆనవాయితీ. కానీ ఈసారి తెలంగాణ పర్యటనలో భాగంగా జూబ్లీహిల్స్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసాలకు మోదీ వెళ్లడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా అధికారిక ప్రోటోకాల్కు అతీతంగా మిత్రపక్ష నేతల ఇళ్లకు వెళ్లడం, వ్యక్తిగతంగా పలకరించడం, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీయడం వంటి పరిణామాలు ఎన్డీయే రాజకీయాల్లో కొత్త చర్చకు కారణమయ్యాయి.తెలంగాణలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రధాని సమయం చేసుకుని మరీ నేరుగా పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లారు. ఇటీవల సైనస్ శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కొంతసేపు కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడినట్లు సమాచారం. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి వెళ్లి భేటీ కావడం రాజకీయంగా మరింత ఆసక్తి రేకెత్తించింది. ఒకే పర్యటనలో ఏపీకి చెందిన ఇద్దరు కీలక నేతల నివాసాలకు ప్రధాని వెళ్లడం అరుదైన పరిణామంగా రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఎన్డీయే కూటమిలో ప్రస్తుతం టీడీపీ, జనసేన కీలక భాగస్వాములుగా ఉన్నాయి. ముఖ్యంగా 2024 ఎన్నికల తర్వాత కేంద్ర రాజకీయాల్లో చంద్రబాబు పాత్ర మరింత ప్రాధాన్యం పొందింది. సంఖ్యాపరంగా మాత్రమే కాదు, పరిపాలనా అనుభవం, పెట్టుబడుల ఆహ్వానం, దక్షిణాదిలో రాజకీయ ప్రభావం వంటి అంశాల్లో టీడీపీని బీజేపీ కీలక మిత్రపక్షంగా చూస్తోంది. అదే సమయంలో పవన్ కళ్యాణ్ యువతలో ప్రభావం ఉన్న నాయకుడిగా, జనసేన ద్వారా ఎన్డీయేకు సామాజికంగా విస్తరణ కల్పించే నేతగా గుర్తింపు పొందారు. ఈ నేపథ్యంలో మోదీ వ్యక్తిగతంగా ఇద్దరి నివాసాలకు వెళ్లడం ద్వారా మిత్రధర్మానికి గౌరవం ఇచ్చినట్టుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.
కూటమి రాజకీయాల్లో పరస్పర నమ్మకం, వ్యక్తిగత అనుబంధం కూడా ముఖ్యమనే సంకేతాన్ని ఈ భేటీలు ఇచ్చాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గతంలో బీజేపీ ? టీడీపీ మధ్య విభేదాలు చోటుచేసుకున్నప్పటికీ, ఇప్పుడు అదే నాయకత్వంతో సమన్వయం బలపడుతున్న దృశ్యం దేశానికి కనిపించేలా చేయడంలో ఈ భేటీలు కీలకంగా మారాయని విశ్లేషణలు వస్తున్నాయి.మరోవైపు దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ వ్యూహంలో కూడా ఈ భేటీలకు ప్రాధాన్యత కనిపిస్తోంది. తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల ప్రభావం ఎక్కువగా ఉండటంతో, బలమైన మిత్రపక్షాలతో కలిసి ముందుకు వెళ్లాలనే ఆలోచన బీజేపీలో స్పష్టంగా కనిపిస్తోంది. ఆ కోణంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్లను రాజకీయంగా ప్రాధాన్యంతో చూడడం ద్వారా దక్షిణాదిలో ఎన్డీయే బలం పెంచాలనే సంకేతాన్ని ప్రధాని పర్యటన ఇచ్చిందని భావిస్తున్నారు.హైదరాబాద్ వేదికగా జరిగిన ఈ భేటీలు మరో ఆసక్తికర చర్చకు కూడా దారి తీశాయి. రాష్ట్ర విభజన తర్వాత కూడా హైదరాబాద్ తెలుగు రాష్ట్రాల రాజకీయ, వ్యాపార, మీడియా కేంద్రంగా కొనసాగుతోంది. అలాంటి నగరంలో ప్రధాని ఏపీ సీఎం, డిప్యూటీ సీఎం నివాసాలకు వెళ్లడం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. తెలంగాణ పర్యటనలో ఉండగానే ఏపీ రాజకీయ నాయకులతో ప్రత్యేక సమయం గడపడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.ఇటీవల అమరావతి, పోలవరం, పెట్టుబడులు, కేంద్ర సహకారం వంటి అంశాల్లో కేంద్రం నుంచి ఏపీకి అనుకూల సంకేతాలు వరుసగా వస్తున్నాయి. అలాంటి సమయంలో ప్రధాని ఈ భేటీలు చేయడం ద్వారా కేంద్ర ? ఏపీ సమన్వయం బలంగా ఉందన్న అభిప్రాయం మరింత బలపడుతోంది. ముఖ్యంగా ఎన్డీయేలో ఏపీ భాగస్వామ్యానికి ఉన్న ప్రాధాన్యతను బహిరంగంగా చాటే చర్యగా ఈ పర్యటనను రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.మొత్తంగా చూస్తే, ఇది కేవలం మర్యాదపూర్వక సమావేశం లేదా ఆరోగ్య పరామర్శ మాత్రమే కాదు. దక్షిణాదిలో ఎన్డీయే వ్యూహం, మిత్రపక్షాలకు ఇస్తున్న ప్రాధాన్యత, కేంద్ర?ఏపీ రాజకీయ సమన్వయం, భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై సంకేతాలు ఇచ్చిన పరిణామంగా ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన నిలిచింది.

## సౌదీ అరేబియాలో చారిత్రాత్మక 'మినీ మహానాడు' పసుపు పండించిన తూర్పు ప్రాంతం!



అమరావతి 2026 సంవత్సరానికి గాను ప్రపంచంలోనే తొలిసారిగా సౌదీ అరేబియా?తూర్పు ప్రాంతంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు ఘనవిజయాన్ని సాధించింది. ఈ మహోత్సవాన్ని కోనేరు ఉమామహేశ్వరరావు, వరప్రసాద్ కందిబెడల, సంపత్ కోయ, నాగశేఖర్ చందగాని, నాగేశ్వరరావు బులుసు, ప్రభాకర రెడ్డి, దిలీప్ ,కేవీఎన్ రాజు, శ్రీనివాస్ గుబ్బల, మనోహర్ ప్రసాద్, నిస్సార్ అహ్మద్, శివ సిరిగిన, రాజేంద్ర రెడ్డి, సురేష్ రెడ్డి, రోహిత్ నందా, కిషోర్ ఔః, ప్రవీణ్ కోలేటి, రాజ్యలక్ష్మి నందమూరి, శారద కోనేరు, వర్ధిని బులుసు, అనిత నాగశేఖర్, సత్య మల్లిన తదితర నాయకులు, కార్యకర్తల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం తూర్పు ప్రాంతం మొత్తం పసుపు పండించినట్లైంది. సభా ప్రాంగణం అంతా పసుపు రంగుతో అలంకరించబడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## సోషల్ మీడియా ట్రెంగింగ్ లో కీర్తన...

చెన్నై, మే 11, (న్యూస్ పల్స్) తమిళనాడులో గత కొన్ని రోజుల రాజకీయ హైడ్రామాకు తెరతీస్తూ.. ఇవాళ టీవీకే నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం చేయగా.. ఆయనతోపాటు మరో 9 మంది కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇక ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తరఫున గెలిచిన అత్యంత యువతిగా 29 ఏళ్ల కీర్తన సంజయ్ విజయం సాధించారు. ఇప్పుడు ఆమె తాజాగా విజయ్ మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. దీంతో ఇప్పుడు అందరి దృష్టి ఆమెపైనే పడింది.విరుదునగర్ జిల్లాలోని శివకాశి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీవీకే తరఫున పోటీ చేసిన కీర్తన సంజయ్.. గెలుపొంది తమిళనాడు రాజకీయాల్లో కొత్త ఎమ్మెల్యేగా నిలిచారు. ఇక తాజాగా మీడియాతో మాట్లాడిన కీర్తన.. తాను రాజకీయాల్లో ఉండాలని ఎప్పుడూ ఊహించుకున్నానని.. అందుకే రాజకీయ వ్యూహకర్తగా తన వృత్తిని ఎంచుకున్నానని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తాను చాలా మంది రాజకీయ నాయకులతో కలిసి పనిచేశానని.. వ్యవస్థ ఎలా పనిచేస్తుందో, అధికార యంత్రాంగం ఎలా నడుస్తుందో అర్థం చేసుకున్నానని ఆమె చెప్పారు.1996లో విరుదునగర్లో పుట్టిన కీర్తన.. రాజకీయ సలహాదారుగా తన వృత్తిని ప్రారంభించారు. గవర్నమెంట్ తమిళ్ మీడియం స్కూల్లో చదువుకున్న కీర్తన.. మదురై కామరాజ్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న కాలేజీ నుంచి బీఎస్సీ మ్యాథ్స్ పూర్తి చేశారు. ఆ తర్వాత 2019లో పుదుచ్చేరి యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ పూర్తి చేశారు.ఇక కీర్తన ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాకముందు.. షోటైమ్ కన్సల్టింగ్, ఐప్యాక్ వంటి రాజకీయ వ్యూహాలు రచించే సంస్థల్లో పనిచేశారు. రాజకీయ సలహాదారుగా, డిజిటల్ ప్రచార వ్యూహకర్తగా పనిచేశారు. ఇక 2024లో ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీ తరఫున.. 2026లో పశ్చిమ బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తరఫున.. 2021 ఎన్నికల్లో తమిళనాడులో ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) పార్టీ తరఫున ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్నారు.ఈ క్రమంలోనే గత కొన్నేళ్లుగా.. ఆమె మాజీ ముఖ్యమంత్రులైన ఎంకే స్టాలిన్, మమతా బెనర్జీలతోపాటు.. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులతో కలిసి పనిచేశారు. తాను రాజకీయ వ్యూహకర్తగా తన పని తనకు పరిపాలన, పాలన, అధికార యంత్రాంగం పనితీరుపై లోతైన అవగాహన కల్పించిందని కీర్తన వెల్లడించారు. తమిళం, ఇంగ్లీష్, హిందీ, తెలుగుతో సహా మొత్తం 5 భాషలను కీర్తన అనర్గళంగా మాట్లాడగలరు. దీంతో ఆమె బహుభాషా కోవిధురాలిగా కూడా నిలిచారు. ఎక్కువ భాషలు నేర్చుకోవడం ద్వారా.. వివిధ రాష్ట్రాల్లో పనిచేయడానికి, అక్కడి ప్రజలతో మరింత ప్రత్యక్షంగా మమేకం కావడానికి సహాయపడిందని పేర్కొన్నారుతనకు ఇలా చాలా భాషలు రావడం వల్ల వివిధ రాష్ట్రాల్లో పనిచేయడానికి ఎన్నో అవకాశాలు వచ్చాయని కీర్తన తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సందేశాన్ని దేశం మొత్తంలో ఎక్కువ మంది అర్థం చేసుకుని.. ఆయనకు మద్దతు తెలపాలనే ఉద్దేశ్యంతోనతాను హిందీ మాట్లాడటాన్ని ఎంచుకున్నానని ఆమె తెలిపారు. ఈ అసెంబ్లీ ఎన్నికలలో శివకాశి స్థానంలో 68,709 ఓట్లు సాధించిన కీర్తన.. కాంగ్రెస్ అభ్యర్థి అశోకన్ జిని 11,670 ఓట్ల తేడాతో ఓడించారు.
గత 7 దశాబ్దాల్లో శివకాశి నుంచి ఒక మాజీ ఏఐఏడీఎంకే మంత్రిని ఓడించిన తొలి మహిళా ఎమ్మెల్యే కీర్తన కావడం విశేషం.తాను టీవీకే పార్టీలో చేరడానికి గల కారణాన్ని వివరించిన కీర్తన.. ఈ పార్టీ ప్రజలు అందరికీ అందుబాటులో ఉండే పార్టీ అని తెలిపారు. తనకు రాజకీయ, ఆర్థిక నేపథ్యం లేకపోయినా.. తాను ఇవాళ మంత్రి స్థానంలో ఉన్నానంటే అది కేవలం టీవీకే పార్టీ సామాన్యులకు కూడా అవకాశం ఇవ్వడం వల్లేనని స్పష్టం చేశారు. ప్రజల కోసం ఏదైనా చేయాలనే తపన ఉంటే.. టీవీకే పార్టీ స్వాగతం పలుకుతుందని పిలుపునిచ్చారు.

## బండి భగీరథ్ ఇరుక్కున్నాడా.. ఇరికించారా...

హైదరాబాద్, మే 11, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ చుట్టూ వివాదాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. బండి సంజయ్ కుమారుడు ఒక బాలిక మీద లైంగికంగా దాడి చేశాడని ఇప్పటికే కేసులు నమోదు అయ్యాయి. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో ఇప్పటికే కేసు నమోదు అయింది. ఫోక్సో చట్టం కింద ఈ కేసు నమోదు కావడంతో రాజకీయంగా కలకలం చెలరేగుతుంది.దీనిపై ఇప్పటికే కేంద్రమంత్రి కుమారుడు స్పందించారు. తనపై వస్తున్న ఆరోపణలు మొత్తం నిజం కావని.. అవన్నీ బెదిరించడానికి చేస్తున్నవని ఆయన స్పష్టత ఇచ్చారు. ఇది కోట్ల కోసం తనను ఈ స్థాయిలో ఇబ్బంది పడుతున్నారని ఆయన కరీంనగర్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ నగరంలోని కొంపల్లి ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం ఐదు కోట్ల కోసం తనను ఈ స్థాయిలో ఇబ్బంది పెడుతోందని అతడు ఆ ఫిర్యాదులో స్పష్టం చేశాడు. ఆ అమ్మాయి తనకు స్నేహితుల ద్వారా పరిచయమైందని.. పార్టీలతోపాటు ఆలయాలకు కూడా ఆమెతో కలిసి వెళ్లినట్టు బండి సంజయ్ కుమారుడు స్పష్టం చేశారు. ఆమెను పెళ్లి చేసుకోవాలని లేకపోతే ఐదు కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని మంత్రి కుమారుడు చెబుతున్నారు. ఇప్పటికే ఆమెకు 50,000 ఇచ్చానని.. తనను డబ్బుల కోసం ఇంకా ఇబ్బంది పెడుతున్నారని.. తనను కాపాడాలని కేంద్ర మంత్రి కుమారుడు ఇప్పటికే చెప్పారు.
కేంద్ర మంత్రి కుమారుడి మీద ఆరోపణలు రావడం ఇదే తొలిసారి కాదు. గతంలో అతడు మహీంద్రా యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు ఒక వ్యక్తిపై దాడి చేశాడని.. కేంద్ర మంత్రి కుమారుడు వల్ల అతడు తీవ్రంగా గాయపడ్డాడని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ ఘటన జరిగినప్పుడు తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉంది. నాడు గులాబీ పెద్దలు ఈ కేసును తీవ్రంగా పరిగణించారు. అంతే కాదు కేంద్ర మంత్రి కుమారుడి మీద నాడు అధికార పార్టీకి కరపత్రం గా ఉన్న పత్రికలో ఇష్టానుసారంగా కథనాలు ప్రసారమయ్యాయి. తర్వాత ఈ కేసు సంగతి ఏమైందో తెలియదు.ఇప్పుడు కేంద్రమంత్రి కుమారుడ మీద మరో ఆరోపణలు రావడం.. ప్రధానమంత్రి తెలంగాణకు వస్తున్న సమయంలో ఈ ఘటన వెలుగులోకి రావడంతో రాజకీయంగా బండి సంజయ్ తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఈ ఘటనలో బండి సంజయ్ కుమారుడు తప్పు చేశాడా? లేదా? అనే విషయాలను పక్కన పెడితే.. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న బండి సంజయ్ కచ్చితంగా ఈ కేసును తీవ్రంగా తీసుకోవాలి. సోషల్ మీడియాలో పోస్ట్ చేసినంత మాత్రాన ప్రజల్లో నిర్దోషులు కాలేరు. సోషల్ మీడియా జస్టిస్ పాత్ర పోషించలేదు. అలాంటప్పుడు బండి సంజయ్ కచ్చితంగా తన కుమారుడి విషయంలో నిజాయితీని నిరూపించుకోవాలి.ఇప్పటికే గులాబీ పార్టీ కౌంటర్ మొదలుపెట్టింది. తన పార్టీ అధినేత కుమారుడు కేటీఆర్ మీద పదేపదే బండి సంజయ్ ఆరోపణలు చేసేవారని.. ఇప్పుడు ఆ బాధ అర్థం అవుతుందా అంటూ ఆ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. బండి సంజయ్ కుమారుడి మీద కచ్చితంగా విచారణ జరగాలని.. అప్పుడే నిజాలు బయటికి వస్తాయని గులాబీ నేతలు అంటున్నారు.

## కాకినాడరెడ్ క్రాస్ సమీపంలో ఓ వ్యక్తి గొంతు కోసిన దుండగులు

కాకినాడ రెడ్ క్రాస్ దగ్గర ఒక వ్యక్తి గొంతును దుండగులు కోసారు.కాకినాడ సిటీ గాంధీనగర్ ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న దారుణ ఘటనకు స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. రెడ్ క్రాస్ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిపై గుర్తుతెలియని దుండగులు కత్తితో దాడి చేసి గొంతు కోసి పరారైన ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధితుడు రోడ్డుపై నడుస్తు వెళ్తున్న సమయంలో అకస్మాత్తుగా దాడి జరిగింది. ఈ దాడితో అక్కడున్న స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఏఎస్పీ మనీష్ పాటిల్ దేవరాజ్, టూ టౌన్ సీఐ అప్పలనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.. ఘటన ప్రాంతం,పరిసర ప్రాంతాల పరిస్థితులను పోలీసులు క్లూస్ టీం పరిశీలించారు. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజ్ను పరిశీలిస్తూ నిందితులు కదలికలపై ఆరా తీస్తున్నారు. ఈ ఘటన పాత కక్షలా లేక వ్యక్తిగత కక్షల అనేదానిపై పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.. మృతుడు జి నాగేశ్వరరావు, 46 ఏళ్ల ఏపీఎస్పీ కానిస్టేబుల్ గా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తెలంగాణలో పెరగనున్న భూముల విలువ

హైదరాబాద్, మే 11, తెలంగాణ ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలను మే 26 నుంచి సవరించాలని నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ధరలు పెరగకముందే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవాలని ప్రజలు పోటీ పడుతుండటంతో రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం ఈ నెల 12 నుంచి 15 వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పనివేళలను పొడిగించింది. ముఖ్యంగా హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లోని 15 ప్రధాన కార్యాలయాల్లో ఉదయం 9.30 నుండి సాయంత్రం 6.30 వరకు సేవలు అందుబాటులో ఉంటాయి.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా స్థిరాస్తుల మార్కెట్ విలువలను పెంచాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించడంతో రిజిస్ట్రేషన్ల శాఖ ఒక్కసారిగా బిజీ అయిపోయింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత భూముల విలువలను 20 శాతం నుండి 100 శాతం వరకు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నూతన ధరలు మే 26 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉండటంతో పాత ధరలకే తమ రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవాలని సామాన్యుల నుంచి బిల్డర్ల వరకు అందరూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. ఈ భారీ రద్దీని క్రమబద్ధీకరించేందుకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ఈ నెల 12 నుంచి 15 వరకు ఎంపిక చేసిన 15 ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పనివేళలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ నాలుగు రోజుల పాటు కార్యాలయాలు ఉదయం 9.30 గంటలకే తెరుచుకుని సాయంత్రం 6.30 గంటల వరకు నిరంతరాయంగా పనిచేస్తాయి. రద్దీ ఎక్కువగా ఉన్న చంపాపేట్, సరూర్నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్నగర్, షాద్నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్కేసర్, నల్గొండ ఆర్వో, పటాన్చెరు, కుత్బుల్లాపూర్ కార్యాలయాల్లో ఈ నిబంధనలు వర్తిస్తాయి.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలకు మౌలిక సదుపాయాల కొరత లేకుండా చూడాలని, తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ల సంఖ్యను పెంచాలని, సర్వర్లపై ఒత్తిడి పడకుండా సాంకేతిక జాగ్రత్తలు తీసుకోవాలని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతును ఆదేశించారు. ఒకవేళ నిర్ణీత గడువు తర్వాత కూడా రద్దీ తగ్గకపోతే పనివేళలను మరింత పొడిగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. అలాగే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా ఇదే విధమైన సమన్వయం ఉండాలని కోరారు.భూముల మార్కెట్ విలువల సవరణ వల్ల ప్రభుత్వం ఈ ఏడాది సుమారు రూ. 19 వేల కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. కొకపేట్, గండిపేట్ వంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ప్రస్తుతం ప్రభుత్వ ధర కంటే మార్కెట్ ధరలు చాలా ఎక్కువగా ఉండటంతో ఈ వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం శాస్త్రీయ పద్ధతిలో రేట్లను సవరిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రజలు ధరల భారానికి భయపడి ముందుగానే రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి పారదర్శకంగా వేగంగా సేవలు అందించాలని ప్రభుత్వం కోరుతోంది.

# పాలమూరులో పారిశ్రామిక విప్లవం

మహబూబ్ నగర్, మే 11,హైదరాబాద్-పనాజీ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా మహబూబ్‌నగర్ నుంచి కర్ణాటక సరిహద్దులోని గుడెబల్లూర్ వరకు 80 కి.మీ. మేర ఎన్‌హెచ్-167 విస్తరణ పనులకు ప్రధాని మోదీ ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. రూ.3,180 కోట్ల అంచనా వ్యయంతో పీఎం గతిశక్తి పథకం కింద చేపట్టే ఈ ప్రాజెక్టు ద్వారా మూడు ఎకనమిక్, ఏడు లాజిస్టిక్ నోడ్స్ అందుబాటులోకి రానున్నాయి. ఈ రహదారి విస్తరణతో హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌కు అనుసంధానం ఏర్పడి, పాలమూరు ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా మారనుంది.తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పారిశ్రామికంగా మరో ఉన్నత స్థాయికి చేర్చే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో బృహత్తర అడుగు వేసింది. హైదరాబాద్-పనాజీ ఎకనమిక్ కారిడార్‌లో అత్యంత కీలకమైన ఎన్‌హెచ్-167 జాతీయ రహదారి విస్తరణ పనులకు ప్రధాని నరేంద్ర మోదీ నేడు హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పీఎం గతిశక్తి పథకంలో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టు కేవలం రహదారి విస్తరణ మాత్రమే కాకుండా సమగ్ర ఆర్థిక వృద్ధిని లక్ష్యంగా చేసుకుంది. మహబూబ్‌నగర్ నుంచి కర్ణాటక సరిహద్దులోని గుడెబల్లూర్ వరకు ఉన్న 80 కిలోమీటర్ల మేర ప్రస్తుతమున్న రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు.ఈ ప్రాజెక్టు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఫార్మాసిటీలు, మెడికల్ క్లస్టర్లను హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌తో అనుసంధానం చేస్తుంది. ఈ రహదారి వెంట మూడు ఎకనమిక్ నోడ్స్, ఏడు లాజిస్టిక్స్ నోడ్స్, తొమ్మిది సామాజిక నోడ్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే జడ్చర్ల వరకు ఉన్న నాలుగు వరుసల రహదారిని భవిష్యత్తులో ఆరు వరుసలకు పెంచే ఆలోచన ఉండగా.. వెనుకబడిన మహబూబ్‌నగర్-గుడెబల్లూర్ మార్గాన్ని ఇప్పుడు నాలుగు వరుసలుగా మార్చడం వల్ల ఈ ప్రాంతంలో పారిశ్రామిక పెట్టుబడులు వెల్లువెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా షాద్‌నగర్, కొత్తూరు, జడ్చర్ల పారిశ్రామికవాడలకు ఈ కొత్త రహదారి అదనపు బలాన్ని ఇస్తుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.మౌలిక సదుపాయాల పరంగా ఈ ప్రాజెక్టును అత్యున్నత ప్రమాణాలతో నిర్మిస్తున్నారు. ఈ 80 కి.మీ. విస్తరణలో 5 పెద్ద వంతెనలు, 36 చిన్న వంతెనలు, 260 కల్వర్టులను నిర్మించనున్నారు. ప్రయాణికుల భద్రత, సులభతర రాకపోకల కోసం 11 హై-లెవల్ వెహికల్ అండర్‌పాస్‌లు, 22 లో-లెవల్ వీయూపీలు, ఒక రైల్వే ఓవర్ బ్రిడ్జిని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను ప్రముఖ నిర్మాణ సంస్థ కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ దక్కించుకోగా.. రూ.3,180 కోట్ల అంచనా వ్యయంతో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో నిర్మాణాన్ని చేపట్టనున్నారు.ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, గుత్తేదారు సంస్థ మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం.. పనులను ప్రారంభించిన రెండేళ్లలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రహదారి పూర్తయితే.. మహబూబ్‌నగర్, దేవరకద్ర, మరికల్, మక్తల్, మాగనూరు మీదుగా కర్ణాటకకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా, స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇది తెలంగాణ మరియు కర్ణాటక రాష్ట్రాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే కీలక వారధిగా నిలవనుంది.

# జూన్ 2న 22 జిల్లాల్లోఇందిరా మహిళా శక్తి భవనాలు సిద్ధం

వరంగల్ మే 11, తెలంగాణ ప్రభుత్వం 22 జిల్లాల్లో రూ.110 కోట్లతో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాలను జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రారంభించనుంది. మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశాలు, శిక్షణ, ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం వీటిని శాశ్వత వేదికలుగా తీర్చిదిద్దారు. ఒక్కో భవనాన్ని 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.5 కోట్లతో నిర్మించారు. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళా సమాఖ్యలకు గొప్ప ఊరటనివ్వడమే కాకుండా ఆర్థిక పురోగతికి మార్గం సుగమం చేయనుంది.తెలంగాణ రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక అడుగు వేసింది. రాష్ట్రంలోని 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి పేరుతో నిర్మిస్తున్న అత్యాధునిక భవనాలు ప్రారంభోత్సవానికి ముస్తాబవుతున్నాయి. జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా వీటిని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. గ్రామీణ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ఈ భవనాలు ఇకపై కేంద్ర బిందువులుగా మారనున్నఉమ్మడి పది జిల్లాల్లో ఇప్పటికే భవనాలు ఉండగా.. కొత్తగా ఏర్పడిన 22 జిల్లాల్లో ఒక్కో భవనానికి రూ.5 కోట్ల చొప్పున ప్రభుత్వం మొత్తం రూ.110 కోట్లను కేటాయించింది. సుమారు 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో ఈ భవనాలను నిర్మిస్తున్నారు. హనుమకొండ, నిజామాబాద్, జగిత్యాల, ములుగు, సూర్యాపేట, యాదాద్రి వంటి జిల్లాల్లో ఇప్పటికే 17 భవనాల నిర్మాణం పూర్తి కాగా.. మిగిలిన 5 జిల్లాల్లో పనులు తుది దశకు చేరుకున్నాయి. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ పర్యవేక్షణలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తోంది.ఇప్పటివరకు మహిళా సమాఖ్యలకు సొంత కార్యాలయాలు లేకపోవడంతో సమావేశాలు నిర్వహించాలన్నా, శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలన్నా అద్దె భవనాలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇకపై ఆ ఇబ్బందులు తొలగిపోనున్నాయి. ఈ భవనాల్లో కేవలం కార్యాలయ పనులే కాకుండా, మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, మార్కెటింగ్ కార్యకలాపాలు కూడా సాగనున్నాయి. జిల్లా స్థాయి సమావేశాలు, సెమినార్ల నిర్వహణకు ఇవి వేదికలుగా నిలవనున్నాయని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు.వచ్చే నెల 2వ తేదీ నాటికి ఏవైనా పెండింగ్ పనులు ఉంటే పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మహిళా సాధికారతకు ఈ భవనాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. జూన్ 2న జరిగే సామూహిక ప్రారంభోత్సవ కార్యక్రమం మహిళా లోకానికి ఒక తీపి గుర్తుగా మిగిలిపోనుందని ప్రభుత్వం చెబుతోంది.

# 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు సెమిస్టర్ విధానం?

హైదరాబాద్, మే 11, తెలంగాణ విద్యా విధానం కమిటీ రాష్ట్రంలో 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని భావిస్తోంది. వార్షిక పరీక్షల వల్ల విద్యార్థులపై పడే ఒత్తిడిని తగ్గించి, విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే చదువుపై శ్రద్ధ చూపేలా ఈ మార్పు చేయనున్నారు. థియరీ కంటే ప్రాక్టికల్స్‌కు, అనుభవపూర్వక అభ్యసనానికి ప్రాధాన్యతనిస్తూ, పాఠశాల విద్యలో ఇంటర్‌ను విలీనం చేసే అంశాన్ని కూడా కమిటీ పరిశీలిస్తోంది.తెలంగాణ రాష్ట్ర విద్యా రంగంలో చారిత్రాత్మక మార్పులకు సర్కార్ సిద్ధమవుతోంది. ప్రస్తుతమున్న వార్షిక విద్యా విధానం స్థానంలో.. ఉన్నత విద్య (యూజీ/పీజీ) తరహాలోనే పాఠశాల స్థాయిలోనూ సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టే దిశగా తెలంగాణ విద్యా విధానం కమిటీ సభ్యులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా తొమ్మిదో తరగతి నుంచి ప్రారంభించి పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు ఈ నూతన విధానాన్ని అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దీనివల్ల విద్యార్థులు ఏడాది పొడవునా సిలబస్ మొత్తాన్ని గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉండదు. సిలబస్‌ను రెండు భాగాలుగా విభజించి పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులపై మానసిక ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం అమల్లో ఉన్న వార్షిక విధానంలో విద్యార్థులు పరీక్షలకు కొద్ది నెలల ముందు మాత్రమే పుస్తకాలు పట్టే ధోరణి కనిపిస్తోంది. అలాగే, మార్చి, ఏప్రిల్ నెలల్లో భారీ సిలబస్‌ను పునశ్చరణ చేయడం విద్యార్థులకు సవాలుగా మారుతోంది. సెమిస్టర్ విధానం వల్ల విద్యార్థులు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే చదువుపై దృష్టి సారిస్తారు. మొదటి సెమిస్టర్‌లో సాధించిన ఫలితాలను బట్టి ఉపాధ్యాయులు విద్యార్థుల బలహీనతలను గుర్తించి రెండో సెమిస్టర్ నాటికి వారిని మెరుగుపరిచే అవకాశం ఉంటుంది. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కూడా ఈ విధానానికి సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఒకవేళ స్కూల్ స్థాయిలో సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే తొలుత ఇంటర్మీడియట్‌కైనా ఈ విధానాన్ని వర్తింపజేయాలని కమిటీ భావిస్తోంది.ఈ మార్పులతో పాటు, బట్టీ పద్ధతికి స్వస్తి పలికి అనుభవపూర్వక అభ్యసన విధానానికి ప్రభుత్వం పెద్దపీట వేయనుంది. కేవలం థియరీ పాఠాలకే పరిమితం కాకుండా విద్యార్థులు తాము చదువుతున్న విషయాలను ప్రయోగాత్మకంగా అర్థం చేసుకునేలా ల్యాబ్‌లను ఆధునీకరించనున్నారు. ప్రతి విషయాన్ని జ్ఞాపకశక్తితో కాకుండా, అనుభవపూర్వకంగా నేర్చుకోవడం వల్ల అది వారి మెదడులో శాశ్వతంగా నిలిచిపోతుందని కమిటీ బలంగా నమ్ముతోంది. ఇందులో భాగంగానే పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్‌ను విలీనం చేసే ప్రక్రియను కూడా ఒక కీలక అడుగుగా భావిస్తున్నారు.ల్యాబ్‌ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనపై కూడా కమిటీ ప్రత్యేక నివేదికను రూపొందిస్తోంది. విద్యా వ్యవస్థలో నాణ్యతను పెంచడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షలకు తెలంగాణ విద్యార్థులను సిద్ధం చేయడమే ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశ్యం. ఈ ప్రతిపాదనలు గనుక పట్టాలెక్కితే.. తెలంగాణ విద్యా వ్యవస్థ దేశంలోనే ఒక ఆదర్శవంతమైన నమూనాగా మారనుంది. టీచర్లు కూడా ప్రణాళికాబద్ధంగా సిలబస్‌ను పూర్తి చేసేందుకు ఈ సెమిస్టర్ విధానం ఎంతో సహకరిస్తుందని కమిటీ సభ్యులు వెల్లడించారు.

# బండి సంజయ్ కొడుకు చుట్టూ రాజకీయం

కరీంనగర్, మే 11, కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ చుట్టూ ప్రస్తుతం ఒక పెను సంచలనం నెలకొంది. హనీ ట్రాప్, బ్లాక్‌మెయిల్, మైనర్ వేధింపుల వంటి తీవ్రమైన ఆరోపణలతో కూడిన ఈ వ్యవహారం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసులో ఇరు పక్షాల నుంచి పరస్పర విరుద్ధమైన ఫిర్యాదులు అందడం రాజకీయంగానూ, సామాజికంగానూ పెను దుమారం రేపుతోంది.బండి భగీరథ్ కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో స్వయంగా ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తనను కొంతకాలంగా ఒక కుటుంబం పథకం ప్రకారం హనీ ట్రాప్ చేసి, బ్లాక్‌మెయిల్ చేస్తోందని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని కొంపల్లికి చెందిన ఒక కుటుంబం తన నుంచి రూ.5 కోట్లు డిమాండ్ చేస్తోందని భగీరథ్ ఆరోపించారు.స్నేహితుల ద్వారా పరిచయమైన సదరు యువతితో కలిసి పార్టీలు, ఫంక్షన్లు, చివరకు గుడులకు కూడా వెళ్లానని, అయితే ఇప్పుడు ఆ సాన్నిహిత్యాన్ని అడ్డుపెట్టుకుని వీడియోలు, చాటింగ్ స్క్రీన్ షాట్లతో తనను వేధిస్తున్నారని ఆయన వెల్లడించారు. ఇప్పటికే సదరు యువతి తండ్రికి రూ.50,000 చెల్లించానని, అయినప్పటికీ వారు ఇంకా పెద్ద మొత్తంలో డబ్బు కావాలని ఒత్తిడి తెస్తున్నారని భగీరథ్ పోలీసులకు వివరించారు.భగీరథ్ ఫిర్యాదు చేసిన కొద్ది సేపటికే సదరు యువతి కుటుంబం కూడా పోలీసులను ఆశ్రయించడం ఈ కేసులో కీలక మలుపు. అయితే, వారు హైదరాబాద్‌లో ఫిర్యాదు చేస్తూ భగీరథ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ యువతి మైనర్ అని, భగీరథ్ ఆమెను వేధించాడని ఆ కుటుంబం పేర్కొంది. ఒకవేళ ఈ ఆరోపణలు నిజమని ప్రాథమిక విచారణలో తేలితే, భగీరథ్‌పై అత్యంత కఠినమైన పోక్సో చట్టం కింద కేసు నమోదయ్యే అవకాశం ఉంది. ఇది బండి సంజయ్ కుటుంబానికి రాజకీయంగా పెద్ద ఇబ్బందిగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.ఈ మొత్తం ఉదంతం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందనే ప్రచారం కూడా బలంగా సాగుతోంది. ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనకు ముందు ఈ వివాదం తెరపైకి రావడం చర్చనీయాంశమైంది. త్వరలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ జరగబోతోందని, ఈ క్రమంలో బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తప్పించి, ఆ స్థానాన్ని దక్కించుకోవాలని చూస్తున్న సొంత పార్టీకి చెందిన కొందరు నేతలే ఈ వ్యవహారాన్ని వ్యూహాత్మకంగా బయటకు తెచ్చారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.ప్రస్తుతం ఈ కేసుపై రెండు భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. కేంద్ర మంత్రి కుమారుడు నిజంగానే ఒక ప్లాన్ ప్రకారం హనీ ట్రాప్‌కు గురయ్యారా? లేక మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించి, ఆ తప్పు నుంచి తప్పించుకోవడానికి ముందే ఫిర్యాదు చేశారా? ఈ రెండు వెర్షన్లలో ఏది నిజమనేది పోలీసుల లోతైన విచారణలో మాత్రమే తేలాల్సి ఉంది. ఒకవైపు కేంద్ర మంత్రి కుమారుడి హోదా, మరోవైపు మైనర్ బాలిక రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ కేసుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నిందితులు ఎవరైనా, చట్టం తన పని తాను చేసుకుపోతుందా లేదా రాజకీయ ఒత్తిళ్లు పని చేస్తాయా అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది.

పొలిటికల్ టర్న్..

రాజకీయ నేతల పిల్లలు చేసే కొన్ని పనులు.. నేతలకు తలనొప్పిగా మారుతున్నాయి. రాజకీయంగా ఇబ్బందులు తెస్తున్నాయి. తాజాగా కేంద్ర మంత్రి బండి సంజయ్ విషయంలో కూడా ఆయన కుమారుడు సాయి భగీరథ్ చేసే పనులు ఇబ్బందిగా మారుతున్నాయి. కష్టపడి సామాన్య కార్యకర్త నుంచి కేంద్ర మంత్రి వరకు సంజయ్ ఎదిగారు. మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లోని మహేంద్ర కాలేజీలో సహచర విద్యార్థిపై దాడి ఘటన సంచలనంగా మారింది. అప్పుడు సంజయ్ ఎంపీగా ఉన్నారు. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న సంజయ్ తనయుడిపై పోక్సో కేసు నమోదు కావడం ఇప్పుడు మరింత సంచలనంగా మారింది. ఇది క్రమంగా రాజకీయం రంగు పులుముకుంది. సంజయ్ ఎదుగుదలను ఓర్వలేకనే కొందరు కుట్ర చేస్తున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ నేతలు.. సంజయ్ తనయుడికి సంబంధించిన పాత ఘటనల ఫొటోలతోపాటు తాజా ఘటనల ఫొటోలు వీడియోలో సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. సంజయ్ తనయుడి కొడుకు అంటూ సంజయ్ ఇమేజ్ డ్యామేజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు.సంజయ్ తనయుడిపై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై కేంద్ర మంత్రి తాజాగా స్పందించారు. ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు.'నాకు చట్టంపై గౌరవం, న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉంది. జీవితాంతం భారత రాజ్యాంగానికి కట్టుబడే ఉన్నాను. దశాబ్దాలుగా ప్రజలతోనే ఉన్న నేను మచ్చ లేని జీవితం గడిపానని గర్వంగా చెప్పగలను. నన్ను రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు నా పిల్లలను, కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగుతున్నారు. ఇది వారిలో గూడుకట్టుకున్న నిరాశ నిస్పృహలకు అద్దం పడుతుంది' అని పేర్కొన్నారు.

అట్టడుగు స్థాయి నుంచే నా ప్రజా జీవితాన్ని మొదలుపెట్టాను. కష్టపడి పనిచేసి ప్రజల ఆశీర్వాదంతో నాడు కార్పొరేటర్ గా, నేడు ఎంపీగా ఎన్నికై, కేంద్రమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను.

ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వెనకబడి వర్గాలకు చెందిన బీసీ వ్యక్తి, నాయకుడిగా కేంద్రమంత్రి స్థాయికి ఎదగడాన్ని కొన్ని శక్తులు జీర్ణించుకోలేక కుట్రలకు తెరతీశాయి' అని వెల్లడించారు.

# హస్తం లక్ష్యం ... ఆ ముగ్గురే...

కరీంనగర్, మే 11, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్.. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ... ఇక బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా మన్నె క్రిశాంక్..వీళ్లు ముగ్గురు సోషల్ మీడియా యాంటి సర్కార్ పోస్టులతో హోరెత్తిస్తున్నారు. దీంతో ఆ ముగ్గురు టార్గెట్‌గా అధికార కాంగ్రెస్ కూడా అన్నింటికీ రెడీ అయిపోయింది. బీఆర్ఎస్‌లోని ట్రిపుల్ కే పైనే అధికార పార్టీ సీరియస్ ఫోకస్ పెట్టిందా? అందుకే కేసులు, అరెస్టుల దాకా వ్యవహారం వెళ్తుందా?రాజకీయ విశ్లేషణతెలంగాణలో టార్గెట్ పాలిటిక్స్ ట్రెండింగ్‌గా మారాయి. అధికార కాంగ్రెస్..ప్రతిపక్ష నేతల విమర్శలను, ఆరోపణలను తిప్పికొట్టడంలో పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి పెరుగుతున్న రాజకీయ దాడిని హస్తం పార్టీ వ్యూహాత్మకంగా తిప్పికొట్టే ప్లాన్ చేస్తోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, యువ నాయకుడు మన్నె క్రిశాంక్‌లను కంట్రోల్ చేసేందుకు అధికార పార్టీ పక్కా స్కెచ్ వేసి ముందుకు పోతోంది.ఈ మధ్య కాంగ్రెస్ సర్కార్‌పై పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాల్లో కేటీఆర్ అటాకింగ్ డోస్ పెంచారు. ఇష్యూ ఏదైనా..సబ్జెక్ట్ మరేదైనా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై గళమెత్తుతున్నారు కేటీఆర్. వరంగల్ రైతు సంగ్రామ సదస్సులో రేవంత్‌పై, అధికార పార్టీపై కాస్త గట్టిగానే అటాక్ చేశారు. 420 హామీలు, ఆరు గ్యారెంటీలు అట్టర్ ఫ్లాప్ అంటూ ప్రజాక్షేత్రంలో పవర్ ఫుల్ వాయిస్ వినిపించారు. సభలు, సమావేశాలతో ఎన్నికల మూడ్ లోకి వెళ్లిపోయిన బీఆర్ఎస్..ఇప్పటి నుంచి ఇక పూర్తిస్థాయిలో జనంలో ఉండేలా రూట్ మ్యాప్ రెడీ చేసుకుని గ్రౌండ్‌లోకి దిగుతోంది. ఇందులో భాగంగా ఆరు గ్యారంటీలు అటకెక్కాయంటూ..కాంగ్రెస్ సభలు పెట్టిన చోటే కౌంటర్ మీటింగ్స్ పెడుతూ కేటీఆర్ విమర్శల దాడిని పెంచుతూ వస్తున్నారు.సీఎం రేవంత్ రెడ్డి నుంచి మొదలు మంత్రులపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి కేటీఆర్ కొరకరాని కొయ్యగా మారడంతో..వ్యక్తిగత విమర్శలు, ఆరోపణలతో తమ నేత క్యారెక్టర్‌ను దెబ్బతీసే కుట్ర చేస్తున్నారని అంటోంది బీఆర్ఎస్. ఈ-కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ విచారణ వంటివి కేటీఆర్ ను కార్నర్ చేసే కుట్రలో భాగమేనంటున్నాయి బీఆర్ఎస్ వర్గాలు.ఇక హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి..అధికార కాంగ్రెస్‌పై అటాకింగ్‌కు ఏ మాత్రం వెనకాడట్లేదు. అసెంబ్లీ లోపల, బయట రేవంత్ సర్కార్‌పై దూకుడుగా విమర్శలు చేస్తున్నారు. స్థానిక సమస్యల నుంచి రాష్ట్ర రాజకీయాల వరకు తనదైన స్టైల్లో రెస్పాండ్ అవుతూ లైమ్‌లైట్‌లో ఉంటున్నారు. ఈ మధ్య కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై, అధికారులపై చేస్తున్న వ్యాఖ్యలు, విమర్శలు రాజకీయ దుమారానికి దారితీస్తున్నాయి. ముఖ్యమంత్రి నుంచి మొదలు, మంత్రులు, అధికారులపై కౌశిక్ రెడ్డి సంచలన ఆరోపణలు చేయడం చర్చనీయాంశమవుతోంది.ఈ క్రమంలోనే కౌశిక్ రెడ్డి అధికార కాంగ్రెస్ పార్టీకి టార్గెట్ అయిపోయారని బీఆర్ఎస్ నేతలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే పలు కేసులు కౌశిక్ పై నమోదుకాగా..తాజాగా కరీంనగర్ దాడి బీజేపీ చేసినా?దానికి కాంగ్రెస్ సహకారం ఉందంటూ మండిపడుతున్నారు బీఆర్ఎస్ నేతలు. ఇవన్నీ కౌశిక్‌ను సైలెంట్ చేసే ప్రయత్నాలే అంటున్నారు గులాబీ లీడర్లు. గత అసెంబ్లీ సెషన్‌లో కౌశిక్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్న అంశాన్ని ఎథిక్స్ కమిటీకి సిఫారసు చేశారంటే ఏ రేంజ్‌లో టార్గెట్ చేశారో అర్థం చేసుకోవచ్చంటున్నారు బీఆర్ఎస్ నేతలు.మరోవైపు సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ సర్కార్‌పై పదునైన విమర్శలు, స్కామ్‌లు అంటూ ఆరోపణలు చేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మన్నె క్రిశాంక్‌పై వరుస కేసులు నమోదు అవుతున్నాయి. ఎక్స్ వేదికగా తన వాయిస్‌ను బలంగా వినిపిస్తున్న క్రిశాంక్..ప్రభుత్వంలో ఇంటర్నల్‌గా జరుగుతున్న అవినీతి వ్యవహారాలపై సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. దీంతో క్రిశాంక్ కూడా అధికార కాంగ్రెస్‌కు కంట్లో నలుసులా మారారని..అందుకే ఆయన్ను టార్గెట్ చేసి మరీ ఒక కేసు అయిపోకముందే మరో కేసులో కోర్టులు, జైళ్ల చుట్టూ తిప్పుతున్నారని మండిపడుతోంది బీఆర్ఎస్. సంబంధం లేని సెక్షన్ల కింద కేసులు పెట్టి జైలుకు పంపించారని అంటున్నారు.తమ పార్టీ తరపున గట్టిగా మాట్లాడుతున్న నేతలను కాంగ్రెస్ కావాలనే టార్గెట్ చేస్తోందనేది గులాబీ పార్టీ వాదన. ఇలా బీఆర్ఎస్‌లో ట్రిపుల్ కే చుట్టూ కాంగ్రెస్ పార్టీ, పోలీసులు చక్కర్లు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గట్టిగా మాట్లాడే నేతలను ఇప్పటి నుంచే కంట్రోల్ చేయకపోతే..ఎన్నికల నాటికి మరింత చెలరేగిపోతారనేది సర్కార్ ఆలోచనగా కనిపిస్తోంది. దీనిని బీఆర్ఎస్ ఎలా ఎదుర్కొంటుందో చూడాలి.

# యూపీ గ్యాంగ్ పనే రాబరీ...

కరీంనగర్, మే 11, కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలరీ షాపులో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో విచారణ వేగంగా కొనసాగుతోంది. ఈ కేసు పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. చోరీ జరిగి ఐదు రోజులైనా దొంగలను పట్టుకోలేదు. కానీ కీలక ఆధారాలను మాత్రం సేకరించారు. ఈ చోరీ తర్వాత పోలీసులు, అధికార పార్టీ నేతలు, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇది పోలీసులపై మరింత ఒత్తిడి పెంచుతోంది. ఈ భారీ దోపిడీ ఒక్కసారిగా తెలంగాణ పోలీసుల అవగాహనను మార్చేసింది. కోట్ల విలువైన ఆభరణాలు ఎత్తుకెళ్లడంతో ఈ సంఘటన వెనుక బిహార్ మూలాలు కలిగిన ఆరుగురు సభ్యుల అంతర్రాష్ట్ర 'గోల్డ్ థీఫ్' గ్యాంగ్ ఉందని పోలీసులు నిర్ధారించారు.ఈ ముఠా ఉత్తరప్రదేశ్‌లో అనేక కిడ్నాపింగ్ కేసుల్లో చిక్కుకుంది. వారు ధనవంతులను లక్ష్యంగా చేసుకుని డబ్బు వసూళ్లు చేసి, బంగారు దోపిడీల వైపు మళ్లారు. బిహార్ నుంచి తెలంగాణకు వలస వచ్చిన వీరు ధర్మపురి, పెద్దపల్లి ప్రాంతాల్లో లాడ్జీలు బుక్ చేసుకుని వారం రోజులు రెక్కీ నిర్వహించారు.

గ్యాంగ్ లీడర్ గతంలో జైలు శిక్ష అనుభవించాడని సమాచారం. వారి నెట్‌వర్క్ దక్షిణ భారతదేశంలో విస్తరిస్తోంది.దోపిడీ తర్వాత స్థానిక సినిమా ఫక్కీల్లో తమ ఆధారాలు వదిలి వెళ్లారు. ఇది పోలీసుల దృష్టిని స్థానికుల వైపు తిప్పడానికి వ్యూహాత్మక చర్య. ఫోరెన్సిక్ టీమ్ ఈ ఆధారాల నుంచి డీఎన్ఏ, మొబైల్ ట్రాకింగ్ ద్వారా గ్యాంగ్‌ను గుర్తించింది. ఈ టెక్నిక్ వారి సంక్లిష్ట 'రెడ్ హెర్రింగ్' వ్యూహం భాగం.కరీంనగర్ పోలీసులు, బిహార్, ఉత్తరప్రదేశ్ పోలీసులతో కోఆర్డినేట్ అవుతున్నారు. రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు. డ్రోన్‌లు, ఏఐ టూల్స్‌తో గాలింపు ముమ్మరం చేశారు. ఇప్పటికే రెండు వాహనాలు సీజ్ చేశారు. పోలీసు అధికారి ప్రకారం, 48 గంటల్లోపు అరెస్టులు జరుగుతాయి.గతేడాది ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి గ్యాంగ్ దోపిడీ చేసింది. దక్షిణ భారతదేశంలో బిహార్ ముఠాలు 30 శాతం పెరిగాయి. ఆర్థిక పురోగతితో జ్యువెలరీ లక్ష్యాలు ఎక్కువవుతున్నాయి.

# బండి సంజయ్ కుమారుడిని అరెస్టు చేయాలి




'సిరిసిల్ల మైనర్ బాలికను అత్యాచారం చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిని అరెస్ట్ చేయాలంటూ సిరిసిల్ల నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. బీఆర్ఎస్వీ (ఃఖీూ), బీఆర్ఎస్వై (ఃఖీూజ) నాయకులు సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి గూడూరు ప్రవీణ్, రాష్ట్ర నేత చీటీ నర్సింగరావు, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు పాల్గొని మీడియా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళాతో పాటు మహిళా కౌన్సిలర్లు తెలంగాణ భవన్లో ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, మహిళా కౌన్సిలర్లు కలిసి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు అందజేశారు.

# టి హబ్ లో కాగ్నిచాంప్ ఇండియా స్కాలర్షిప్

హైదరాబాద్ తెలంగాణలో విద్యా రంగానికి కొత్త దిశను సూచిస్తూ లక్షకు పైగా విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహించిన కాగ్నిచాంప్ ఇండియా స్కాలర్షిప్-తెలంగాణ 2026 కార్యక్రమం టీహబ్లో నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంపిక చేసిన టాప్ 100 మేధావులు, వారి తల్లిదండ్రులు, విద్యావేత్తలు, పాఠశాలల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జయప్రకాష్ నారాయణతో పాటు కాగ్నిటివ్ స్కోర్ ఏఊఫౌండర్స్ కీర్తి కుమారైజైన్, విక్రమ్సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఇప్పటికే టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్లో దేశానికి నాయకత్వం వహిస్తోందన్నారు. ఇప్పుడు కాగ్నిటివ్ రెడీనెస్ కూడా ముందుండాలని, ప్రపంచ స్థాయి సంస్థలు భవిష్యత్లో ఉద్యోగులను ఎంపిక చేసేటప్పుడు మార్కుల కంటే సమస్యల పరిష్కారంలో ఎలా ఆలోచిస్తారు, ఎలా పరిష్క రిస్తారు అనే అంశాలను ఎక్కువగా పరిశీలిస్తాయన్నారు.

చెరువుల చెంత హైడ్రా సీసీటీవీ నిఘా

# ఆక్రమణలకు ఆస్కారం లేకుండా చర్యలు900ల కెమేరాలను అమర్చి నిరంతర పర్యవేక్షణ

హైదరాబాద్, మే 11: చెరువుల పరిరక్షణకు హైడ్రా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. మట్టితో నింపి కబ్జా చేయాలనే ప్రయత్నాలకు చెక్ పెట్టింది. చెరువుల చెంత సీసీటీవీ కెమేరాలు పెట్టి గట్టి నిఘా ఏర్పాటు చేసింది. వీటిని హైడ్రా కార్యాలయంలోని సర్వర్కు అనుసంధానించింది. నిరంతరం చెరువుల చెంత ఏం జరుగుతుందో తెలుసుకునే వ్యవస్థను హైడ్రా కార్యాలయం నుంచే పర్యవేక్షించేలా ఏర్పాటు చేసింది. సీసీటీవీ కెమేరా నిఘా వ్యవస్థను సోమవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రారంభించారు. చెరువులలో మట్టి పోయకుండా.. ఆక్రమణలు జరగకుండా ఇప్పటికే లేక్ ప్రొటెక్షన్ టీమ్‌లు పర్యవేక్షిస్తున్నాయి. వీటికి తోడు సీసీటీవీ కెమేరా వ్యవస్థ అదనంగా అందుబాటులోకి వచ్చినట్టయ్యింది. చెరువుల్లో ఎవరైనా నిర్మాణ వ్యర్థాలు వేసినా.. మట్టితో నింపేందుకు ప్రయత్నించినా..కబ్జాలు చేసినా సీసీటీవీ కెమేరాల ద్వారా తెలుసుకునే వెసులుబాటు హైడ్రాకు లభించింది. హైడ్రా కార్యాలయంలో ఉన్న కంట్రోల్ రూం నుంచి మోనిటర్లద్వరా నిరంతరం పరిశీలిస్తారు. మట్టిని తెచ్చి పోసిన పక్షంలో ఆ వాహనం వివరాలను తెలుసుకోవడంతో పాటు.. అక్కడే ఉన్న లేక్ ప్రొటెక్షన్ టీమ్‌ను కూడా అప్రమత్తం చేస్తారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్న మోనిటర్లకు కూడా చెరువుల చెంత హైడ్రా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమేరాలను అనుసంధానం చేశారు. దీంతో నిఘా మరింత పటిష్టంగా ఉంటుందని హైడ్రా కమిషనర్ చెప్పారు. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్యతో పాటు అదనపు కమిషనర్ ఆర్ సుదర్శన్ కూడా సీసీటీవీ వ్యవస్థను ప్రారంభించిన వారిలో ఉన్నారు.

# బీజేపీ అవకాశవాద రాజకీయాలను కడప ప్రజలు తిప్పికొట్టాలి

## మతోన్మాద శక్తుల కుట్రలు ప్రజలు అప్రమత్తంగా గమనించాలి

## -సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

కడప రాష్ట్రంలో బీజేపీ, మతోన్మాద శక్తులు అమలు చేస్తున్న అవకాశవాద రాజకీయాలను కడప ప్రజలు అప్రమత్తంగా గమనించాలని, ప్రజల అసలు సమస్యలను పక్కదారి పట్టించే కుట్రలకు లోనుకావద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందడమే బీజేపీ ప్రధాన అజెండాగా మారిందన్నారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, కేంద్రం ఇచ్చిన హామీల అమలు వంటి కీలక అంశాలపై సమాధానం చెప్పలేని పరిస్థితిలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు మత రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. 2018లో బీజేపీ ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్ ఇప్పటివరకు అమలు కాలేదని, కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటు హామీ పూర్తిగా గాలిలో కలిసిపోయిందని గుర్తుచేశారు. విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు.

ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం నిధులు, పరిశ్రమల ఏర్పాటు వంటి అంశాలపై ప్రజలకు సమాధానం చెప్పకుండా మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టడం దుర్మార్గ రాజకీయమన్నారు. కడప నగరంలో కావాలనే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా కొన్ని మతోన్మాద శక్తులు వ్యవహరిస్తున్నాయని తప్పుపట్టారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో చంద్రబాబు.. కడపలోని అల్మాస్‌పేట సర్కిల్‌ను టిప్పు సుల్తాన్ సర్కిల్‌గా అభివృద్ధి చేస్తామని బహిరంగ సభలో ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం కడప కార్పొరేషన్ కూడా ఈ అంశంపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక ప్రతిపాదనలు పంపిందన్నారు. ఇప్పుడు అదే అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించి ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

ప్రస్తుతం మతోన్మాద శక్తులు ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న పరిస్థితిని ఆసరాగా చేసుకొని కొందరు కావాలనే ఉద్రిక్తతలను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కడప నగరంలో సామరస్య వాతావరణాన్ని దెబ్బతీయాలనే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కడపలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను చల్లార్చాలని, అన్ని వర్గాల ప్రజలతో చర్చలు జరిపి మత సామరస్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

కుట్రపూరితంగా ప్రజలను రెచ్చగొట్టే శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైతే దాని పూర్తి బాధ్యత చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానిదేనని ఈశ్వరయ్య హెచ్చరించారు. ప్రజలు మతం, కులం పేరుతో విడిపోకుండా ప్రజాస్వామ్య, లౌకిక విలువలను కాపాడాలని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపైనే రాజకీయ చర్చలు జరగాలని కోరారు.

# మోదీ బంగారాన్ని ఎందుకు కొనొద్దంటున్నారు?

హైదరాబాద్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం నాటి హైదరాబాద్ పర్యటన సాంతం ఆసక్తికరంగానే సాగింది. తెలంగాణ పర్యటనకు వచ్చిన మోదీ హైదరాబాద్ లో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇంటికి వెళ్లి ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఇక బీజేపీ తెలంగాణ శాఖ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించిన మోదీ బంగారం కొనొద్దంటూ దేశ ప్రజలకు పిలుపునిచ్చి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. మోదీ నోట నుంచి బంగారం కొనొద్దన్న మాట విన్నంతనే..ఆ వ్యాఖ్యలు తెగ వైరల్ అయిపోయాయి.ఎందుకంటే దేశ ప్రజలు ఏం చేస్తే బాగుంటుందో చెప్పే బాధ్యత ప్రధానిగా మోదీకి ఉన్నా..మరీ బంగారం కొనొద్దంటూ జనానికి చెప్పడం ఒకింత వింతగానే ఉందన్న మాట అయితే బలంగానే వినిపిస్తోంది. అయినా పొదుపులో అన్నింటికంటే మెరుగైన మార్గం బంగారం కొనుగోలు. మరి అలాంటి బంగారాన్ని కొనొద్దంటూ మోదీ ఎందుకు చెప్పారు? దానికీ ఓ రీజనుంది. ఆ రీజనేమిటో మోదీనే వెల్లడించారు.బంగారం రేట్లు ఇటీవలి కాలంలో ఓ రేంజిలో మారిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో బంగారం రేట్లు పెరిగాయి.

# కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శిగా కంబాల శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక

సత్తెనపల్లి, పిడబ్ల్యుడి వర్క్ షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ మహాసభ పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని అరండలపేట యూనియన్ ఆఫీస్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. పీడబ్ల్యుడి వర్క్ షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శిగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణానికి చెందిన కంబాల శ్రీనివాస్ ను మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ, వర్క్ చార్జింగ్ సిబ్బంది సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నది కెనాల్స్ వర్కర్స్ యూనియన్ అని శ్రీనివాస్ గుర్తు చేశారు. శ్రీనివాస్ ఎన్ని కావటం పట్ల కెనాల్ వర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి డివిజన్ గౌరవాధ్యక్షులు స్థానిక న్యాయవాది నరిశెటి వేణుగోపాల్, ఎఐటియుసి సత్తెనపల్లి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఈసిరెడ్డి అంజిరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు యల్లమంద, మస్తాన్ వలి, యేసయ్య, భాస్కర్, కిరణ్, ప్రజానాట్యమండలి సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, వల్లెం లక్ష్మీ చెన్నకేశవ, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డీ.ఆర్. మస్తాన్, పోకల శంకర్, సిపిఐ సత్తెనపల్లి నియోజకవర్గం కార్యదర్శి ముసునూర్ రమేష్, ఎస్ టి యు రాష్ట్ర నాయకులు ఎస్ఎమ్ సుభాని, జిల్లా నాయకులు జె విజయ ప్రసాద్, ఎం అప్పారావు, కే సురేష్. టి రాజు, ఎస్ టి యు సత్తెనపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు పి వెంకయ్య, ఎస్ సుభాని, ప్రజా చైతన్య భారతి ఉపాధ్యక్షులు పి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి కె. ప్రేమ్ కుమార్, ప్రభుత్వ వైద్యశాల శానిటరీ అండ్ సెక్యూరిటీ గార్డుల వర్కర్స్ యూనియన్ నాయకులు రాము, జోసఫ్, శేఖరు, అన్నమ్మ, భారతి, భవాని, పట్టణ ప్రముఖులు తాండవ కృష్ణ, కే వెంకటేశ్వరరావు, ఎం వెంకటరావు, జర్నలిస్ట్ యూనియన్ పల్నాడు జిల్లా నాయకులు ఎస్ కె. సైదా, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎం ఏడుకొండలు, బి. సంగీతారావు, ఏపీఎస్ఆర్టీసీ హయ్యర్ బస్ డైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి డిపో అధ్యక్షులు కొలుసు యలమంద, కోశాధికారి టీ. ప్రదీప్ చంద్ర, యూత్ నాయకులు టి. తిరుపతిరావు, ఏ. కోటేశ్వరరావు, తదితరులు కంబాల శ్రీనివాస్ కు అభినందనలు తెలియజేశారు.

# సింగపూర్ లో మంత్రి లోకేష్ పర్యటన



ఏపీ రాజధాని అమరావతిలో సింగపూర్లోని ప్రఖ్యాత పుంగోల్ జిల్లా తరహాలో ఒక భారీ ఇంటిగ్రేటెడ్ టౌన్షిప్ను నిర్మించనున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఈ టౌన్షిప్ కేవలం రాష్ట్రానికే కాకుండా యావత్ భారతదేశానికే ఒక మోడల్గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సింగపూర్ పర్యటనలో ఉన్న ఆయన, అక్కడి వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖతో జరిగిన జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సింగపూర్ మద్దతుతో అమరావతి ఆర్థిక ప్రాంతాన్ని అత్యుత్తమంగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే అమరావతి ఎకనమిక్ రీజియన్ అభివృద్ధిలో ఆసక్తిగల భాగస్వాములను ఆహ్వానిస్తూ ఆర్ఎఫ్పీ (ప్రతిపాదనల కోసం అభ్యర్థన) జారీ చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. రాజధాని అమరావతికి ఇప్పుడు పూర్తిస్థాయి చట్టబద్ధత ఉందని, ఇది పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ టౌన్షిప్ నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నుంచి అవసరమైన మద్దతు తీసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

## శివకాశీనుంచి తొలి మహిళా ఎమ్మెల్యే ఆరు భాషలలో దిట్ట

తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికరమైన అధ్యాయం మొదలైంది.ఏపీ తెలుగుదేశం పార్టీ విజయానికి తెరవెనుక వ్యూహాలు రచించిన ఓ యువతి, ఇప్పుడు ఏకంగా తమిళనాడు మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. రాజకీయ వ్యూహకర్త స్థాయి నుంచి మంత్రిగా ఆమె ఎదిగిన తీరు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఆమే ఎస్. కీర్తన. అతి పిన్న వయస్కురాలిగా, ఏకైక మహిళగా కీర్తన చరిత్ర సృష్టించారు. శివకాశీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఆరు దశాబ్దాల చరిత్రలో ఆ స్థానం నుంచి ఎన్నికైన తొలి మహిళగా నిలిచారు. విరుదునగర్ జిల్లాలో 1996లో పుట్టిన కీర్తన, తన ప్రాథమిక విద్యాభ్యాసాన్ని ప్రభుత్వ తమిళ మీడియం పాఠశాలలో పూర్తి చేశారు. ఆ తర్వాత మదురై కామరాజ్ యూనివర్సిటీ అనుబంధ కళాశాల నుంచి బీఎస్సీ మ్యాథమెటిక్స్లో పట్టా పొందారు. ఉన్నత చదువులపై ఆసక్తితో పుదుచ్చేరి యూనివర్సిటీలో చేరి 2019లో ఎంఎస్సీ స్టాటిస్టిక్స్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు.రాజకీయాల్లోకి రాకముందు కీర్తన, ఐప్యాక్ మరియు షోటైమ్ కన్సల్టింగ్ వంటి ప్రఖ్యాత పొలిటికల్ కన్సల్టెన్సీ సంస్థల్లో డిజిటల్ క్యాంపెయిన్ స్ట్రాటజిస్టా పనిచేశారు. ఈ క్రమంలో ఆమె దేశంలోని పలువురు అగ్రశ్రేణి నాయకులతో కలిసి పనిచేసే అవకాశం దక్కించుకున్నారు. ఆంధ్రప్రదేశ్లో తెలుగు దేశం పార్టీ , పశ్చిమ బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్ , తమిళనాట ద్రవిడ మున్నేత్ర కజగం వంటి బలమైన పార్టీల ఎన్నికల వ్యూహరచనలో పాలుపంచుకున్నారు. కీర్తన తమిళం, ఇంగ్లీషు, హిందీ, తెలుగుతో పాటు మరో భాషలో అనర్గళంగా మాట్లాడగలరు. బహుళ భాషలు నేర్చుకోవడం వల్ల వివిధ రాష్ట్రాల్లో పనిచేయడానికి, ప్రజలతో నేరుగా మమేకమవడానికి ఎంతో సహాయపడిందని ఆమె అన్నారు. ముఖ్యంగా, విజయ్ సందేశాన్ని దేశవ్యాప్తంగా ఎక్కువ మందికి చేరవేయాలనే ఉద్దేశంతోనే హిందీ మాట్లాడాలని నిర్ణయించుకున్నట్లు ఆమె వివరించారు.

## పోలీసులు పై ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ సీరియస్

అమరావతి. కడపలో ఒక సెంటర్ పేరు మార్పు వ్యవహారం లో బిజెపి నేతలపై పోలీసులు అమానుషంగా వ్యవహరించారని ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.కడప బిజెపి జిల్లా అధ్యక్షుడు పై చేయి చేసుకున్న డిఎస్పీ పి వెంటనే సస్పెండ్ చేయాలని మాధవ్ డిమాండ్ చేశారు.పోలీసులు ఈ విధంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. అరాచక శక్తులు జోలికి పోకుండా కేవలం ప్రజా స్వామ్య పద్ధతిలో నిరసన తెలిపితే పోలీసులు ఈ విధంగా దాడులకు దిగుతారా అంటూ మాధవ్ పోలీసులు తీరుపై మండి పడ్డారు.డిఎస్పీని సస్పెండ్ చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకు వస్తున్నామని హెచ్చరించారు. ఈమేరకు పోలీసులు చేయిచేసుకున్నవీడియోను మీడి యాకు విడుదల చేశారు.

## ఏసీబీ వలలో ఇద్దరు మునిసిపల్ ఉద్యోగులు

అనంతపురం ఏసీబీ వలలో మరో అవినీతి అధికారి దొరికిపోయాడు. రూ.25 వేలు లంచం తీసుకుంటూ మున్సిపల్ అధికారి చిక్కాడు. మున్సిపల్ డీఈ, జూనియర్ అసిస్టెంట్ అను ఏసీబీ అదుపులోకి తీసుకుంది. ఎగ్జిబిషన్కు పర్మిషన్ ఇచ్చేందుకు రూ.25 వేలు లంచం తీసుకుంటూ.. మున్సిపల్ డీఈ లక్ష్మీనరసింహులు, జూనియర్ అసిస్టెంట్ సందీప్ ఏసీబీ అధికారులకు రెడ్హ్యాండెడ్గా చిక్కాడరు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# మే 23 నుండి శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

### తిరుపతి, 2026 మే 11మే 27న గరుడసేవ

### మే 30న రథోత్సవం ,మే 18న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

కలియుగ వైకుంఠమైన తిరుపతిలో వెలసిన శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మే 23 నుండి 31వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మే 22వ తేదీ సాయంత్రం అంకురార్పణంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు.భక్తజనుల గోవింద నామస్మరణల మధ్య స్వామివారు వివిధ వాహనాలపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు. ప్రతిరోజూ ఉదయం 7 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి.వాహనసేవల విశేషాలుమే 23 ? ధ్వజారోహణం, పెద్దశేష వాహనంఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమవుతాయి. రాత్రి పెద్దశేష వాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహించనున్నారు .మే 24 ? చిన్నశేష, హంస వాహనాలుఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనంపై స్వామివారు విహరించనున్నారు.మే 25 ? సింహ, ముత్యపుపందిరి వాహనాలుఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనసేవ భక్తులను అలరించనున్నాయి.మే 26 ? కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలుఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనంపై స్వామివారు దర్శనమివ్వనున్నారు.మే 27 ? మోహినీ అవతారం, గరుడసేవఉదయం మోహినీ అవతారంలో స్వామివారు భక్తులను కటాక్షించనుండగా, రాత్రి జరిగే గరుడవాహనసేవ బ్రహ్మోత్సవాల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.మే 28 ? హనుమంత, గజ వాహనాలుఉదయం హనుమంత వాహనం, రాత్రి గజవాహనసేవలు భక్తులను భక్తిరసంలో ముంచెత్తనున్నాయి.

మే 29 ? సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలుఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు ఊరేగనున్నారు.

మే 30 ? రథోత్సవం, అశ్వవాహనంఉదయం రథోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుండగా, రాత్రి అశ్వవాహనసేవ నిర్వహించనున్నారు.

మే 31 ? చక్రస్నానం, ధ్వజావరోహణం ఉదయం చక్రస్నాన మహోత్సవం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు సంపూర్ణం కానున్నాయి.ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.మే 18న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంబ్రహ్మోత్సవాల సందర్భంగా మే 18వ తేదీన ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 7 నుండి 9 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమమైన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితరాలను పవిత్రజలాలతో శుద్ధి చేసి, నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం, కుంకుమ తదితర సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన పవిత్ర మిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు.

# మోడీకి మాటిచ్చా...

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ భేటీలో కు ప్రధాని మోదీ పలు సూచనలు చేశారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడిన తర్వాతే తిరిగి విధుల్లో చేరాలని, అప్పటివరకు పూర్తిస్థాయిలో విశ్రాంతి తీసుకోవాలని స్పష్టం చేశారు "ముందు ఆరోగ్యంపై దృష్టి పెట్టండి, పనుల గురించి ఆ తర్వాత ఆలోచించవచ్చు" అని మోదీ చెప్పినట్లు సమాచారం. పవన్ కల్యాణ్ అర్ధాంగి అన్నా లెజినోవా సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ప్రస్తుతం వైరల్గా మారింది. ప్రధాని మోదీ తన భర్తకు ఇచ్చిన సలహాను, తనకు చెప్పిన మాటలను ఆమె తన పోస్టులో పంచుకున్నారు. "ముందు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, పూర్తిగా కోలుకున్నాకే పని మొదలుపెట్టాలని ప్రధాని మోదీ నా భర్తకు చెప్పారు. అలాగే నన్ను చూసి 'మీ భర్తను జాగ్రత్తగా చూసుకోండి' అన్నారు. ఆ పని నేను ఎంతో సంతోషంగా చేస్తున్నాను. నా భర్తను జాగ్రత్తగా చూసుకుంటానని ప్రధాని మోదీకి నేను మాటిచ్చాను" అని అన్నా లెజినోవా తన పోస్టులో పేర్కొన్నారు.ప్రధాని మోదీతో పవన్ కుటుంబ సభ్యులు దిగిన ఫొటోలు, అన్నా లెజినోవా పెట్టిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పవన్ అభిమానులు, జనసేన కార్యకర్తలు ఈ పోస్టుపై స్పందిస్తూ, తమ నేత త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

## విశిష్ట అతిథికి విశిష్ట బహుమతి

హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబం అరుదైన, ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చింది ప్రధాని మోదీకి తమ కుటుంబం తరఫున ఒక విశిష్టమైన బహుమతిని అందించారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కళావైభవానికి ప్రతీకగా నిలిచే వెంకటగిరి జామ్దానీ నేతతో ప్రత్యేకంగా రూపొందించిన శ్రీవారి చిత్రపటాన్ని కానుకగా సమర్పించారు. తిరుమల శ్రీవారిని కీర్తించే శ్లోకంతో పాటు నేసిన ఈ చిత్రపటం రాష్ట్ర ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదకు అద్దం పట్టేలా ఉంది. తమ ఇంటికి వచ్చిన విశిష్ట అతిథికి ఏపీ సంప్రదాయాన్ని ప్రతిబింబించే కానుకను అందించి చంద్రబాబు కుటుంబం తమ గౌరవాన్ని చాటుకుంది. మోదీ, బిజీ షెడ్యూల్లోనూ చంద్రబాబు కుటుంబానికి ప్రత్యేకంగా గంటకు పైగా సమయం కేటాయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ వంటకాలతో తేనీటి విందు ఇచ్చారు. ప్రధాని మోదీ, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ను ఆప్యాయంగా పలకరించారు. వారి మధ్య ఉన్న సాన్నిహిత్యం మరోసారి స్పష్టంగా కనిపించింది. ఇది కేవలం టీడీపీ-బీజేపీ రాజకీయ బంధం మాత్రమే కాదని, ప్రధాని మోదీకి, నారా కుటుంబానికి మధ్య బలమైన వ్యక్తిగత అనుబంధం ఉందని ఈ సంఘటన నిరూపిస్తోందని టీడీపీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# మోడీ ముందుచూపు... దేని కోసం

హైదరాబాద్, మే 11, హైదరాబాద్లోని పరేడ్ గ్రౌండ్లో జరిగిన సభలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా తలెత్తిన ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, దేశ ప్రయోజనాల దృష్ట్యా కరోనా సమయంలో మనం అలవాటు చేసుకున్న పని పద్ధతులను మళ్లీ ఆచరణలోకి తీసుకురావాలని ప్రధాని కోరారు. సాధ్యమైతే చోట ఇంటి నుండే పనిచేసే విధానాన్ని ప్రోత్సహించాలన్నారు. అనవసర ప్రయాణాలను తగ్గించి, ఆన్లైన్ మీటింగ్లు, వీడియో కాన్ఫరెన్స్ల ద్వారా పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ పద్ధతులు పాటించడం వల్ల ఇంధనం ఆదా అవ్వడమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు.ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల విదేశీ మారక ద్రవ్యంపై భారం పడుతోందని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత వాహనాలకు బదులుగా మెట్రో రైలు, ఆర్టీసీ బస్సులను ఉపయోగించాలని కోరారు. సొంత వాహనాలు వాడాల్సి వస్తే ఒకే వాహనంలో ఎక్కువ మంది వెళ్లాలని సూచించారు. సాధ్యమైనంత వరకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. దేశం నుండి విదేశీ కరెన్సీ బయటకు వెళ్లకుండా అడ్డుకునేందుకు ప్రజలు కొన్ని నియంత్రణలు పాటించాలని ప్రధాని కోరారు.అనవసరమైన విదేశీ పర్యటనలు, ఓవర్సీస్ వెకేషన్లను పక్కన పెట్టాలని, వాటికి బదులుగా దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని కోరారు.విదేశాల్లో పెళ్లిళ్లు చేసుకోవడం మానుకుని, భారత్లోనే వేడుకలు జరుపుకోవాలని సూచించారు. విదేశీ మారక ద్రవ్యంపై ఒత్తిడిని తగ్గించడానికి కనీసం ఒక ఏడాది పాటు అనవసరమైన బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ప్రజలను కోరారు.అంతర్జాతీయ విభేదాలు, సరఫరా గొలుసులో అంతరాయాల వల్ల ఏర్పడిన సవాళ్లను భారత్ సమిష్టిగా ఎదుర్కోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. మోదీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం యావత్త దేశాన్ని మళ్లీ లాక్డౌన్ వస్తుందా అనే ఆలోచనలో పడేసింది. అయితే కొందరు నిపుణులు మాత్రం దేశ ఆర్థిక భద్రతను కాపాడాలనే ఉద్దేశ్యంతోనే మోదీ ఈ వ్యాఖ్యలు చేశారని చెబుతున్నారు. పశ్చిమ ఆసియా యుద్ధం వంటి భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా చమురు ధరలు భారీగా పెరిగాయని.. తద్వారా భారత్ తన విదేశీ మారక ద్రవ్యాన్ని భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని అందుకే పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించమని కోరినట్టు నిపుణులు చెబుతున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే, మళ్లీ లాక్డౌన్ పరిస్థితులు రాకుండా ఉండాలన్నా, రాబోయే ప్రపంచ ఆర్థిక సంక్షోభ పరిస్థితుల నుండి సామాన్యులను, దేశ ఆర్థిక వ్యవస్థను రక్షించడానికి, ప్రజల్లో క్రమశిక్షణ, పొదుపు అనే ముందస్తు జాగ్రత్తలను అలవాటు చేసేందుకుకే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తోంది.

## తమిళనాట కర్మ రిటర్న్స్...
## పలకరించుకోని విజయ్, ఉదయనిధి..

చెన్నై, మే 11, (న్యూస్ పల్స్) తమిళనాడు ముఖ్యమంత్రిగా టీవీకే అధినేత జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు తొమ్మిది మంది టీవీకే నేతలు మంత్రులుగా ఆదివారం ప్రమాణం చేశారు. నేడు తమిళనాడు అసెంబ్లీలో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. తమిళనాడు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ తాత్కాలిక స్పీకర్గా కరుప్పయ్యతో ప్రమాణ స్వీకారం చేయించగా, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించనున్నారు. అసెంబ్లీ వ్యవహారాలను తాత్కాలిక స్పీకర్ నిర్వహించే ముందు ఆయన బాధ్యతలు స్వీకరిస్తూ ప్రమాణం చేశారు. మొదట తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, ఆ తర్వాత 9 మంది మంత్రులతో స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తరువాత అసెంబ్లీలో పక్ష నేతలు ఉదయనిధి స్టాలిన్ (డీఎంకే), ఎడప్పాడి పళనిస్వామి (అన్నాడీఎంకే) ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేయనున్నారు. తర్వాత మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్ సెల్వం, మాజీ మంత్రులు, ప్రభుత్వ ప్రధాన విప్ల అసెంబ్లీలో నేడు ప్రమాణ స్వీకారం చేస్తారు. వీరి తరువాత మిగతా ఎమ్మెల్యేలు వారి తమిళ అక్షర క్రమంలో ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేయనున్నారని తెలిసిందే. సోమవారం ఉదయం అసెంబ్లీ హాలుకు వచ్చిన ముఖ్యమంత్రి విజయ్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఒకరికొకరు ఎదురుపడ్డారు. తరువాత సీఎం సీటులో విజయ్, ప్రతిపక్ష నేత సీటులో ఉదయనిధి స్టాలిన్ కూర్చున్నారు. ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నప్పటికీ కనీసం పలకరించుకోలేదు, ఒక్కమాట కూడా మాట్లాడుకోలేదు. ఇద్దరూ ఒకరినొకరు చూడలేదన్నట్లుగా వ్యవహరించారు.

కర్మ రిటర్న్స్.. ప్రతిపక్షనేతగా ఉదయనిధి

విజయ్ పార్టీ స్థాపించిన తరువాత మెల్లగా ప్రచార సభలు నిర్వహిస్తున్న సమయంలో ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యల్ని టీవీకే కార్యకర్తలు, విజయ్ ఫ్యాన్స్ గుర్తుచేసుకుంటున్నారు. ఉదయనిధి స్టాలిన్, విజయ్ ఇద్దరూ సినిమాల నుంచి రాజకీయాల్లోకి వచ్చిన వారే. అయితే ఉదయనిధి తండ్రి ఎంకే స్టాలిన్, తాత కరుణానిధి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చారు. క్రమంలో తనను తాను నిరూపించుకుంటూ డిప్యూటీ సీఎం స్థాయికి ఎదిగారు. మరోవైపు విజయ్ సొంతంగా ఎలాంటి అండ లేకుండా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. విజయ్ రాజకీయ సభలు పెడుతున్న తొలి రోజుల్లో ఉదయనిధి ఘాటు వ్యాఖ్యలు చేశారు. విజయ్ని పార్ట్ టైం పొలిటీషియన్ అని, ఆయనకు రాజకీయాలు అంతగా తెలియవంటూ ఎద్దేవా చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. తాను సినిమా నుంచే పాలిటిక్స్ లోకి వచ్చినప్పటికీ.. విజయ్ని మాత్రం రీల్ యాక్టర్, పార్ట్ టైం లీడర్ అని ఎద్దేవా చేశారు. ప్రజల సమస్యలు, రాష్ట్రం గురించి అవగాహనా లేని వారు రాజకీయాల్లోకి ఏం చేస్తారంటూ విజయ్ని టార్గెట్ చేశారు. డీఎంకేను విమర్శించేందుకు, ఇతరులకు అధికారం కట్టబెట్టేందుకు విజయ్ రాజకీయాలు మొదలుపెట్టారని విమర్శించారు. విజయ్ మాత్రం ఓ ప్లాన్ ప్రకారం పార్టీని బలోపేతం చేసుకుంటూ అభ్యర్థుల ఎంపిక, ప్రచారం విషయంలో జాగ్రత్తలు తీసుకున్నారు. ఎవరి మద్దతు లేకుండా, ఎవరితోనూ పొత్తులు లేకుండా తమిళగ వెట్రి కళగం ( ౧ఎఐ) పార్టీ ఎన్నికల బరిలోకి దిగి 108 స్థానాలు సాధించి సత్తా చాటింది.

డీఎంకే కూటమి 73 స్థానాలు, అన్నడీఎంకే కూటమి 53 చోట్ల నెగ్గింది. ప్రస్తుతం రాజకీయ సమీకరణాలు మారిపోయాయి.తొలి ఎన్నికతోనే సత్తా చాటిన విజయ్.. కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర చిన్న పార్టీల మద్దతుతో తమిళనాడు ముఖ్యమంత్రి అయ్యారు.

పార్ట్ టైం పొలిటీషియన్ అని పిలిచిన ఉదయనిధి నేడు ప్రతిపక్షనేతగా మిగలగా, అన్ని మాటలు పడి అవమానాలు ఎదుర్కొన్న విజయ్ సీఎం స్థానంలో కూర్చున్నారు. దాంతో కర్మ అనేది తిరిగి వస్తుందని, దాని నుంచి తప్పించుకోలేరు అని టీవీకే కార్యకర్తలు, విజయ్ ఫ్యాన్స్ అంటున్నారు.

# తూర్పు తెలంగాణలో ఉష్ణోగ్రత 47 డిగ్రీలకు చేరే అవకాశం

హైదరాబాద్, మే 11, రాష్ట్రంలో రెండు రోజులుగా కాస్త చల్లబడిన వాతావరణం మళ్లీ వేడెక్కనుంది. మంగళవారం నుంచి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని, ముఖ్యంగా ఈ నెల 18 నుంచి 22 మధ్య కాలంలో ఎండలు గరిష్ఠ స్థాయికి చేరతాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రత ఏకంగా 47 డిగ్రీల మార్కును తాకే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు.మిగతా ప్రాంతాల్లో 46 డిగ్రీలకు చేరువగా, హైదరాబాద్ నగరంలో సైతం 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. రాబోయే రోజుల్లో పలు జిల్లాల్లో వడగాల్పుల తీవ్రత పెరగనుందని, ఈ ప్రభావం కనీసం పది రోజుల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సోమవారం కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురవచ్చని పేర్కొంది. ఆదివారం నిజామాబాద్ జిల్లా సాలూరలో అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో శనివారం అర్ధరాత్రి కురిసిన వడగండ్ల వాన అన్నదాతలను తీవ్రంగా నష్టపరిచింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్న రాశులు తడిసిముద్దయ్యాయి. తడిసిన పంటను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# రణబాలి గ్లింప్స్ విడుదల




టాలీవుడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా, ఆయన నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి' నుంచి ఒక ప్రత్యేక మేకింగ్ గ్లింప్స్ను చిత్రబృందం విడుదల చేసింది. రాహుల్ డైరక్షన్ లో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో విజయ్ దేవరకొండకు జోడీగా రష్మిక మందన్న నటిస్తున్నారు. మేకింగ్ వీడియోలో 'రణబాలి' పాత్ర కోసం విజయ్ దేవరకొండ పడిన కష్టాన్ని చూపించారు. ముఖ్యంగా సినిమాలోని గుర్రపు స్వారీ సన్నివేశాల కోసం ఎంత తీవ్రంగా శిక్షణ తీసుకున్నాడో ఇందులో హైలైట్ చేశారు. మచ్చిక చేసుకోవడానికి అత్యంత కష్టమైన స్టాలియన్ జాతి గుర్రాలతో విజయ్ ప్రాక్టీస్ చేశారు సినిమాలోని గుర్రపు స్వారీ సన్నివేశాలు, భారీ యాక్షన్ ఘట్టాలు ముఖ్య ఆకర్షణగా నిలుస్తాయని చిత్ర యూనిట్ తెలిపింది.19వ శతాబ్దంలో, 1854 నుంచి 1878 మధ్య బ్రిటిష్ పాలన కాలంలో జరిగిన వాస్తవ చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. 'రణబాలి' చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## ఫిట్నెస్ ఐకాన్ గా జ్యోతిక



జ్యోతిక అభినయానికే కాకుండా, క్రమశిక్షణకు కూడా మారుపేరు. 47 ఏళ్ల వయసులో కూడా ఆమె ప్రదర్శిస్తున్న ఫిట్నెస్ చూసి సినీ ప్రపంచం ఆశ్చర్యపోతోంది. మదర్స్ డే సందర్భంగా ఆమె తన ఇన్స్టాగ్రామ్లో పంచుకున్న ఒక వర్కవుట్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది.ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే, తన ఆరోగ్యం కోసం జ్యోతిక కేటాయిస్తున్న సమయం ఎంతో మందికి స్ఫూర్తినిస్తోంది. "ఈ మదర్స్ డే నాడు మిమ్మల్ని మీరు ఉత్తేజపరుచుకోండి.. మనల్ని మనం ప్రేమించుకోవడం అంటే ఆరోగ్యంగా ఉండటమే.." అంటూ ఆమె ఇచ్చిన సందేశం మహిళలను బాగా ఆకట్టుకుంది. వయసు కేవలం ఒక అంకె మాత్రమేనని, సరైన పద్ధతులు పాటిస్తే ఎవరైనా దృఢంగా ఉండవచ్చని ఆమె నిరూపిస్తున్నారు. మహిళలకు అప్పర్ బాడీ స్ట్రెంత్ సాధించడం కష్టతరమైన పని. కానీ జ్యోతిక పుల్-అప్స్, చిన్-అప్స్ వంటి కఠినమైన వ్యాయామాలను అత్యంత సునాయాసంగా చేయడం ఈ వీడియోలో చూడవచ్చు. కేవలం వీటితోనే కాకుండా, ట్రైసెప్ డిప్స్, బెంచ్ హాప్స్, కోర్ వర్కవుట్లు చేస్తూ తన ఫిట్నెస్ స్థాయిని చాటి చెప్పారు.

## అనుకున్నది సాధించే వరకు నిద్రపోని రౌడీ జనార్ధన

టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్, 'రౌడీ' విజయ్ దేవరకొండ పుట్టినరోజు పురస్కరించుకుని ఆయన నటిస్తున్న మూవీ అప్డేట్స్ వస్తూ అభిమానులను ఖుషీ చేస్తున్నాయి. ఇందులో భాగంగా, విజయ్ దేవరకొండ హీరోగా రవి కిరణ్ కోలా దర్శకత్వంలో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్ నుంచి 'రౌడీ జనార్ధన' స్పెషల్ పోస్టర్ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పాత్ర పేరు 'రౌడీ జనార్ధన' అని చిత్ర బృందం ప్రకటించింది. పోస్టర్లో విజయ్ లుక్ ఎంతో పవర్ఫుల్గా ఉంది. గడ్డం పెంచి, మెడలో చైన్ తో, ఒక చేతిలో తుపాకి పట్టుకుని ఉన్న విజయ్ మేకోవర్ చూస్తుంటే, సినిమా పక్కా గ్రామీణ నేపథ్యం కలిగిన మాస్ యాక్షన్ ఎంటర్టైనర్గా ఉండబోతుందని అర్థమవుతోంది.అనుకున్నది సాధించే వరకు నిద్రపోని రౌడీ జనార్ధన" అనే క్యాప్షన్ ఈ పాత్రను తెలియజేస్తోంది. విజయ్ మళ్లీ కంప్లీట్ మాస్ అండ్ యాక్షన్ రోల్ చేస్తుండటంతో ఫ్యాన్స్ ఫుల్ జోష్లో ఉన్నారు. కేవలం ఈ సినిమానే కాకుండా, గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో చేస్తున్న ఎఆ12 నుంచి కూడా అప్డేట్స్ రావడంతో సోషల్ మీడియా అంతా రౌడీ నామస్మరణతో మారుమోగిపోతోంది. ఇందులో కీర్తి సురేష్ కథానాయికగా నటిస్తుంది.

## "నా వైఫ్ మిస్సింగ్" చిత్రం ప్రారంభం



వరుణ్ సందేశ్ హీరోగా కొమర మీడియా వర్క్స్ బ్యానర్ పై ఆహా సమర్పణలో శివ కంఠంనేని, ఆర్ వెంకటేశ్వర రావు నిర్మాతలుగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం "నా వైఫ్ మిస్సింగ్". ఇటీవలే నయనం వెబ్ సిరీస్ ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకున్న స్వాతి ప్రకాష్ మంత్రిప్రగడ దర్శకత్వంలో సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్ లో ఒక చక్కటి ప్రేమ కథగా ఈ చిత్రం రానుంది. ప్రవీణ్, మోహిత్, సత్య శ్రీ (జబర్దస్త్) తదితరులు కీలకపాత్రలు పోషించనున్నారు. సతీష్ కుమార్ ఎన్ఎస్ సినిమాటోగ్రఫీ చేయనున్న ఈ చిత్రానికి సాయి బాబు తలారి ఎడిటింగ్ చేస్తున్నారు. ఎన్నో చిత్రాలకు హిట్ మ్యూజిక్ అందించిన సాయి కార్తీక్ సంగీతం అందిస్తున్నారు. ఉమర్జీ అనురాధ ఈ చిత్ర కథను అందించగా శ్రీనివాస్ మండల స్క్రీన్ ప్లే రైటర్ గా ఉండగా ఆదిత్య భార్గవ్ డైలాగ్స్ అందిస్తున్నారు.

ఇటీవలే ఈ చిత్రం పూజ కార్యక్రమాలతో ప్రారంభం కావడం జరిగింది. ఆహా బృందం స్క్రిప్ట్ అందించగా సీనియర్ నిర్మాత సి కళ్యాణ్ గారు మొదటి క్లాప్ కొట్టారు. నటుడు, నిర్మాత, ఫిలిం ఛాంబర్ సెక్రటరీ గౌరవనీయులు అశోక్ కుమార్ గారు కెమెరా స్విచ్ ఆన్ చేయగా దర్శకుడు, జాతీయ అవార్డ్ గ్రహీత నీలకంఠ గారు తొలి షాట్ కు దర్శకత్వం వహించారు. కాగా నేటి నుండి ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ఇక ఈ చిత్రానికి సంబంధించిన ఇతర అప్డేట్స్, మిస్ అయిన వైఫ్ ఎవరు? అనే విషయాలు చిత్ర బృందం క్రమంగా విడుదల చేయనుంది.

నటీనటులు : వరుణ్ సందేశ్, ప్రవీణ్, మోహిత్, సత్య శ్రీ (జబర్దస్త్) తదితరులు.

## శివ్ ఎంటర్టైన్మెంట్స్ ప్రొడక్షన్ నెం.1 మూవీ ప్రారంభం



హన్ శివ్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్పై టి.డి.ప్రసాద్ వర్మ దర్శకత్వంలో ఎన్.మహేశ్వరి, పి.జ్యోతి నిర్మిస్తోన్న కొత్త చిత్రం పూజా కార్యక్రమాలతో సోమవారం రోజున లాంఛనంగా ప్రారంభమైంది. అనురాగ్, సంతోష్, సాయి విక్రాంత్, అలీ, చమ్మక్ చంద్ర, ఆటో రాంప్రసాద్, ఫణి, వినీత రెడ్డి. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు ఎస్.వి.కృష్ణారెడ్డి, నిర్మాత కె.అచ్చిరెడ్డి, నటుడు అలీ, డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, ఫణి సహా చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత కె.అచ్చిరెడ్డి క్లాప్ కొట్టగా, అలీ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఎస్.వి.కృష్ణారెడ్డి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా..

డైరెక్టర్ టి.డి.ప్రసాద్ వర్మ మాట్లాడుతూ "అనురాగ్ హీరోగా..ఎన్.మహేశ్వరి, పి.జ్యోతి నిర్మాతలుగా ప్రారంభమైన హన్ శివ్ ఎంటర్టైన్మెంట్స్ చిత్రం ఓ డిఫరెంట్ కథాంశంతో ప్రేక్షకులను అలరించనుంది. ఈ సినిమా టీమ్ను ఆశీర్వదించటానికి వచ్చిన ఎస్.వి.కృష్ణారెడ్డిగారికి, అచ్చి రెడ్డిగారికి, శ్రీనివాస రెడ్డిగారికి స్పెషల్ థాంక్స్ అలీగారు ఓ కీలక పాత్రలో మెప్పించనున్నారు. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్నీ ఎలిమెంట్స్తో సినిమాను రూపొందిస్తున్నాం. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను తెలియజేస్తాం" అన్నారు.

హీరో మాట్లాడుతూ "ప్రసాద్ వర్మగారు చెప్పిన పాయింట్ బాగా నచ్చింది. మంచి ప్రొడ్యూసర్ సపోర్ట్ దొరికింది. ఇందులో విలక్షణమైన పాత్రతో ఆడియెన్స్ను అలరించబోతున్నాను.అలీగారికి, ఎస్.వి.కృష్ణారెడ్డిగారికి, అచ్చి రెడ్డిగారికి థాంక్స్" అన్నారు.

సీనియర్ నటుడు అలీ మాట్లాడుతూ "హన్ శివ్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లో రాబోతున్న తొలి సినిమా. ఇందులో నేను కూడా ఓ మంచి పాత్రలో కనిపించబోతున్నాను. సినిమా మంచి విజయాన్ని సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అన్నారు.

నిర్మాతలు ఎన్.మహేశ్వరి, పి.జ్యోతి మాట్లాడుతూ "డైరెక్టర్ ప్రసాద్ వర్మగారు చెప్పిన వైవిధ్యమైన కథాంశంతో సినిమాను రూపొందిస్తున్నాం. మా బ్యానర్లో రానున్న తొలి సినిమా ఇది" అన్నారు.

నటీనటులు:అనురాగ్, సంతోష్, సాయి విక్రాంత్, అలీ, చమ్మక్ చంద్ర, ఆటో రాంప్రసాద్, ఫణి, వినీత రెడ్డి తదితరులు

# ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వినతులు స్వీకరించిన అదనపు ఎస్పీ ఎన్బి రత్నం



మహబూబ్ నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల వినతులను అదనపు ఎస్పీ ఎన్బి రత్నం నేరుగా స్వీకరించి శ్రద్ధగా విన్నారు. ప్రజలు తమ సమస్యలను వివరించగా, వాటిని పరిశీలించిన అదనపు ఎస్పీ సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకుని బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఎన్బి రత్నం మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి వేగవంతమైన పరిష్కారం చూపేందుకు ఒక వేదికగా పనిచేస్తోంది. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నాము" అని పేర్కొన్నారు.

# ఔట్ సోర్స్ ఉద్యోగులకు ఎంపి ఈటల మద్దతు



హైదరాబాద్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆర్థిక శాఖ కిందకు వస్తారు. వీరి సమస్యలు అన్నీ నాకు అవగాహన ఉన్నాయి. ?మీరు పెట్టిన అన్ని డిమాండ్స్ కూడా అమలుచేయగలిగినవే. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల దగ్గర 18% సర్వీస్ టాక్స్ వసూలు చేయడం దారుణం. ఇది న్యాయం కాదు. వారితో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు. ప్రభుత్వమే దోపిడీ చేస్తే ఎలా అని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు.

ఎంపి సోమవారం నాడు తెలంగాణ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేయేసి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు.

ఈటల మాట్ఆడుతూ ఈ ఉద్యోగులు ఇళ్ల కిరాయి, పిల్లల ఫీజులు, హాస్పిటల్ ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు డబ్బులు ఇచ్చి ఉద్యోగాల్లో చేరుతున్నారు. మధ్యలో ఉన్న ఏజెన్సీలు వారికి ఇష్టం వచ్చినట్టు ఉద్యోగులను తొలగిస్తున్నారు. ?ఏజన్సీ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న. ఉద్యోగ భద్రత ఇవ్వాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. ఇప్పుడున్న ఏజన్సీ వారు ప్రతి నెలా జీతం ఇవ్వాలి. పెద్దవాళ్లు ఎట్లన్నా బ్రతుకుతారు, వీరు ఎలా బ్రతకాలనే ఆలోచన చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు.

పీఎఫ్, ఈఎస్ఐ లు ఏజన్సీలు ఖచ్చితంగా కట్టాలి. లేకపోతే చర్యలు తీసుకోవాలి. హెల్త్ కార్డులు ఇవ్వాలి ?చనిపోతే కోటి రూపాయలు వచ్చేలా ఇన్స్యూరెన్స్ చేయించాలి. ?మానవత్వం లేకుండా లక్షల మంది కుటుంబాలతో చెలగాటమాడవద్దు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు లేకపోతే ఆఫీస్లు కూడా నడవవు. ?ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ ఇలాంటి వారి బ్రతుకులు మాత్రం మారడం లేదు. పాలకులు మానవత్వంతో స్పందించినప్పుడే ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. మేము ఏ పార్టీలో ఉన్నా పేదల కోసం మాట్లాడతాము. మీ సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాట కార్యాచరణ రూపొందించండి? నా సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు.

# బండి భగిరథ్ ను అరెస్టు చేయాలని బీఆర్ఎస్ నిరసన

నాగర్ కర్నూలు బండి సంజయ్ కుమారుడు భగీరథపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఇంకా ఎందుకు అరెస్ట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని వెంటనే బండి సంజయ్ కొడుకును అరెస్ట్ చేయాలని నాగర్కర్నూల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు నిరసన వ్యక్తం చేసారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు.

కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాష్ట్ర హోమ్ శాఖను దగ్గర పెట్టుకున్న రేవంత్ రెడ్డి కుమ్మక్కై కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని మండి పడ్డారు. మైనర్ బాలికకు న్యాయం చేయకుండా, బండి సంజయ్ కుమారుడిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని, రాష్ట్రంలో పేదలకు ఒక న్యాయం పెద్దలకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. జరిగిన ఘటనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ పదవికి రాజీనామా చేయాలని, రేవంత్ ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో బాధితుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతుందని స్పష్టం చేశారు.

# వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీపంపిణీ చేసిన ఎమ్మెల్యే అరవింద బాబు



నరసరావుపేట, పల్నాడు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నరసరావుపేటలోని గుంటూరు రోడ్డులో గల ఎమ్మెల్యే కార్యాలయంలో వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదరవాడ అరవింద బాబు చేతుల మీదుగా నలుగురు వికలాంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సైకిళ్లు అందుకున్న వారిలో 1.వాళ్లేం యోగమ్మ, ఏల్చూరు గ్రామం, 2.కుమ్మరి కుంట బంగారయ్య, 5వ వార్డు, క్రిస్టియన్ పాలెం, 3.మాడిశెట్టి నాగేంద్రరావు,5వ వార్డు, క్రిస్టియన్ పాలెం, 4.కటికల పూర్ణయ్య నరసరావుపేట వారికి అంద చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు మాట్లాడుతూ, వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. వారి స్వయం ఉపాధికి, సంచారానికి అవసరమైన సదుపాయాలు కల్పించడం తమ ప్రథమ కర్తవ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు, ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ట్రై సైకిళ్లు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఇంచార్జ్ కలెక్టర్ సంజన సింహా అర్ధరాత్రి 2 గం.లకు అందిన సమాచారంపై స్పందన



వెల్దుర్తి, పల్నాడు జిల్లా మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గం వెల్దుర్తి మండల పరిధిలోని రామచంద్రాపురం తండాలో ఒక బాల్య వివాహాన్ని ఇంచార్జ్ కలెక్టర్ సంజన సింహా సకాలంలో స్పందించి, అధికారులను అప్రమత్తం చేయడం ద్వారా విజయవంతంగా అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే రామచంద్రాపురం తండాలో ఒక మైనర్ బాలికకు వివాహం జరుగుతున్నట్లు అర్ధరాతి 2 గంటలకు సమాచారం అందుకున్న ఇంచార్జ్ కలెక్టర్, వెంటనే సంబంధిత అధికారులను క్షేత్రస్థాయికి వెళ్లాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వెల్దుర్తి తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది, ఎస్.ఐ, ఐ.సి.డి.ఎస్ మరియు చైల్డ్‌లైన్ ప్రతినిధులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు.?అధికారులు బాలిక వయస్సు ధృవీకరణ పత్రాలను పరిశీలించగా, వివాహానికి చట్టబద్ధమైన వయస్సు నిండలేదని నిర్ధారణ అయ్యింది. దీంతో అధికారులు వెంటనే వివాహాన్ని నిలిపివేసి, బాలికను సంరక్షణలోకి తీసుకున్నారు. పిల్లల బంగారు భవిష్యత్తును నాశనం చేసే బాల్య వివాహాలను జరపవద్దని ఇంచార్జ్ కలెక్టర్ సంజనా సింహా తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారం వివాహానికి బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండడం తప్పనిసరి అన్నారు. నిబంధనలు అతిక్రమించి బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులు, ఇందుకు సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# 10వ తరగతి పరీక్షలలో ప్రతిభావంతుల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి



ఎమ్మిగనూరు ఎమ్మిగనూరు పట్టణంలోని మచాని సోమప్ప జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల (ఎంఎస్ జెడ్ పి హెచ్ బాలికల స్కూల్)లో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినుల సన్మాన కార్యక్రమం మరియు పతకాలు, ప్రశంసా పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని దీపప్రజ్వలనతో ప్రారంభించి, మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఎస్ఎస్సీ పరీక్షల్లో 550కు పైగా మరియు 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థినులను పతకాలు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మరియు తల్లిదండ్రులు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేసిన 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక తమకు ఎంతో ఉపయోగపడిందని, ఉన్నత మార్కులు సాధించడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. విద్యార్థులను పెద్ద లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న విద్యా శాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు, ఆధునిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తమ విద్యను ప్రభుత్వ పాఠశాలల ద్వారానే పొందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. అలాగే ఈ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందే స్థాయికి చేరుకోవడం గొప్ప విజయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు, ప్రధాన ఉపాధ్యాయులు, మార్కెట్ యార్డు చైర్మన్, కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ చైర్మన్, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్, టీడీపీ పార్లమెంట్ నాయకులు, పట్టణ కమిటీ సభ్యులు, వార్డ్ కమిటీ సభ్యులు, క్లస్టర్ కన్వీనర్లు, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీసేందుకే సమ్మర్ క్యాంపుల నిర్వహణ: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఒత్తిడి కలగకుండా,వారిలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సమ్మర్ క్యాంపులను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం నుండి ఈ నెల 17 వరకు నిర్వహించనున్న విద్యా వారోత్సవాల సందర్భంగా సిరిసిల్ల పట్టణం గీతానగర్ లోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సమ్మర్ క్యాంపు ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలు క్షేత్ర స్థాయిలో వివరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా వారోత్సవాలు నిర్వహించడానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈరోజు జిల్లాలోని 9 పీఎంశ్రీ పాఠశాలతో పాటు, కేజీబీవీ రుద్రంగి లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. రోజువారీగా ఈరోజు నుండి 17 వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెలుముల స్వరూప, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్, మండల విద్యాధికారి రఘుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, తదితరులు పాల్గొన్నారు.

## తాగకున్నా తాగినట్లు బ్రీత్ ఎనలైజర్ మెషిన్ చూపిస్తోంది

# మంచిర్యాల డిపో ఎదుట ఆర్టీసీ డ్రైవర్ల ఆందోళన

మంచిర్యాల మద్యం తాగకున్నా బ్రీత్ ఎనలైజర్ మెషిన్ తాగినట్లు చూపిస్తుందని, దీంతో అధికారులు తమను విధుల్లోకి తీసుకోవడం లేదని డిపో ఎదుట డ్రైవర్లు బైఠాయించారు. తాము మద్యం తాగలేదని మెషిన్ మార్చాలని డిమాండ్ చేస్తూ డ్రైవర్లు నిరసన కు దిగారు. పలువురు ఆర్టీసీ డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయగా 56 పైగా రీడింగ్ చూపించింది. దాంతో ఆర్టీసీ సేవలు నిలిచిపోయాయి. బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలవడమే మా లక్ష్యం - హుగ్గేల్లీ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి



**జహీరాబాద్,మే 11 ప్రజా బలం ప్రతినిధి:** సామాజిక సేవే లక్ష్యంగా,పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలవాలనే సంకల్పంతో హుగ్గేల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు.హుగ్గేల్లీ గ్రామానికి చెందిన మాలేకాడి నర్సమ్మ - నర్సిములు దంపతుల కుమార్తె అశ్విని (సుస్మిత) వివాహ ప్రధానము కార్యక్రమానికి సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి హాజరై ఆశీర్వదించారు.ఈ సందర్భంగా వధువు కుటుంబానికి వివాహ కానుకగా ?10,000/- (పది వేల రూపాయల) చెక్కును సర్పంచ్



అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ,సమాజంలో మార్పు తీసుకురావాలన్నా, పేద కుటుంబాల్లో వెలుగులు నింపాలన్నా సామాజిక సేవ ఎంతో అవసరం.ముఖ్యంగా ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందించడం మా బాధ్యతగా భావిస్తున్నాం" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి,గ్రామ వార్డు సభ్యులు బాల్ రాజ్,నరేష్,నాయకులు పాండురంగా రెడ్డి,రాజశేఖర్, సంజీవ్,రాములు, నర్సిములు,మొగులప్ప,మహేష్ గ్రామస్థులు,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.సర్పంచ్ చేసిన ఈ ఆర్థిక సహాయాన్ని గ్రామ ప్రజలు మరియు వధువు కుటుంబ సభ్యులు కొనియాడారు.

# సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సానుకూల స్పందన.



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 11 మే 2026**సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన సోమవారం రోజున స్థానిక సమస్యలైన: వీధి దీపాలు, పారిశుధ్య పరిష్కార చర్యలు చేపట్టడానికి గాను మణికొండ వార్డ్ 127 అబ్దుల్ కలాం పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పంచవటి కాలనీ అధ్యక్షుడు/ ది సిటిజన్స్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీతారాం ధూలిపాళ క్రింది అంశాలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు: రోడ్ నెం.10 వద్ద చెక్ డ్యామ్‌తో బుల్కాపూర్ నాలా పునరుద్ధరణ చేసి నీటిని షేక్‌పేట్ నాలాకు మళ్లించడం ద్వారా పందేన్ వాగుపై భారం తగ్గించాలి. భారీ వర్షాలను తట్టుకునే సమగ్ర అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ అవసరం. మర్రిచెట్టు రోడ్డులో తొలగించిన బస్ షెల్టర్లను తిరిగి ఏర్పాటు చేయాలి. ట్రైల్స్ విల్లాస్ ఎదురుగా బాక్స్ డ్రెయిన్ కమ్ రోడ్, అలాగే రోడ్ నెం.10 బ్రిడ్జ్ కనెక్టివిటీ ద్వారా ట్రాఫిక్ సమస్య తగ్గించాలి. గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం వార్డ్ 127 మణికొండ ఉత్తర, తూర్పు సరిహద్దులను ఖరారు చేయాలి. వెంకటేశ్వర కాలనీ / ది సిటిజన్స్





కౌన్సిల్ అధ్యక్షుడు ఉపేంద్రనాధు రెడ్డి ప్రస్తావిస్తూ: కాలనీలో లైబ్రరీ, వీధి దీపాలు, మొక్కల పెంపకం, ప్లాట్ 200 నుండి 205 వరకు సిమెంట్ రోడ్డు వేయాలని, గోల్డెన్ టెంపుల్ నుండి తారామతి బారాదరి మధ్యలోన్ని ఆక్రమణలను తొలగించలని తెలుపడ మైనది. విచ్చేసిన ప్రతినిధుల ప్రతిపాదనలను సావకాశంగా విని అందుకు స్పందించి సమయానుకూలంగా ప్రజా సమస్యలను తీరుస్తానని, జూన్ 1 నుండి డ్రైనేజ్ నిర్వహణను జలమండలికి అప్పగించే విషయాన్ని వివరించారు.

# మిత్రుని దశదినకర్మ కు ఆర్థిక సహాయం అందించిన మిత్రులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 11 2026 ఏటూరు నాగారం** ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ఒకటవ వార్డుకు చెందిన పాణి సత్యనారాయణ అనారోగ్య కారణంగా మృతి చెందడంతో ఈ విషయము తెలుసుకున్న 2003 ఎస్ ఎస్ సి బ్యాచ్ బాల్య మిత్రులు దశదినకర్మకు హాజరై వారి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తూ సత్యనారాయణ కూతురి పై పోస్ట్ ఆఫీస్ లో 25 వేల రూపాయల డిపాజిట్ చేసిన 2003 బ్యాచ్ ఎస్ ఎస్ సి బాల్యమిత్రులు సత్యనారాయణ కుటుంబానికి తన తోటి మిత్రులు ధైర్యాన్ని అందజేశారు

ఈ కార్యక్రమంలో స్నేహితులు స్నేహితురాలు పాల్గొన్నారు

# ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల దోస్త్ అడ్మిషన్ పోస్టర్ ను ఆవిష్కరించిన :: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 11 2026 ములుగు**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలిలో భాగంగా ఈ నెల ల11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఎడ్యుకేషన్ వీక్‌ను ఘనంగా నిర్వహించాలని,కళాశాలలో అడ్మిషన్లు పెంచేందుకు ప్రతి అధ్యాపకుడు కృషి చేయాలని సూచించారు.

ఎడ్యుకేషన్ వీక్‌లో భాగంగా నిర్వహించే వివిధ కార్యక్రమాలను ప్రిన్సిపల్ కలెక్టర్‌కు వివరించారు. మొదటి రోజు ప్రారంభ సమావేశంతో పాటు అడ్మిషన్ల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కళాశాల వివిధ విద్యా సంస్థలతో చేసుకున్న ఎంఓయూలను ప్రదర్శించారు. వారం రోజులపాటు ప్రతిరోజు ఒక్కో కార్యక్రమం నిర్వహిస్తామని ప్రిన్సిపల్ తెలిపారు. పీజీ ఎంట్రన్స్ కోచింగ్, యోగా క్లాసులు, లైబ్రరీ డే, పుస్తక ప్రదర్శన, పేరెంట్-టీచర్ మీటింగ్, పూర్వ విద్యార్థుల మీటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవగాహన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో అప్రెంటిషిప్‌కు ప్రాధాన్యత ఇచ్చే ఫ్రీజూ:// బీకాం (ఈ ఎఫ్ ఎస్ ఐ కోర్సును ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. మొదటి రెండేళ్లు కళాశాలలో విద్యతో పాటు పారిశ్రామికవేత్తల ద్వారా నైపుణ్య శిక్షణ ఇస్తారు. ఫైనల్ ఇయర్‌లో వివిధ సంస్థల్లో నెలకు కనీసం రూ. 7,000 స్టైఫండ్‌తో అప్రెంటిషిప్ ఉంటుంది. కోర్సు పూర్తయిన తర్వాత వివిధ ఆర్థిక సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రిన్సిపల్ కొప్పుల మల్లేశం తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి. బాలయ్య, దోస్త్ కన్వీనర్ డాక్టర్ జై శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 165 దరఖాస్తులు ప్రజావాణి అర్జీలకు పరిష్కారం చూపాలి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మే -- 11 ( ప్రజాబలం ప్రతినిధి)** రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 165 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సమస్యలను పరిష్కరించాలి :: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 11 2026 ములుగు** సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, డివిజనల్ స్థాయి ప్రజావాణిలో ఆర్‌డీఓ వెంకటేష్ ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 67 దరఖాస్తులు రాగా, వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 11, పెన్షన్లకు 20, ఉపాధి కల్పన 01, ఇతర శాఖలకు సంబంధించినవి 13, డివిజనల్ స్థాయిలో భూ సమస్యలకు సంబంధించి 21, సీనియర్ సిటిజన్ 01 దరఖాస్తులు అందాయి.

ప్రజల సమస్యల దరఖాస్తులను నేరుగా జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందని తెలిపారు.

డివిజన్ స్థాయిలో అందిన భూ సమస్యల దరఖాస్తులను వెంటనే తాసిల్దార్లకు ఆన్‌లైన్‌లో ఫార్వర్డ్ చేయడం జరిగిందని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలపై దరఖాస్తులు అందించిన వారు తమ దరఖాస్తు స్థితిగతులను అధికారులు అందించిన రసీదు ద్వారా ఆన్లైన్ లో పరిశీలించుకోవచ్చని తెలిపారు.ప్రజావాణి దరఖాస్తులకు అధికారులు ప్రాధాన్యత ఇచ్చి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, వాటి స్థితిగతులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బీఆర్ఎస్ శ్రేణులు

సాగర్ పోక్సో కేసు బాధితురాలైన 17 ఏళ్ల మైనర్ బాలిక వ్యక్తిత్వం గురించి కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ చేసిన దిగజారుడు వ్యాఖ్యలను ఖండిస్తూ నాగార్జునసాగర్ నియోజకవర్గం హాలియా పట్టణంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ శ్రేణులు దహనం చేసారు. బండి సంజయ్ను వెంటనే అరెస్ట్ చేసి మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసారు.

# మామిడ్గీ లో జూదరుల అరెస్ట్



**జహీరాబాద్, మే 11 ప్రజాబలం ప్రతినిధి:** న్యాల్కల్ మండలంలోని మామిడ్గి గ్రామంలో జూదరులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు హద్నూర్ ఎస్సై సుజిత్ తెలిపారు. సోమవారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి నిర్వహించి ఏడు మంది జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి7020 నగదు, 6 మొబైల్ ఫోన్లు, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

# సంగారెడ్డిలో 50మంది చిన్నారులకు సైకిల్స్ పంపిణీ చేసిన జగ్గారెడ్డి



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మే 11 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి పట్టణంలోని 50 మంది చిన్నారులకు ఈ రోజు (సోమవారం) జగ్గారెడ్డి, చిన్నారులకు సైకిల్స్ పంపిణీ చేశారు. ఈ వేసవి సెలవుల్లో ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలని ఈ సందర్భంగా జగ్గారెడ్డి, చిన్నారులకు సూచించారు. ఎండలో సైకిల్స్ తొక్కవద్దన్నారు. తమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకున్న చిన్నారులకు విడతల వారీగా సైకిల్స్ పంపిణీ కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు 320 సైకిల్స్ పంపిణీ పూర్తయింది. మరో 600సైకిల్స్ పంపిణీ కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జార్జ్, చిద్రుప్ప రఘు గౌడ్, కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీకాంత్ గౌడ్, సుదీప్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణితో సమస్యల పరిష్కారం: ఆర్డిఓ దేవుజ




**జహీరాబాద్, మే 11 ప్రజాబలం ప్రతినిధి :** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జహీరాబాద్ ఆర్డిఓ దేవుజ పేర్కొన్నారు. జహీరాబాద్ తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం డివిజన్ పరిధిలోని అధికారులతో కలిసి ఆర్డిఓ దేవుజా ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల నుండి 28 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. తహసిల్దార్ దశరథ్, ఎంపీడీవో మహేందర్ రెడ్డి , వ్యవసాయ అధికారి లావణ్య వివిధ శాఖల డీఈలు, ఏఈలు అధికారులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ నియోజకవర్గంలో పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నా ఆవుల రాజిరెడ్డి

## నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి






**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మే 11 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :**నర్సాపూర్ నియోజకవర్గంలోని నర్సాపూర్, శివ్వంపేట, కొత్తపల్లి, రామయపల్లి, శెట్టి పల్లి, కాలాన్, కాగజ్ మద్దూరు,గ్రామాలలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరై లబ్ధిదారులకుశుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని సూచించారు,
వెల్దుర్తి,మండలం ఎదులపల్లి, గ్రామంలో ఇటీవల వివాహం చేసుకున్న నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.
శివ్వంపేట,మండలం గోమారం,గ్రామంలో నిర్వహించిన శ్రీ బీరప్ప, జాతర ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 11 2026 ములుగు** సోమవారం తెలంగాణ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా నుంచి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో రాబోయే 15 రోజుల్లో కనీసం 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. స్టేషన్ ఘన్‌పూర్, అశ్వారావుపేట వంటి నియోజకవర్గాలు ఇప్పటికే 80 శాతానికి పైగా మ్యాపింగ్ పూర్తి చేశాయని తెలిపారు. ఒడిశా రాష్ట్రం ఇప్పటికే 90 శాతం, కర్ణాటక 81 శాతం, మహారాష్ట్ర 68 శాతం మ్యాపింగ్ పూర్తి చేశాయని, తెలంగాణ ఇంకా వెనుకబడి ఉందని పేర్కొన్నారు.




జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను ప్రోత్సహించి మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు ఎస్ఐఆర్ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను అన్ని వనరుల నుంచి గుర్తించి నియమించుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రారంభమైన తర్వాత ప్రతిరోజూ ఫారాల పంపిణీ, సేకరణపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ ఎవరో తెలిసేలా చర్యలు తీసుకోవాలని, నిజమైన ఓటరు తన ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని ఆదేశించారు.మ్యాపింగ్ పురోగతిని పెంచేందుకు రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించి నియమిస్తున్నామని, రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి అర్హ ఓటరు పేరు సక్రమంగా మ్యాపింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, ఎలక్షన్ సూపరింటెండెంట్ ఎండి సలీం,డిప్యూటీ తహసిల్దార్ నితీష్ కుమార్,సీనియర్ అసిస్టెంట్ మనోహర్,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు

# మద్యం మత్తులో సొంత బైక్‌ను తగులబెట్టిన యువకుడు



రుద్రవరం కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు మద్యం మత్తులో తన ద్విచక్ర వాహనాన్ని తగులబెట్టుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. సిఐ రాము తెలిపిన వివరాల మేరకు.. కొత్తూరు రోడ్డుకు వెళ్లే దారిలో దూదేకుల మౌలాలి (23) అనే యువకుడు మద్యం సేవించి, ఆ మత్తులో తన బైక్‌ను (ంఖ 39 ఆ 2927) కాల్చివేశాడు.సమాచారం అందుకున్న ఎస్ఐ జయప్ప సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. బ్రీత్ అనలైజర్ పరీక్షలో 273 రీడింగ్ రావడంతో నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సిఐ పేర్కొన్నారు.

# ఎస్సీ హోదా కోసం కదం తొక్కిన దళిత క్రైస్తవులు

## వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించిన దళిత క్రైస్తవులు

## మండల తహాశీల్దార్ కు వినతి పత్రం అందజేసిన దళిత క్రైస్తవులు

## సహనం కోల్పోతే ఇక సమరమే!: దళిత ప్రజాసంఘాలు వెల్లడి

ఎమ్మిగనూరు ఎమ్మిగనూరు పట్టణంలో క్రైస్తవులుగా ఉన్న దళితులను ఎస్సీలుగానే కొనసాగించాలని కోరుతూ... సోమవారం ఎమ్మిగనూరు నియోజకవర్గ పాస్టర్ల కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీకి వేలాదిమంది దళిత క్రైస్తవులు స్వచ్ఛందంగా తరలివచ్చి జయప్రదం చేశారు. ముందుగా దళిత క్రైస్తవులు, దళిత సంఘాల నేతలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పట్టణంలోని యం.బి.చర్చి నుండి మండల తహాశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పురవీధులను నినాదాలతో హోరోత్తించారు. అంబేద్కర్ సర్కిల్ కు చేరుకొని రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమం టౌన్ పాస్టర్ల కమిటి అధ్యక్షులు పాస్టర్ ఎలీషా,రూరల్ పాస్టర్ల కమిటి అధ్యక్షులు పాస్టర్ యోహాను, ఎం.బి.యెరూషలేము చర్చి పాస్టర్ రెవరెండ్ జయరాజు బండెల ఆధ్వర్యంలో వారి అధ్యక్షతన జరిగింది. మండల తహాశీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి తహాశీల్దార్ బి. శ్రీనివాసులు కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... దళితులు క్రైస్తవం, ఇస్లాం మతం మారినంత మాత్రాన కులం మారడం లేదని, సామాజిక అసమానతలు తొలగిపోలేదని చింతాడ ఆనంద్ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో గౌరవ సుప్రీంకోర్టు చర్చికి వెళ్లే దళితులకు రిజర్వేషన్ల వర్తించవని, ఎస్సీ కోల్పోతారని తీర్పు ఇవ్వడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. దళితులకు మాత్రమే మతం మారే మత స్వేచ్ఛ లేనప్పుడు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,15,25 లు ఎందుకు ఉన్నాయే అర్థం కావడంలేదని ప్రశ్నించారు. దళితులకు మతంతో



సంబంధం లేకుండా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. అగ్రకులాలు మతం మారితే వారి కులం మారదు, ఎస్టీలు సైతం మతం మారితే ఎస్టీలుగానే పరిగణిస్తున్నప్పుడు దళితులకు మాత్రమే ఈ షరతు విధించడం ఎంతవరకు న్యాయమని ఆవేదన చెందారు. నాడు గుడిలోకి రానివ్వకుండా, నేడు చర్చికి పోనివ్వకుండా చేస్తున్నారు. మేము ఏ దేవుని మొక్కాలని ప్రశ్నించారు.ఎస్సీలు ఏ పాపం చేశారని ఆవేదన చెందారు.1950 లో జారీ చేసిన రాష్ట్రపతి ఉత్తరంలోని వివక్షాత్మక నిబంధనలను రద్దు చేయాలని, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునర్విచారణకు రాజ్యాంగ పెంచుకు పంపాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు గారు దళిత క్రైస్తవులకు ఎస్సి హోదా కొనసాగించేలా అసెంబ్లీ తీర్మానం చేసి పార్లమెంటులో చట్టబద్ధత కల్పించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విన్నవించారు. ఎస్సీ హోదాపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం ప్రదర్శిస్తే... గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. సహనం కోల్పోతే సమరానికి సిద్ధంగా ఉన్నామన్నారు. దళిత క్రైస్తవులపై దాడులు జరిగితే సహించేది లేదని, మౌనం వీడి దళిత క్రైస్తవులు సత్తాను చాటుతామన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోసం ఐక్య ఉద్యమాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్), మాల మహానాడు, ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్(ఏఐసిసి), సిపిఐ,వైయస్సార్సీపి, ఎం.ఈ.ఎఫ్,న్యాయవాదులు, డా.బి.ఆర్.అంబేద్కర్ భవన సాధన కమిటి,నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్.సి.సి), రన్ ఫర్ జీసస్ కమిటి, దళిత రచయితల సంఘం (దరసం), జై భీమ్ ఎమ్మార్పీఎస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేడ,బుడగ జంగం హక్కుల పోరాట సమితి, ఎంపీజే, పూలే – అంబేద్కర్ ఐడియాలజీ కమిటి, బి.ఎస్.ఎస్., పూలే,అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటి, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటి, ఆంధ్రప్రదేశ్ దళిత వాడల అభివృద్ధి కమిటి ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. దళిత క్రైస్తవ ఉద్యమానికి, పాస్టర్ల కమిటీకి సంఘీభావం తెలియజేసి మద్దతును ప్రకటించారు.

# తొర్రూరు లో రైతుల రాస్తారోకో

మహబూబాబాద్ మొక్కజొన్నలు తెచ్చి రెండు నెలలు అవుతుంది ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు. అకాల వర్షాలకు మొలకలు వస్తున్నాయి. ఏ రాత్రి ఏం జరుగుతుందో అని ఇక్కడే కాపలా ఉండాల్సి వస్తుందని మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండల కేంద్రంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని నినాదాలు చేసారు. . అత్తా కోడళ్ళు వెంటనే రావాలి అంటూ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు.రైతుల రాస్తారోకో తో వామణాలు భారీగా నిలిచిపోయాయి.

## హామీల అమలులో విఫలం:
## ఎమ్మెల్యే అఖిల ప్రియపై భూమా కిషోర్ రెడ్డి విమర్శలు




ఆళ్లగడ్డ ఆ ళ్లగడ్డ: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియపై వైసీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ఆమె పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు.సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన, కొత్త పింఛన్లు, మహిళలకు ఆర్థిక సహాయం, యువతకు ఉద్యోగాల కల్పన వంటి హామీలు కేవలం మాటలకే పరిమిత మయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతను మోసం చేశారని మండిపడ్డారు.రైతుల సమస్యలపైనా ఎమ్మెల్యే నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారని ఆయన విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ స్పందన లేకపోవడంబాధాకరమన్నారు. వెంటనే చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలను పట్టించుకోకుండాకాలయాపన చేయడం తప్ప అఖిల ప్రియ నుంచి ఉపయోగకర చర్యలు కనిపించడం లేదని భూమా కిషోర్ రెడ్డి విమర్శించారు.

## కిషోర్ వికాసం విజయవంతం చేయాలి

రాయచోటి ,మే 11 కిషోర్ వికాసం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాయచోటి నియోజకవర్గం టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు సోమవారం రాయచోటి పట్టణంలోనిర్వహించినకిశోరీ వికాసం - 2026 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా లక్ష్మి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూసోమవారం పట్టణంలోని సుండుపల్లి రోడ్ నందు గల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్ నందు మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోరి వికాసం-2026 బాల బాలికల వేసవి సెలవుల శిక్షణా కార్యక్రమాన్ని కిశోర బాలిక బాల బాలికల కోసం సద్వినియోగం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు .కార్యక్రమంలో అధికారులతో కలిసి పాల్గొన్న నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి కిశోర బాల బాలికల సాధికారత మన అందరి బాధ్యత అని తెలియజేశారు.. బాల్య దశలో నేర్పించిన నాలుగు అక్షరాలే విద్యాభివృద్ధికి పునాది లాంటివని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు సిబ్బంది టీచర్లు కిషోర్ బాల బాలికలకు శ్రద్ధ శక్తులతో ఆటల పాటలతో ఆ చిన్నారుల మనస్సును గెలుచుకోవాలని సూచించారు. సులత సులభతరమైన రీతిలో తినుబండారాలు ఇస్తూ ఉత్సాహంగా విద్యాభ్యాసం కొనసాగించాలని చెప్పారు. చిన్నారులను ఇంటి దగ్గర కూడా వారి తల్లిదండ్రులు నాలుగు అక్షరాలు నేర్పించే విధంగా ఐసిడిఎస్ సిబ్బంది సూచనలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలో ఉన్న బాల బాలికలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు..ఈ కార్యక్రమంలో మండల మహిళా సమైక్య అధికారులు మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..రాయలసీమ స్కూల్ సుబ్బారెడ్డి పార్తివదేహానికి డాక్టర్ మండిపల్లి లక్ష్మి ప్రసాద్ నివాళులు అర్పించారు.అన్నమయ్య జిల్లా, రాయచోటి పట్టణం కాలనీ నందు నివసించు రాయలసీమ స్కూల్ సుబ్బారెడ్డి అనారోగ్య సమస్య తో బాధపడుతూ సోమవారం మరణించాడు. విషయం తెలుసుకున్న డాక్టర్ మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి మృతుడి స్వగృహంనకు చేరుకొని సంతాపం తెలియచేసారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి... ఏవో సురేష్ బాబు




తుగ్గలి: నకిలీ విత్తనాల పట్ల రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని తుగ్గలి మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు తెలియజేశారు.సోమవారం రోజున విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న దశలో మార్కెట్ నందు లభించే నకిలీ విత్తనాలను కొనుగోలు చేయరాదని ఆయన రైతులకు సూచించారు.ఒకవేళ రైతులు విత్తనాలను కొనుగోలు చేస్తే రసీదులు తీసుకొని వాటిని భద్రపరుచుకోవాలని ఏవో తెలియజేశారు.అదేవిధంగా మండలంలో యూరియా కొరత లేదని, గ్రామాల పరిధిలోని గల రైతు సేవా కేంద్రాల యందు తగినంత యూరియా అందుబాటులో ఉన్నదని ఆయన తెలియజేశారు.అదేవిధంగా రైతులకు కొరకు రైతు పనిముట్లు అందుబాటులో ఉన్నాయని,కావలసిన రైతులు రైతు సేవ కేంద్రాల యందు ఆన్లైన్ నందు నమోదు చేసుకోవాలని ఆయన తెలియజేసారు.మండల వ్యాప్తంగా రైతు విశిష్ట సంఖ్య పొందని రైతులు ఉన్నారని, వారు వెంటనే తమ పరిధిలోని గల రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి రైతు విశిష్ట సంఖ్యను చేయించుకోవాలని ఆయన తెలియజేశారు.రైతు విశిష్ట సంఖ్య కలిగిన రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడలో దారుణం...

కాకినాడ, మే 11, కాకినాడ నగరంలోని గాంధీనగర్లో దారుణ ఘటన చోటుచేసుకుంది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఏపీఎస్పీ (ఒఖూఖ) కానిస్టేబుల్ నాగేశ్వరరావును గుర్తుతెలియని వ్యక్తులు అత్యంత క్రూరంగా హత్య చేశారు.

ఒక్కసారిగా దాడి చేసిన నిందితులు, కత్తితో గొంతు కోయడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. జనసంచారం ఉండే ప్రాంతంలోనే ఈ హత్య జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ప్రాథమిక విచారణలో భాగంగా పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

పాత కక్షల కారణంగానే ఈ హత్య జరిగిందా లేక వ్యక్తిగత కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ దారుణానికి పాల్పడిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## లండన్ ఐదేళ్ల ప్రేమను పెళ్లి బంధంగా సాయిచరణ్, మియామే

లండన, మే 11, (న్యూస్ పల్స్) ప్రేమకు భాష, ప్రాంతం, దేశం వంటి హద్దులు ఉండవని మరోసారి రుజువైంది. ఆదిలాబాద్కు చెందిన యువకుడు, లండన్కు చెందిన యువతి తమ ఐదేళ్ల ప్రేమను పెళ్లి బంధంతో పదిలం చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో హిందూ సంప్రదాయాల ప్రకారం వీరి వివాహం వైభవంగా జరిగింది.వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ పట్టణంలోని కృష్ణానగర్కు చెందిన భూశెట్టి సాయిచరణ్ పదేళ్ల క్రితం ఉన్నత చదువుల కోసం లండన్కు వెళ్లారు. చదువు పూర్తయ్యాక అక్కడే వ్యాపారంలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో ఆయనకు లండన్లోని కార్డిఫ్కు చెందిన మియామేతో పరిచయం ఏర్పడింది. ఆ స్నేహం కాస్తా ప్రేమగా మారడంతో గత ఐదేళ్లుగా వారు ప్రేమలో ఉన్నారు.తమ ప్రేమ విషయాన్ని ఇరు కుటుంబాల పెద్దలకు తెలిపి వారిని ఒప్పించారు. భారతీయ సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం గత నెలలోనే భారత్కు వచ్చిన ఈ జంట, నిన్న ఆదిలాబాద్లోని ఓ ఫంక్షన్ హాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. భాష, ప్రాంతాలు వేరైనా ప్రేమతో ఒక్కటైన ఈ నూతన జంటను పలువురు అభినందించారు.

## ఏ3 అరెస్ట్

రాజమండ్రి,మే 11, దళిత యువకుడు, ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షులను బెదిరించిన వ్యవహారంలో పోలీసులు మరో ఇద్దరు నిందితులు కడియాల చిన్నబాబు(ఎ2), కడియాల సతీశ్(ఎ3)లను అరెస్టు చేశారు. హైదరాబాద్లో తలదాచుకున్న వీరిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు అనంతబాబు ఆదేశాలతో చిన్నబాబే సాక్షులను బంధించి, ప్రలోభాలకు గురిచేసి బెదిరించినట్లు పోలీసులు గుర్తించారు.ఎమ్మెల్సీ అనంతబాబు జైలు నుంచే చిన్నబాబు ఫోన్కు వీడియో కాల్ చేసి సాక్షులను బెదిరించినట్లు సమాచారం. మాజీ మంత్రి కన్నబాబుకు సన్నిహితుడైన చిన్నబాబును విచారిస్తే, సాక్షుల కొనుగోలుకు ఉపయోగించిన నిధుల మూలాలు, ఆర్థిక లావాదేవీల వివరాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ అరెస్టుతో కేసు దర్యాప్తులో కీలక పురోగతి లభించింది.

## ఫిర్యాదులు లేని జిల్లాగా నంద్యాల రూపుదిద్దాలి : జిల్లా కలెక్టర్ రాజకుమారి

### ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో ప్రజా ప్రతినిధులతో కలిసి పీజీఆర్ఎస్ కార్యక్రమాలు



నంద్యాల, మే 11 :- ప్రజా సమస్యలను క్షేత్రస్థాం ంలోనే పూర్తిస్థాయిలో పరిష్కరించి, ప్రజా ఫిర్యాదులు లేని జిల్లాగా నంద్యాలను తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ అంశాలపై జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డిఆర్ఓ రామునాయక్, ఆర్డీఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం ఉదయం 9.30 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని క్రమబద్ధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ఎదురయ్యే సమస్యలపై అవగాహన పెంపొందించేందుకు ఆర్డీఓలు తప్పనిసరిగా జిల్లా కేంద్రంలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి హాజరుకావాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించే లక్ష్యంతో ప్రతి నెలలోని శుక్రవారాల్లో నియోజకవర్గాల వారీగా ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఒకే వారంలో అన్ని సమస్యలు పరిష్కరించడం సాధ్యం కాకపోవడంతో, నెలలోని అన్ని శు క్రవారాల్లో ఒకే నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా సమస్యలను సమగ్రంగా పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా 134-ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మే నుంచి జూన్ వరకు, 135-శ్రీశైలం నియోజకవర్గంలో జూన్ నుంచి జూలై వరకు, 136-నందికొట్కూరు నియోజకవర్గంలో జూలై నుంచి ఆగస్టు వరకు, 138-పాణ్యం నియోజకవర్గంలో ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకు, 139-నంద్యాల నియోజకవర్గంలో సెప్టెంబర్ నుంచి అక్టోబర్ వరకు, 140-బనగానపల్లె నియోజకవర్గంలో అక్టోబర్ నుంచి నవంబర్ వరకు, 141-డోన్ నియోజకవర్గంలో నవంబర్ నుంచి డిసెంబర్ వరకు ప్రతి శుక్రవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సదరు కార్యక్రమాల రోజుల్లో ప్రజా ప్రతినిధులు ఆయా నియోజకవర్గాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ సెలవులు వచ్చిన సందర్భంలో గురువారం లేదా శనివారం నిర్వహించే అవకాశం ఉంటుందని, అవసరమైతే సెలవు రోజుల్లో కూడా కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించి మండల, మున్సిపల్, కలెక్టరేట్ అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.×ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి ఆర్థిక, ఆర్థికేతర అంశాల్లో నంద్యాల జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే స్థూల దేశీయోత్పత్తి సూచికల్లో 18వ స్థానం, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లలో మెరుగైన ప్రగతి నమోదు చేసినట్లు తెలిపారు. మండలాల్లో తాగునీటి, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా పంచాయతీ మరియు మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చర్యలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు.

## ఇంటర్ అడ్మిషన్లపై గందరగోళానికి తెర.. యథాతథంగా ప్రవేశాలు!

హైదరాబాద్, మే 11, తెలంగాణలో ఇంటర్మీడియట్ అడ్మిషన్లపై నెలకొన్న గందరగోళానికి ప్రభుత్వం తెరదించింది. 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలను యథావిధిగా కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇంటర్ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండటం, అడ్మిషన్లకు సమయం తక్కువగా ఉండటంతో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నారు.పాఠశాల విద్య తర్వాత డ్రాపవుట్లను తగ్గించేందుకు, సీబీఎస్ఈ తరహాలో 11, 12 తరగతులను పాఠశాలల్లోనే నిర్వహించాలని విద్యా కమిషన్ ప్రభుత్వానికి సూచించింది. ఈ నేపథ్యంలో ఇంటర్ను పాఠశాల విద్యలో విలీనం చేయాలని ప్రభుత్వం భావించింది. దీంతో ఇటీవల విడుదల చేసిన ఇంటర్ అడ్మిషన్ల షెడ్యూల్ను బోర్డు రద్దు చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.ఈ పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విలీన ప్రక్రియకు సమయం పడుతుందని, అనేక సాంకేతిక సమస్యలు ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. చివరి నిమిషంలో సమస్యల గురించి చెప్పడంపై అధికారుల తీరుపై సీఎం అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. కేవలం విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదనే ఈ ఏడాదికి పాత పద్ధతిలోనే అడ్మిషన్లకు అనుమతిస్తున్నట్లు స్పష్టం చేశారు.విలీన ప్రక్రియపై విస్తృతంగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఎడ్యుకేషన్ పాలసీ కమిటీని సీఎం ఆదేశించారు. ఆ నివేదికపై శాసనసభలో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఊరట లభించింది. ఈ నిర్ణయం పట్ల ఇంటర్ విద్యా జేఏసీ, ప్రైవేట్ జూనియర్ కాలేజీల యాజమాన్యాల సంఘం హర్షం వ్యక్తం చేశాయి.

## నా ప్రాణ స్నేహితుడా... వైరల్ గా మారుతున్న అషురెడ్డి పోస్ట్...



హైదరాబాద్, మే 11, బిగ్ బాస్ ఫేం, నటి అషు రెడ్డి ఎమోషనల్ పోస్ట్ చేశారు. టాలీవుడ్ యంగ్ హీరో భరత్ కాంత్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన బెస్ట్ ఫ్రెండ్ను కోల్పోయానని చెబుతూ అతనితో కలిసి దిగిన ఫోటోలను షేర్ చేశారు. భరత్ మృతి తనకు తీరని లోటని రాసుకొచ్చారు అషు రెడ్డి. 'ఇది నాకు తీరని లోటు... నా ప్రాణ స్నేహితుడు, నా కుటుంబం, అత్యంత ఆత్మీయుడైన వ్యక్తి ఇప్పుడు శివయ్యతో ఉన్నాడు. నీకు చేరని ఓ సందేశాన్ని నేను పోస్ట్ చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు. నీ చిరునవ్వు, నీ ముఖం ఎప్పటికీ గుర్తుంటాయి.. భరత్ కాంత్.. నా ప్రాణ స్నేహితుడా, బరువైన, విరిగిన హృదయంతో, వీడ్కోలు భరత్.' అంటూ ఎమోషనల్ పోస్ట్ చేశారు. భరత్ కాంత్ మృతి పట్ల పలువురు సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్, సినీ నటులు విచారం వ్యక్తం చేశారు. బిగ్ బాస్ ఫేం షణ్ముఖ జశ్వంత్ కూడాగ్రాంతి వ్యక్తం చేశారు.ఏపీలోని నెల్లూరుకు చెందిన నటుడు భరత్ కాంత్ (31), కెమెరామెన్ త్రిలోక్ (31) ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. పదేళ్ల క్రితం హైదరాబాద్ నగరానికి వచ్చిన వీరిద్దరూ నానక్రామ్గూడలో నివాసం ఉంటూ సినిమా ఛాన్సెస్ కోసం ప్రయత్నించారు. ఇప్పటికే పలు షార్ట్ ఫిల్మ్స్లో నటించిన భరత్ కాంత్... రీసెంట్గా టెనెంట్ సినిమాలో హీరోగా చేసి గుర్తింపు తెచ్చుకున్నారు. అటు తిలక్ వర్మ సైతం సినిమాటోగ్రాఫర్గా ప్రయత్నాలు చేస్తుండగా ఇంతలోనే ఈ ఘోరం జరిగింది.వ్యక్తిగత పనుల నిమిత్తం సొంతూరుకు వెళ్లిన ఇద్దరూ శనివారం రాత్రి కారులో వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున అంబర్పేట ఫ్లైఓవర్ ఎక్కి శంషాబాద్ వైపు వెళ్తుండగా... వీరు ప్రయాణిస్తున్న కారు ముందు వెళ్తున్న కంటైనర్ను ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. అతి వేగమే ఘటనకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరి మృతి పట్ల సినీ ఇండస్ట్రీ విచారం వ్యక్తం చేసింది.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com